ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 21.03.2027 | సంపుటి :12 సంచిక : 241 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# ప్రజాహితం మా పద్దుల లక్ష్యం

## శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్‌లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు.రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తరిగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించ డమని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణ మని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు మిగతా 2లో..

- ఆరు గ్యారంటీల అమలుకు రూ.50,713 కోట్లు
- జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు
- విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు
- వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
- పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
- విద్యా శాఖకు రూ.26,674 కోట్లు
- వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
- కార్మిక శాఖకు రూ.998 కోట్లు
- మహిళ, శిశు సంక్షేమానికి రూ.3,143 కోట్లు
- ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు,
- ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు
- బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు
- మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు
- ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు
- యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు
- మూసీ రివర్‌ఫ్రంట్‌కు రూ.1500 కోట్లు
- మహాలక్ష్మీ పథకం.. రూ.4,305 కోట్లు
- ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు,
- చేయూత పథకం.. రూ.14,861 కోట్లు,
- రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు
- 1.15 కోట్ల కుటుంబాలకు బీమా రూ.5 లక్షలు

**మొత్తం బడ్జెట్..** రూ.3,24,234 కోట్లు

**రెవెన్యూ వ్యయం..** రూ.2,34,406 కోట్లు

**మూలధన వ్యయం..** రూ.47,267 కోట్లు




అసెంబ్లీలో బడ్జెట్ పద్దును ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

### విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు

ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు బ్రేక్ ఫాస్ట్ పథకం 2లో..

### హామీలపై నిలదీస్తూనే ఉంటాం

గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన



హైదరాబాద్(జనంసాక్షి): ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామిలన్నీ నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద మిగతా 2లో..

## గ్యారెంటీలకు సమాధి కట్టారు

- బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం
- పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది
- కేటాయింపులపై హరీశ్ పెదవి విరుపు
- బడ్జెట్ ప్రతులను చించేసిన బీఆర్ఎస్
- ఆరు గ్యారెంటీలపై సభలో నినాదాలు
- బడ్జెట్ బహిష్కరిస్తూ సభ నుంచి వాకౌట్



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ బడ్జెట్‌పై బీఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవి వి చారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పించన్ పెంపు హామిలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ మిగతా 2లో..

### అంకెల ఆర్భాటాలు.. కేటాయింపుల ప్రగల్భాలు

అప్పులకోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ : కేంద్రమంత్రి బండి 2లో..

### శాసనసభ సోమవారానికి వాయిదా

# ఆరని యుద్ధ జ్వాలలు

**కువైట్‌లో కీలకమైన రిఫైనరీపై ఇరాన్ దాడి**

- దుబాయ్‌లోనూ భారీ పేలుళ్లు
- అమెరికా ,ఇజ్రాయిల్‌లకు మద్దతు ఇస్తే మరిన్ని దాడులు తప్పవని గల్ఫ్ దేశాలకు హెచ్చరికలు



- అమెరికా ఎఫ్-35ని కూల్చిన ఇరాన్
- లేదు.. అత్యవసర పరిస్థితుల్లో ల్యాండ్ చేశాం
- యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి ప్రకటన
- మొజ్తాబా బతికే ఉన్నారు..
- ఇరాన్ సుప్రీం నేత మాట్లాడుతున్న వీడియో విడుదల చేసిన ఇరాన్
- ఇజ్రాయెల్ దాడుల్లో కీలక సైనికాధికారి, ఐఆర్‌జీసీ ప్రతినిధి జనరల్ అలీ మహమ్మద్ నయినీ మృతి

హైదరాబాద్(జనంసాక్షి):గల్ఫ్ దేశాల్లోని కీలక చమురు వ్యవస్థలే లక్ష్యంగా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది. ఇటీవల ఖతార్‌లోని రస్ లఫాన్ గ్యాస్ క్షేత్రంపై, సౌదీ అరేబియాకు చెందిన అరామ్‌కోపై దాడులు చేయగా.. తాజాగా కువైట్ లో కీలకమైన మినా అల్- అహ్మదీ ఆయిల్ రిఫైనరీపై డ్రోన్ దాడికి పాల్పడింది.కువైట్‌లో శుక్రవారం రంజాన్ పండుగ జరుపుకుంటున్న తరుణంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. పశ్చిమాసియాలో అతిపెద్ద రిఫైనరీల్లో ఈ మినా అల్- అహ్మదీ కూడా ఒకటి. డ్రోన్ దాడి నేపథ్యంలో రిఫైనరీలో భారీగా మంటలు చెలరేగాయి. అధికారులు వాటిని అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా లేదా అనే విషయం ఇంకా తెలియరాలేదు. రోజుకి దాదాపు 7,30,000 బ్యారెళ్ల చమురు శుద్ధి చేయగల ఈ రిఫైనరీపై గురువారం కూడా ఇరాన్ దాడి చేసింది. దుబాయ్ నగరం పైకి ఇరాన్ డ్రోన్‌లు దూసుకురాగా, వైమానిక రక్షణ వ్యవస్థలు వాటిని అడ్డుకొన్నాయి. ఈ క్రమంలో భారీ పేలుళ్లు వినిపించాయి. ఇక, తమపై దూసుకొచ్చిన ఓ క్షిపణిని అడ్డుకొన్నట్లు బహ్రెయిన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ క్రమంలో దాని శకలాలు ఓ గిడ్డంగిపై పడటంతో మంటలు చెలరేగాయని పేర్కొంది. ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా కీలక యుద్ధ మిగతా 2లో..



### నాటో దేశాలది పిరికిపందచర్య

- అమెరికా లేకపోతే ఆ కూటమి కేవలం ఒక పేపర్ టైగర్ మాత్రమే
- ఈ సందర్భాన్ని నేను ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటా: ట్రంప్
- హర్మ్యూజ్‌ని తెరిచేందుకు అమెరికా సన్నాహాలు
- రంగంలోకి అపాచీలు, తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు

2లో..

## నర్సరీ నుంచి ఇంటర్ వరకు
# ఒకే విద్యా విధానం

**విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తెస్తున్నాం • కమిషన్ నివేదికే ఫైనల్ కాదు**

- ఇవాళ ప్రవేశపెట్టిన పద్దు, ఫ్యూచరిస్టిక్ బడ్జెట్
- అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు.. అందువల్లే ఆయన అసెంబ్లీకి రాలేదు
- మూసీ విషయంలో వెనుకాడేదే లేదు
- హిల్ట్ పాలసీ, టీడీఆర్ భూబదలాయింపుపై
- ఏ ఏజెన్సీతోనైనా విచారణకు సిద్ధం
- ఫోన్‌ట్యాపింగ్ కేసు కొట్టేసినట్లు దుష్ప్రచారం
- జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):ఇవాళ ప్రవేశపెట్టిన బడ్జెట్ భవిష్యత్తుకే మైలురాయి వంటిదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్‌లో పెద్ద పీట వేశామని, అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించామని తెలిపారు. జూన్? నుంచి ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ జీవిత బీమా ద్వారా రూ.5 లక్షల పరిహారం ఇస్తామన్నారు. విద్యారంగ సంస్కరణలకు, ప్రజారోగ్య సంరక్షణకు అధిక నిధులు కేటాయించామన్నారు. విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన ముచ్చటించారు.జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్ర విద్యావిధానంలో మార్పులుంటాయని చెప్పారు. ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టూ వరకు ఒకేచోట చదివేలా విద్యావిధానం ఉంటుందన్నారు. విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తెస్తున్నామని, వాటిపై కమిటీ అధ్యయనం చేస్తోందని తెలిపారు. విద్యావ్యవస్థలో మార్పులపై కమిషన్ నివేదికే ఫైనల్ కాదని చెప్పారు. జాతీయస్థాయి అధ్యయనం తర్వాత విద్యావ్యవస్థలో మార్పులుంటాయని స్పష్టం చేశారు.మూసీ పునరుజ్జీవం విషయం లో రాజీ పడే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బాధితులను మాత్రం ఆదుకుంటామని తెలిపారు. మూసీ అభివృద్ధికి అప్పులు మిగతా 2లో..

### లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్

**ముస్లిం సోదరులకు సీఎం రేవంత్ రంజాన్ శుభాకాంక్షలు**

హైదరాబాద్(జనంసాక్షి): రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో మిగతా 2లో..



### మహిళలు, నిరుద్యోగులకు ఆర్థిక సాయం

'తృణమూల్' మ్యానిఫెస్టో విడుదల 9లో..



### మూడు దశల్లో భద్రాచలం ఆలయ అభివృద్ధి

**మాస్టర్‌ప్లాన్‌పై చర్చించిన మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి**



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థాన అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి అన్నారు. భద్రాద్రిని ఒక అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి మిగతా 9లో..

### మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారం సుప్రీంకు



సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన వైద్య విద్య కళాశాలల యాజమాన్యాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాలల యాజమాన్యాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28తో కౌన్సెలింగ్ ముగిసిందని, అప్పటికి ఏపీలో 246, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహా, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరఫు న్యాయవాదులు మిగతా 9లో..

## ఎఫ్‌ఎస్‌ఎల్ నియామక ఫలితాలు విడుదల

**టిఎస్‌ఎల్‌పిఆర్‌బి చైర్మన్ వీవీ శ్రీనివాసరావు**



**హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ లో ఖాళీగా ఉన్న వివిధ విభాగాల పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 నవంబర్ 14న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా మొత్తం 60 పోస్టులకు గాను 59 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో భాగంగా పోస్ట్ కోడ్ 51 కింద సైంటిఫిక్ ఆఫీసర్ (ఫిజికల్/జనరల్) విభాగంలో 2 ఖాళీలకు ఇద్దరు పురుషులు, కోడ్ 52 సైంటిఫిక్ ఆఫీసర్ (కెమికల్)లో 3 ఖాళీలకు ఇద్దరు పురుషులు, ఒక మహిళా అభ్యర్థి ఎంపికయ్యారని వివరించారు. అలాగే సైంటిఫిక్ ఆఫీసర్ బయాలజీ/సెరోలజీ (కోడ్ 53)లో 3 ఖాళీలకు ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు, కంప్యూటర్స్ విభాగం (కోడ్ 54)లో 2 ఖాళీలకు ఒక్కొక్కరు చొప్పున పురుష, మహిళా అభ్యర్థులు ఎంపికయ్యారు. సైంటిఫిక్ అసిస్టెంట్ విభాగాల్లో ఫిజికల్/జనరల్ (కోడ్ 55)లో 5 ఖాళీలకు నలుగురు పురుషులు, ఒక మహిళా అభ్యర్థి, కెమికల్ (కోడ్ 56)లో 10 ఖాళీలకు 8 మంది పురుషులు, ఒక మహిళా అభ్యర్థి (మొత్తం 9) ఎంపికయ్యారు. బయాలజీ/సెరోలజీ (కోడ్ 57)లో 10 ఖాళీలకు నలుగురు పురుషులు, ఆరుగురు మహిళలు, కంప్యూటర్స్ (కోడ్ 58)లో 7 ఖాళీలకు ఆరుగురు పురుషులు, ఒక మహిళా అభ్యర్థిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ల్యాబొరేటరీ టెక్నీషియన్ విభాగంలో ఫిజికల్/జనరల్ (కోడ్ 59)లో 2 ఖాళీలకు ఇద్దరు పురుషులు, కెమికల్ (కోడ్ 60)లో 6 ఖాళీలకు నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు, బయాలజీ/సెరోలజీ (కోడ్ 61)లో 4 ఖాళీలకు ఒక పురుషుడు, ముగ్గురు మహిళలు, కంప్యూటర్స్ (కోడ్ 62)లో 5 ఖాళీలకు ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఎంపిక కాగా, ల్యాబొరేటరీ అటెండెంట్ (కోడ్ 63)లో ఉన్న ఒక్క ఖాళీకి ఒక పురుష అభ్యర్థి ఎంపికయ్యారని చైర్మన్ వివరించారు. అభ్యర్థుల అకడమిక్ మార్కులు, పని అనుభవం, రాత పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఈ ఎంపికలు జరిగాయని, ఎంపికైన వారు ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో అటెస్టేషన్ ఫారాలను పూర్తి చేసి, మార్చి 30న హైదరాబాద్‌లోని పెట్లబుర్జ్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.

## తప్పని గ్యాస్ తిప్పలు




- ఆందోళనలో వినియోదారులు
- గ్యాస్ కొరత లేదంటున్న అధికారులు

**ముస్తాబాద్ మార్చి 20 (జనం సాక్షి) :** వంట గ్యాస్ సిలిండర్ కొరత రోజు రోజుకు ఎక్కువ అవుతున్నది. దీంతో వినియోగదారులు ఒక్కసారిగా వినియోగదారులు క్యూలైన్లో నిలబడుతూ నానా తిప్పలు పడుతున్నారు. ఇతర గ్రామాల నుండి వచ్చిన వారికి కనీసం గ్యాస్ ఏజెన్సీ వద్ద మంచినీళ్ల సౌకర్యం కూడా లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ బుకింగ్ చేస్తే బుకింగ్ అవుతలేదు అంటూ ఇంకా ఎన్ని రోజులు ఈ తిప్పలని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, మండల తహసిల్దార్ మాత్రం గ్యాస్ అందుబాటులో ఉందని అందరికీ సప్లై అవుతుందని చెబుతున్నారు. కానీ ఇక్కడ చూస్తే వంట గ్యాస్ సిలిండర్లు ఇవ్వక పోవడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ముస్తాబాద్ మండలం పై దృష్టి పెట్టి వినియోగదారులందరికి గ్యాస్ సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు వివిధ గ్రామాల వినియోగదారులు కోరుతున్నారు.

### సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ సమాచారాన్ని నమ్మవద్దు : తహసిల్దార్ జాలీ సునీతా రెడ్డి



**మొగుళ్ళపల్లి మార్చి 20 (జనంసాక్షి) :** ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు జరుపుతున్న యుద్ధంలో భాగంగా భారతదేశంలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశానుసారం మొగుళ్లపల్లి మండల తహసీల్దార్ జాలీ సునీతా రెడ్డి, ఎస్ఐ ముప్పు సురేష్ లు మండల కేంద్రంలోని స్వయంప్రభ భారత్ గ్యాస్ ఏజెన్సీని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని స్టాక్, రిజిస్టర్, పంపిణీ స్లిప్ లు మరియు గోదాంను తనిఖీ చేశారు. గ్యాస్ పంపిణీకి సంబంధించిన పలు సూచనలను భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ జాలీ సునీతా రెడ్డి మాట్లాడారు. మండలంలోని గ్యాస్ వినియోగదారులు అధైర్య పడోద్దన్నారు. గ్యాస్ బుకింగ్ చేసుకున్న వెంటనే సిలిండర్ డెలివర్ అవుతుందన్నారు. కొందరు సోషల్ మీడియాలో గ్యాస్ కొరతను సృష్టిస్తూ..ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ మెసేజీలను ప్రజలు నమ్మవద్దన్నారు

### గ్యాస్ వినియోగదారులు నిబంధనలు పాటించాలి : ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.



**ఏటూరునాగారం, మార్చి 20(జనంసాక్షి) :** గృహ అవసరాలకు గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకునే వినియోగదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గ్యాస్ సిలిండర్ల కొరత, బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు అంటూ కొన్ని మీడియాల్లో వస్తున్న వార్తల నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఏటూరునాగారం మండల కేంద్రంలోని హెచ్ పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్యాస్ సిలిండర్ల సరఫరా పై అక్కడి యాజమాన్యంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ బుకింగ్, సరఫరా ప్రక్రియలో ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనల ప్రకారం ప్రతి సిలిండర్ బుకింగ్‌కు మధ్య 45 రోజుల గ్యాప్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కేజీబీవీలు, గురుకులాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు సిలిండర్ల కొరత లేకుండా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఎం సివిల్ సప్లయ్ క్రిష్ణ వేణి, డిటి విజయ్ కుమార్, సర్పంచ్ కాకుల మర్రి శ్రీలత, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### హోటళ్లను తనిఖీ చేసిన సివిల్ సప్లై అధికారులు

**మంథని (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా సివిల్ సప్లయి అధికారులు మంథని ప్రాంతంలో వివిధ హోటళ్లలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. గృహ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 6 సిలిండర్లను సీజ్ చేసి 6 హోటళ్ల పై కేసులు నమోదు చేయడం జరిగింది. ఇట్టి తనిఖీల్లో డిటిసిఎస్ రవీందర్ రెడ్డి, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ రాజు రెడ్డి, గిర్దావర్ అనిల్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయనామ సంవత్సరం అని ప్రకటించి బడ్జెట్‌లో కోత పెట్టడం శోచనీయం

- తెలంగాణ రైతు సంఘం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** వ్యవసాయనామ సంవత్సరం అని ముఖ్యమంత్రి గారు ప్రకటించి బడ్జెట్‌లో మాత్రం కోత విధించడం శోచనీయమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, తీగల సాగర్ అన్నారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.23,179 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారని, గత సంవత్సరం 24వేల కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం తగ్గించారని తెలిపారు. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం "క్యూర్, ప్యూర్, రేర్" లక్ష్యాలుగా ప్రకటించి రేర్‌లో వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపుల ద్వారా వ్యవసాయోత్పత్తులు 236.87 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగినట్లు ప్రకటించారని, వ్యవసాయరంగం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1.11 లక్షల కోట్లు కాంట్రిబ్యూట్ చేస్తున్నట్లు చెప్పారని, రుణమాఫీ, రైతు భరోసా, గ్రామ అధికారుల నియామకం లైసన్స్‌డ్ సర్వేయర్‌ల నియామకం ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారని, భూ భారతి అమల్లో రెవెన్యూ కోర్ట్‌ల పునరుద్ధరణ, 11 అంశాల పహాణి పత్రికలో వాస్తవ సాగుదార్లు (కౌలు దార్లు) పేరు నమోదు, పంటల బోనస్, మ్యానిఫెస్టోలో ప్రకటించిన పంటల కనీస మద్ధతు ధరల నిర్ణయంకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు లేవని, వ్యవసాయ ప్రణాళిక ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల పెంపుదల వల్ల రాష్ట్ర అవసరాల మేరకు ఉత్పత్తి చేయడానికి తగిన ప్రణాళిక లేదని తెలిపారు. హార్టికల్చర్ శాఖ 2 దశాబ్దాలుగా 12 లక్షల ఎకరాలు మాత్రమే సాగు చేస్తున్నారని, ప్రత్యేకించి నల్లగొండ జిల్లాలోనే 4.5 లక్షల ఎకరాలలో బత్తాయి పంటలు వేయగా ప్రస్తుతం మొత్తం రాష్ట్రంలో 4లక్షల ఎకరాలకు తగ్గింది. వ్యవసాయ దిగుమతుల ద్వారా రైతులు నష్టపోతున్నారని, పత్తి, వరి పంటలను మాత్రమే మద్ధతు ధరల ఆధారితంగా సాగు చేస్తున్నారని తెలిపారు. ఆ రైతులకు కూడా కనీస మద్ధతు ధరలు అమలుకావడం లేదని, భూ భారతి అమలు చేయడం వల్ల కౌలు దార్లకు ఆర్థిక రక్షణ లేకపోవడంతో ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఒక వైపున వ్యవసాయాభివృద్ధి అంటూ మరో వైపున యేటా 460 మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రుణ ప్రణాళిక అమలు జరగడం లేదని, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్లు పంటల రుణ ప్రణాళిక తయారు చేయకపోగా, రాష్ట్ర రుణ ప్రణాళిక అమలు జరపడంలేదని తెలిపారు. ప్రభుత్వ ప్రకటనలకు, లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో వ్యవసాయ రంగంలో మాంద్యం పెరుగుతుందని, ప్రస్తుత బడ్జెట్‌లో వ్యవసాయరంగం బీమా సౌకర్యం, ప్రకృతి వైపరీత్యాల పరిహారం, మార్కెట్ జోక్యం పథకం కింద నిధుల కేటాయింపు లేదని, పాల ఉత్పత్తి దార్లకు లీటరుకు రూ.5 ప్రోత్సాహకం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించి బడ్జెట్ నిధులు కేటాయించలేదు. అందుకు అనుగుణంగా బడ్జెట్‌ను సవరించాలని, కనీసం బడ్జెట్‌లో 6శాతం నిధులు వ్యవసాయ రంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు.

## జీడికే 11వ గనిలో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి



**గోదావరిఖని (జనంసాక్షి) :** సింగరేణి ఆర్.జి-1 పరిధి జిడికె. 11వ ఇంక్లైన్ భూగర్భ గనిలో ఒక్క రోజులో రికార్డు స్థాయి ఉత్పత్తి నమోదైంది. మొత్తం ఉత్పత్తి లక్ష్యం 2916 టన్నులు కాగా, దాన్ని అదిగమించి 4025 టన్నుల ఉత్పత్తి చేసి 138% సాదించారు. ఇది 2025-26 ఆర్థిక సంవత్సరములో సంస్థలోని అన్ని భూగర్భ గనులలో అత్యధిక రోజువారి ఉత్పత్తిగా నమోదైంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్జీ 1 జియం డీ లలిత్ కుమార్ జిడికే జిడికె 11 ఇంక్లైన్ గనిని సందర్శించి విజయానికి కారణమైన అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, సూపర్వైజర్లు, సహకరించిన యూనియన్ నాయకులను ప్రత్యేకంగా అభినందించి అందరికి స్వీట్స్ పంపిణి చేసారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ భూగర్భ గనిలో యంత్రాలు సుమారు 20 గంటల పాటు నిరంతరం పని చేయడం వలన ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయని ముఖ్యంగా కంటిన్యూస్ మైనర్ 2వ విభాగం 200 శాతం లక్ష్యాన్ని సాధించడం గొప్ప విశేషం అని తెలిపారు. ఈ విజయానికి కారణమైన ఆపరేటర్లు, టెక్నిషియన్స్, సూపర్ వైజర్లు, అధికారులు, కాంట్రాక్టర్లు, గనిలోని అన్ని ఉద్యోగుల సమిష్టి కృషి కారణమని జియం కొనియాడారు. ఈ సందర్భంగా మరమ్మత్తులు చేసిన జిడికే 11 గని మేనేజర్ కార్యాలయమును ప్రత్యేక పూజ కార్యక్రమం చేసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, గని ఏజంట్ చిలుక శ్రీనివాస్, మేనేజర్ మల్లేశం, గ్రూఫ్ ఇంజనీర్ రాందాస్, డిప్యూటి పర్సనల్ మేనేజర్ వేణు, రక్షణ అధికారి మల్లేష్, ఫిట్ ఇంజనీర్ రాకేష్, ఎఐటియుసి నాయకులు రంగు శ్రీను, ఫిట్ సెక్రటరి, నాయిని శంకర్, ఫ్రీ షిఫ్ట్ ఇంచార్జ్ క్రాంతి, సూపర్వైజర్ వేణు, ఆపరేటర్స్ శ్రీనివాస్, అశిష్, అశోక్, ప్రసాద్ అధికారులు ఉద్యోగులు, సూపర్ వైజర్ స్టాఫ్ పాల్గొన్నారు.

## రంజాన్ శుభాకాంక్షలు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట ప్రతి నిధి (జనంసాక్షి) :** ముస్లిం సోదరులకు, వారి కుటుంబ సభ్యులకు రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, దాన ధర్మాల ద్వారా ఈ పవిత్ర మాసం సహనాన్ని, సేవాభావాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. రంజాన్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా సామరస్యంతో ఈ పండుగను జరుపుకోవాలని సూచించారు. సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం మరింత బలపడాలని, అందరికీ ఆరోగ్యం, సంతోషం కలగాలని ఆకాంక్షించారు.

## ఆశావర్కర్లు ఆరోగ్య రంగానికి వెన్నెముక

- వారి డిమాండ్లు న్యాయమైనవి, ఆమోదయోగ్యమైనవి
- సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్
- ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని షబ్బీర్ అలీకి వినతి




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 20 (జనంసాక్షి) :** కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ నివాసంలో షబ్బీర్ అలీని కలిసి ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆశా వర్కర్లను ఉద్దేశించి మాట్లాడుతూ 'ఆశా వర్కర్లు ఆరోగ్య రంగానికి వెన్నెముక లాంటివారు. మీ సమస్యలకు మూల కారణం గత ప్రభుత్వం అప్పులు చేసి మా నెత్తి పైన పెట్టాయి అవి సవరించుకుంటూ ముందున్న సమస్యలు తీర్చుకుంటూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాం గ్రామీణ స్థాయిలో ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో మీ పాత్ర ఎంతో కీలకం అన్నారు. గర్భిణీ స్త్రీల సంరక్షణ నుంచి చిన్నారుల టీకాల వరకు, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండేలా మీరు నిరంతరం కృషి చేస్తున్నారు. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి సమయంలో మీరు ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించారు. మీ సేవలను ప్రభుత్వం ఎంతో గౌరవంగా గుర్తిస్తుంది. మీరు ప్రస్తావించిన సమస్యలుతక్కువ గౌరవ వేతనం, క్రమరహిత చెల్లింపులు, అధిక పనిభారం, ప్రోత్సాహ కాలలో జాప్యం వంటి అంశాలు మీ రోజువారీ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని మీరు నాకు విన్నవించారు మీ సమస్యలపై నాకు పూర్తిగా అవగాహన ఉంది. మీరు చేసే పనికి తగిన ప్రతిఫలం అందేలా, ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది, మీ డిమాండ్లలో ముఖ్యంగా కనీస వేతనం పెంపు, స్థిరమైన వేతన వ్యవస్థ, పింఛన్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామాజిక భద్రతా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయడం వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుంటా మన్నారు. ఈ విషయాలను ఆరోగ్య శాఖ మంత్రితో త్వరలోనే చర్చించి, స్పష్టమైన నిర్ణయాలు తీసుకునేలా కృషి చేస్తాను అని అన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి, రాష్ట్ర స్థాయిలో పరిష్కారం దిశగా చర్యలు చేపడతాము. అవసరమైతే అసెంబ్లీలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించి, చర్చించి మీకు న్యాయం జరిగేలా చేస్తాం, మీ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. మీ డిమాండ్లలో న్యాయమైన, ఆమోద యోగ్యమైన డిమాండ్లను నెరవేర్చేలా చూస్తాను' ఈ సందర్భంగా ఆశా వర్కర్లు షబ్బీర్ అలీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఐరేని సందీప్ కుమార్, కాంగ్రెస్ కౌన్సిలర్లు నాయకులు సిఐటియు గౌరవ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం అరుణ్, దశరథ్ సిఐటియు నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## చిన్నారి అభిమానికి విరోష్ విందు



**హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) :** విజయ్ దేవరకొండ- రష్మికలు తనను పెళ్లికి ఆహ్వానించలేదంటూ ఓ చిన్నారి చేసిన రీల్ ఇటీవల వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ వీడియో 'విరోష్' జోడీ దృష్టికి వెళ్లింది. బుజ్జి అభిమాని ముద్దుముద్దు మాటలకు ఫిదా అయిన విజయ్.. 'నీకు ఏం ఇష్టమో చెప్పు. మనం కలిసి ఇంట్లోనే తిందాం' అంటూ అప్పుడే రిప్లై ఇచ్చారు. తమ ఇంటికి విందుకు కూడా ఆహ్వానించారు. అలా ఇప్పుడు ఆ పాప విరోష్‌ను కలుసుకుంది. ఆమెకు వారు ప్రత్యేక విందు ఇచ్చారు. చిన్నారితో కలిసి ఓ రీల్ కూడా చేశారు. ఇప్పుడది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## సీఎం రేవంత్‌ను కలిసిన కాంగ్రెస్ విప్‌లు



**హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) :** శాసనసభ, మండలిలో విప్‌లుగా నియిమితు లైన వారు సిఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమకు విప్‌లుగా నియమించినందుకు అభినందనలు తెలిపారు. అద్దంకి దయాకర్, వేముల వీరేశం, బల్మూర్ వెంకట్ తదితరులు సిఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆది శ్రీనివాస్, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పాల్గొన్నారు. అసెంబ్లీలో సిఎం ఛాంబర్‌లో వీరు కలిసారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి వాహనాలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఘటనలో ఏడుగురు దుర్మరణం

**చెన్నై, మార్చి 20 (జనంసాక్షి) :** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డుపై వెళుతున్న ఇతర వాహనాలను ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన సేలం జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం ఓ ఆర్టీసీ బస్సు కోయంబత్తూరు నుంచి సేలం బయలు దేరింది. బస్సు ఉత్తమ శోలపురం దగ్గర హైవేపై వెళుతుండగా అదుపుతప్పింది. డివైడర్‌ను దాటుకుని అవతలి వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఆ రోడ్డుపై వెళుతున్న ఓ బైక్‌తో పాటు టెంపోను ఢీకొట్టింది. బైక్, టెంపో నుజ్జునుజ్జయ్యాయి. బైకుపై ప్రయాణిస్తున్న ఓ మహిళతో పాటు ఆమె కూతురు అక్కడికక్కడే మరణించారు. ఇక.. టెంపోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో 11 నెలల చంటిపాప కూడా ఉండటం విషాదకరం. మాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ సభ్యులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు మొదలుపెట్టారు. గాయపడినవారిని చికిత్స కోసం దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగం కారణంగానే బస్సు అదుపుతప్పి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై సీనియర్ పోలీస్ అధికారి ఒకరు మాట్లాడుతూ.. 'ప్రమాదానికి సంబంధించి పూర్తి దర్యాప్తు జరుగుతోంది. దర్యాప్తు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

## ఆరు గ్యారెంటీలపై నిలదీస్తూనే ఉంటాం

- గన్ పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన
- ప్లకార్డులతో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శన



**హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) :** ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి ర్యాలీకి బయల్దేరి వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యమని గ్యారంటీ కార్డులు ఇచ్చి భద్రం చేసుకోమన్నారని గుర్తుచేశారు. ఇంతవరకు ఒక్క గ్యారంటీని నెరవేర్చిందని లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల తరఫున వృద్ధులు, వితంతువుల తరఫున బడ్జెట్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రూ.2500 మహాలక్ష్మి నిధులు ఎప్పుడిస్తారని నిలదీస్తామని తెలిపారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు నీటిమూటలయ్యాయని విమర్శించారు. బడ్జెట్‌లో రైతులకు, బీసీలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సంక్రాంతి, ఉగాది గడిచినా రైతు భరోసా పడలేదని అన్నారు. ఉద్యోగాలపై బొంకుతున్న కాంగ్రెస్‌ను అసెంబ్లీలో నిలదీస్తామని తెలిపారు. ఎగవేతలు, ఎదురుదాడి, అబద్దాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రలో ఇంత బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని అన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని అన్నారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామని హెచ్చరించారు.

## కారు అద్దాలు పగులగొట్టి రూ. 3 లక్షలు చోరీ



**బోధన్, మార్చి 20 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లోని కెనరా బ్యాంకులో డ్రా చేసిన 3 లక్షల రూపాయలను కారు అద్దాలు పగులగొట్టి చోరీ చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం రాకాసిపేట్ లోని కెనరా బ్యాంకు లో హరిబాబు అనే వ్యక్తి 3 లక్షల డబ్బులు డ్రా చేసుకొని వాటిని తన కారులో పెట్టుకొని పని నిమిత్తం యూనియన్ బ్యాంకుకు వెళ్లి వచ్చేలోపు కారు అద్దాలు పగలగొట్టి మూడు లక్షల రూపాయలను దొంగిలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 మార్చి 2026

# అమ్మలక్కల ముచ్చట్లలో సాహిత్యం - సంస్కృతి

ప్రతి మనిషికి సాహిత్య అవసరాలు ఉంటాయి.

ప్రతి మనిషికి సాహిత్య సాంస్కృతిక అవసరాలుంటాయి. సాహితీవేత్తలు, కళాకారులు ఆ అవసరాలను తీర్చాలి. పిల్లలకు ఆటపాటలు, ఏవో చిన్న చిన్న పనులు, బాల్య స్నేహాలు ఈ సాహిత్య అవసరాలను తీర్చుతాయి. అమ్మలక్కల ముచ్చట్లు పిల్లల సంస్కృతిని, అవగాహన పెంచుతాయి. గ్రామీణ ప్రాచీన కళలు, ప్రదర్శనలు వినోదంతో పాటు విజన్ ను అందిస్తాయి. బాల సాహిత్యం, బడిలో క్లాస్ మేట్స్ సాంగత్యం, ఆటపాటలు స్నేహాలు, టీచర్లు, వారి ప్రవర్తన, పిల్లల వ్యక్తిత్వ వికాసంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. బడికి పోని, పోలేని పిల్లలు పని చేసే చోట అనేకం నేర్చుకుంటారు. పిల్లకు అమ్మలు, నానమ్మలు, అమ్మమ్మలు, అక్కలు అనేకం కాలక్షేపం కథలు కబుర్లు చెపుతుంటారు. ఏవి చేస్తే మంచిదే, ఏవి చేయ కూడదో చెప్పి తీర్చి దిద్దుతారు. ఇవన్నీ పిల్లల, అమ్మలక్కల కాలక్షేపంతో పాటు వారి సాహిత్య సాంస్కృతిక మానసిక అవసరాలు తీరుస్తుంటాయి. పాఠశాల ఒక నూతన సమాజ నిర్మాణం చేసే ప్రాథమిక యూనిట్.

ఇలా జీవితంలో ప్రతి సందర్భంలో కాలక్షేపం కథలు కబుర్ల ఆవశ్యకత, ప్రాధాన్యత ఎంతో వుంది. కొందరు వీటిని రిక్రియేషన్, అని, ఎనర్జీనా రీ ఛార్జి చేస్తాయని కూడ అంటారు.

**కాలక్షేప సాహిత్యం కళలు**

కాలక్షేప కథలు సాహిత్యం కళలు మనుషులను రీ ఛార్జి చేస్తాయి. ప్రతి మనిషికి కాలక్షేపం సాహిత్యం కూడా ఎంతో అవసరం. అమ్మలు అక్కలు కలిసి చేసే అమ్మలక్కల ముచ్చట్లు ఒక కాలక్షేపం. అవి తమలోని టెన్షన్ ను విడుదల చేసే గొప్ప వాహిక కూడా. వీటితో పాటు సంస్కృతి సభ్యత సంస్కారం, కుటుంబం లో ఆటుపోట్లు, సర్దుబాట్లు, పిల్లల పెంపకం, పిల్లల చదువులు వాళ్ల గోల లొల్లి గొంతెమ్మ కోరికలు వాటిని తీర్చడానికి అవస్థలు.. పండుగలు చేసుకునే తీరు. పిల్లలు సమర్థాడడం, పెళ్లయ్యాక నెల తప్పడం, చాకలమ్మ బట్టలుతకడం, నల్లా నీల్లు కూర గాయల ధరలు జ్వరాలు నొప్పులు, కొందరి అక్రమ సంబంధాలు, కొందరి పై సానుభూతి, కొందరి అతి పోకడల పై విమర్శ ఈర్ష్య మొదలైన వన్నీ అమ్మలక్కల ముచ్చట్లు. ఇవన్నీ వారి సాహిత్య అవసరాలు. వీటిలో కాల క్షేపం మాత్రమే ఉందనుకోవడం పొరపాటు. అవి విద్యా దాయకం, సామూహిక, సామాజిక సాంస్కృతిక చైతన్య ప్రవాహం.

పట్టణాల్లో నగరాల్లో నివసించే వారికి కూడా ఇలాంటి విద్యా దాయక సామూహిక సాంస్కృతిక సామాజిక కాలక్షేపాల అవసరాలుంటాయి. దిన పత్రికల లోపలి పేజీలు, ఆదివారం సంచికలు, టీవీలు, సినిమాలు, సీరియల్స్ ఈ అవసరాలు తీర్చడానికి ఉపయోగపడుతున్నాయి.

ఇలా కాలక్షేపం రూపంలో అందించే సంస్కృతి చైతన్యం వారికి తెలియకుండానే వారి జీవితంలో భాగమవుతాయి. కాలక్షేప అవసరాలను తీర్చే కథలు నవలలు రాయడం కూడా చాలా అవసరం. అవి అమ్మలక్కల ముచ్చట్లంత సహజంగా చైతన్య యుతంగా సమస్త అంశాలు అందించాలి.

**సచిత్ర వార పత్రికలు మాస పత్రికలు**

1960లలో ఆంధ్ర పత్రిక, ఆంధ్ర ప్రభ, ఆంధ్రజ్యోతి, స్వాతి సచిత్ర వార పత్రికలు, యువ, జ్యోతి, స్వాతి, జయశ్రీ, మాస పత్రికలు అపుడే చదువుకున్న మహిళలకు కాలక్షేపం రూపంలో నూతన భావాలను, సంస్కృతిని, ఆలోచనలను మలిచాయి. 1970లలో విపుల చతుర, విజయ వంటి పత్రికలు ఆ కర్తవ్యాన్ని కొనసాగించాయి. బాలసాహిత్యంలో చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు, బాల జ్యోతి, బాల చెలిమి తదితర మాస పత్రికలు పిల్లల మూర్తిమత్వ వికాసంలో ఊహల రెక్కలు విచ్చుకోవడంలో తమ వంతు పాత్ర నిర్వహించాయి. నేడు దిన పత్రికల ఆదివారం సంచికలు కుటుంబంలోకి అందరికి తలా కొన్ని పేజీలు కేటాయిస్తున్నాయి. రోజూ మహిళా పేజీలు , సినిమా వార్తల పేజీలు అందిస్తున్నాయి.

1950-60 లలో డిటెక్టివ్ నవలలు లక్షల కాపీలు అమ్మారు. వాటి ఉద్ధృతి చూసి ఆ పాఠకులను సొమ్ము చేసుకోవాలని వాటి మీద దుమ్మెత్తి పోసి వార పత్రికలు సీరియల్ నవలలు వేశారు. వాటిని పాఠకులు పత్రికల పేజీలు చింపి చక్కని బైండింగ్ చేయించి దాచుకున్నారు. ఆ పాఠకులను మార్కెట్ చేసుకోవాలని ఎమెస్కో పాకెట్ బుక్స్ నెలకు నాలుగు వలలలు విడుదల చేస్తూ వచ్చారు.

## విశ్వ జనీన సార్వ కాలీన సాహిత్యం




శరత్ సాహిత్యం, ప్రేంచంద్ సాహిత్య అనువాదాలు , రష్యా సాహిత్య అనువాదాలు ప్రజల చైతన్యంలో అవగాహనలో చక్కని పాత్ర నిర్వహించాయి. కోడూరి కౌసల్యా దేవి, రంగ నాయకమ్మ, యద్దనపూడి సులోచనలా రాణి,,బొమ్మ హేమాదేని, అంపశయ్య నవీన్, రామా చంద్ర మౌళి, మాదిరెడ్డి సులోచన, వాసిరెడ్డి సీతాదేవి , పోల్కంపల్లి శాంతాదేవి, కావిలిపాటి విజయలక్ష్మి, లల్లాదేవి, చలం, తెన్నేటి హేమలత, డి కామేశ్వరి తదితర రచయితలు రచయిత్రులు నాటి వార మాస పత్రికలలోని కథలు, సీరియల్ నవలలు కాలక్షేప సాహిత్య, సామాజిక, సాంస్కృతిక అవసరాలు తీరుస్తూ వచ్చాయి.

**పత్రికల సీరియల్లను పదిలంగా బైండు చేసి దాచుకున్న కాలం**

1950-60 లలో డిటెక్టివ్ నవలలు లక్షల కాపీలు అమ్మారు. వాటి ఉద్ధృతి చూసి ఆ పాఠకులను సొమ్ము చేసుకోవాలని వాటి మీద దుమ్మెత్తి పోసి వార పత్రికలు సీరియల్ నవలలు వేశారు. వాటిని పాఠకులు పత్రికల పేజీలు చింపి చక్కని బైండింగ్ చేయించి దాచుకున్నారు. ఆ కాలం అంత ప్రేమగా దాచుకున్నారు. అవి సినిమాలుగా కూడా వచ్చాయి.

**ఎమెస్కో నవలలు**

డిటెక్టివ్ నవలల, , పత్రికల సీరినవలల పాఠకులు అక్షరాస్యతతో పాటు విపరీతంగా పెరిగారు. అంతదాకా ఎం శేషాచలం అండ్ కో అనే ప్రచురణ సంస్థ ఆ పాఠకులను మార్కెట్ చేసుకోవాలని ఎమెస్కో పాకెట్ బుక్స్ అనే పేరుతో నెలకు నాలుగు వలలలు విడుదల చేస్తూ వచ్చారు.

**కొంత పక్కదారి పట్టిన సాహిత్యం**

ఆ తరువాత 1980ల నుండి సర్కులేషన్ పోటీలో వార మాస పత్రికల సాహిత్యం కొంత పక్కదారి పట్టింది. ఆంధ్ర భూమి, స్వాతి వారపత్రికలు యండమూరి వీరేంద్రనాథ్, కొమ్మనాపల్లి, అయ్యదేవర తదితరుల రకరకాల ప్రయోగాల సాహిత్యం ప్రచురించి క్రమంగా దయ్యాలుభూతాలు, హింసక్రైం, సెక్సువైపు మళ్లించాయి.

**సాహిత్య అవసరాలను ప్రేక్షకులుగా మార్చిన టెక్నాలజీ**

చదివే పాఠకులను కూడా చూసి తరించే ప్రేక్షకులుగా మార్చడంలో టెక్నాలజీ పాత్ర పెద్దది. సినిమాలు, టీవీ సీరియల్స్, యూట్యూబ్ లు ప్రజల కాలక్షేప అవసరాలను తీరుస్తున్నాయి. పల్లె పాటలు, పల్లె జీవన సౌందర్యం గురించిన పాటలు నాటికల వంటి షార్ట్ ఫిల్మ్స్ ఈ రంగంలో ఉర్రూతలూగిస్తున్నాయి. కోట్లాదిమంది ప్రపంచ వ్యాప్తంగా వీక్షిస్తున్నారు. సామాజిక చైతన్యం పేరిట రాసే రచనలు కాలక్షేపం సాహిత్యం ఆకర్శించినంత వేగంగా ఆకర్శించ గలగాలి.

**మేం మా తరం చేసిన పొరపాటు**

మేము మా తరం రచయితల్లో ఒక సెక్షన్ గా సాహిత్యంలో ప్రజల సాహిత్య అవసరాలను గుర్తించ లేదు. ఉద్య కథలు, నవలలు పేరిట ఉద్యమించే గ్రామీణ రైతాంగం, విద్యార్థులు, యువకులు వారి ఉద్యమాలు, సమస్యలు నిర్బంధాలు, వీరోచిత కృత్యాలు ప్రధానం చేసి రాయడం జరిగింది. తొలి తరం నుండి ఆధునిక విద్య, ఉద్యోగాలు, ఆధునీకరణ, భూస్వామ్య సంస్కృతి ఆధిపత్యం నుండి బయట పడే పనుగులాట, సంఘర్షణ పరిమితమైనది ఉద్యమ సాహిత్యం. ఆయా వర్గాల, కులాల, కుటుంబాల జీవితం సంస్కృతి, మానవ సంబంధాలు, పెళ్లిళ్లు, కుల వృత్తులు, వాటి సాధక బాధకాలు, వాటి తీరు తెన్నులు, పిల్లలు పై చదువులు చదువుకొని మొదటి తరం మధ్య తరగతిగా మారేక్రమం అందుకోని ఘర్షణ, పురుషాధిక్యత, వరకట్న సమస్య, కులాంతర వివాహాల్లో ఎదురైన సాంస్కృతిక సమస్యలు మొదలైనవి మొత్తం సమాజాన్ని కథా వస్తువుగా తీసుకోవాలి అనే దృష్టి లోపించింది. వాటికి ప్రధాన్యత ఇవ్వ లేదు. చాలా సందర్భాల్లో కులం లేని మనుషుల్లా వాస్తవాలను విస్మరించా అవాస్తవికతతో వాస్తవికతగా చిత్రించడం జరిగింది.

**స్త్రీ వాద సాహిత్యం తెచ్చిన మార్పు**

స్త్రీ వాద సాహిత్యం ఉద్యమ సాహిత్యంలో వదిలేసిన కుటుంబ జవనా ని సంస్కృతిని నిలబెట్టింది. కుటుంబ సంస్కృతిలోకి స్త్రీ పురుష అసమానతలను వివక్షను వెలికి తీసింది. తద్వారా 1980లో వచ్చిన స్త్రీ వాదం రెండు పాయలను సంస్కరించింది. క్రైమ్ హింస దయ్యాల సాహిత్యం నుండి స్త్రీ వాద సాహిత్యం తనవైపు తిప్పుకుంది. ఉద్యమ సాహిత్యంలో కుటుంబంలో, ఉద్యమాల్లో జరిగే హింస, పురుషాధిపత్య విభిన్న రూపాలను వెలికి తీసింది. ఓల్గా కథలు నవలలు సిద్ధాంత చర్చలు ఈ మలుపులో ప్రధాన పాత్ర నిర్వహించాయి. అలా ఉద్యమ సాహిత్యంలో మానవ సంబంధాలు విరివిగా చిత్రించాల్సిన అవసరాన్ని ముందుకు తెచ్చాయి.

**దళిత సాహిత్యం తెచ్చిన మార్పు**

1985 కారంచేడు ఉద్యమం నుండి దళిత సాహిత్యం కుల సమస్యను అంటరాని తనాన్ని వివక్ష వెలివేతను, అగ్రకుల దోపిడీ అణిచివేతను, అంబేద్కరిజంను ముందుకు తెచ్చాయి. స్త్రీ వాద సాహిత్యం తొలుత ప్రసంగాలు, వ్యాసాలు, ఆ తరువాత కవిత్వం, ఆ వెంట కథ నవలలకు విస్తరింది. దళిత సాహిత్యం కూడా ఇదే క్రమంలో సాగింది.

**దరకమే ఐక్య వేదిక తెచ్చిన మార్పు**

1992లో దరకమే ఐక్య వేదిక సాహిత్యాన్ని మరో మలుపు తిప్పింది. ఉద్యమం చేస్తేనే ప్రజలా? సామాన్య ప్రజలుగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ జీవితాలు సంస్కృతి వారి ఆశలు సాహిత్యానికి అర్హమైనవి కావా ? అనే ప్రశ్న రేకెత్తించింది. అలా ప్రశ్నించి మొత్తం సాహిత్యం దశాబ్దాలుగా కోల్పోయిన సమగ్రతను ముందు నిలిపింది. సమగ్ర సామాజిక కథ విజన్ ను ముందుకు తెచ్చింది. మనిషి జీవితాన్ని ప్రాథమికం చేసింది. జీవితంలో భాగంగా ఉద్యమాలు, స్త్రీల అణిచివేత, కుల వివక్ష, కుల సంస్కృతి, స్త్రీల భాష, దళితుల, బీసీల భాష, వారి వారి అభివృద్ధి పరిణామాలు, ఆధునిక అభివృద్ధిలో తమ వాటా అందుకోవాలనే చైతన్యాన్ని ముందుకు తెచ్చింది. ఇవాళ్టి అభివృద్ధి మీకు. రేపటి అభివృద్ధి మాకా? రేపటి అభివృద్ధి కోసం మేం ఉద్యమాలు చేయాలా? ఇవాళ్టి అభివృద్ధిలో మా జనాభా మేరకు మాకు అందాలి అని నిలదీసిందా.

మహిళా సాహిత్యం ఆయా కులాల ప్రాంతాల అసమానతలను పట్టించుకోవడానికి దరకమే ఐక్య వేదిక తీవ్ర కృషి చేసింది. ఇలా జీవితం ప్రాథమికం అని తిరిగి సాహిత్యంలో నిలబడింది. ఇపుడు యువ తరం సాహిత్యంలో ఈ దశలో కొనసాగుతున్నారు. వర్ణ వర్గ కుల లింగ జాతి ప్రాంత సమస్యలు ... కలిసి జీవించడం .. అనే అన్ని సమస్య అవగాహనల సమన్వయ దృష్టి వారికి అంది వచ్చింది. యువ తరానికి పెద్దలు సీవియర్ రచయితలు అందించిన, దారి దీపంగా చేసిన మహత్తర కాంట్రాక్టు బ్యాషన్ ఇది.

**అన్ని రకాల సాహిత్యం సప్త వర్ణ శోణితం**

ఇలా ఇపుడు అన్ని రంగాల్లో ఎవరి జీవితం వారు పోటీ ప్రపంచంలో సాధించుకుంటూ తమదైన పరిమితి పరిధి ప్రాధాన్వతలతో సాహిత్య సృజన గావిస్తున్నారు. కాలంతో పాటు మరికొన్ని అంశాలు తోడయ్యాయి. ప్రపంచీకరణ, సాఫ్ట్ వేర్ రంగం, గల్ఫ్, అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ వలసలు, జిల్లా దాటి నగరాలకు వలసలు, ఉద్యోగం దొరికే దాకా నిరుద్యోగం, ఉద్యోగం దొరికి జీతం చేతికి వచ్చాక అంత దాక పెంచి పోషించిన వారిని మరిచి ఆ సంపాదనంతో తనదేననుకోవడం, స్వేచ్ఛగా ఖర్చులు చేయడం నలభయి ఏళ్లు వచ్చినా పెళ్లి లేకుండా కాలం గడపడం, సహజీవన సంస్కృతి, ప్రేమ పేరిట మోసాలు, ఇంటర్నెట్, సెల్ ఫోన్, ఫేస్ బుక్ ఇన్ స్టాగ్రాం బంధాలు రీల్సు షార్టు ఫిల్ములు, తక్ష గుర్తింపు తన్లాట కుటుంబ విచ్ఛుత్తి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తెచ్చిన పరిణామాలు అదనంగా చేరాయి. పాత జీవితాలు సంస్కృతి అలానే కొనసాగుతూ వున్నాయి. మరోదారా లేక కుల వృత్తులు సాగుతూనే వున్నాయి.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987



# గాలి ఎటు వీస్తోంది?

## దక్షిణ-తూర్పు రాజకీయ సమీకరణాలు




పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు భారత రాజకీయాల్లో ప్రత్యేకమైన స్థానం కలిగినవే. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే, అది కేవలం స్థానిక పోటీగా కాకుండా జాతీయ రాజకీయాలకు కూడా ఒక సూచికగా మారుతుంది. ఇప్పటికే పలు ఎలక్షన్ సర్వే సంస్థలు తమ అంచనాలు వెల్లడించినా, గ్రౌండ్ రియాలిటీ అనే అంశం చాలా సందర్భాల్లో వాటిని మించిపోతుంది. అందుకే ఈ రెండు రాష్ట్రాల్లో వాస్తవ పరిస్థితులను విశ్లేషించడం అవసరం.

పశ్చిమ బెంగాల్ విషయానికి వస్తే, అక్కడ రాజకీయ పోటీ ప్రధానంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మరియు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మధ్యే కేంద్రీకృతమై ఉంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టిఎంసీ గత కొన్నేళ్లుగా గ్రామీణ స్థాయిలో బలమైన పట్టు సాధించింది. మహిళా ఓటర్లు, మైనారిటీలు, పేద వర్గాలపై ఈ పార్టీకి ఉన్న ప్రభావం ఇంకా తగ్గలేదు. "లక్ష్మీ భండార్", "కన్యాశ్రీ" వంటి సంక్షేమ పథకాలు మహిళలలో విశ్వాసాన్ని పెంచాయి. ఈ పథకాలు ఓటింగ్ ప్రవర్తనను గణనీయంగా ప్రభావితం చేసే అంశాలుగా మారాయి.

అయితే బీజేపీ కూడా పశ్చిమ బెంగాల్‌లో తన స్థాయిని పెంచుకుంది. ముఖ్యంగా 2021 అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ గ్రామీణ ప్రాంతాల్లోనూ తన ప్రాబల్యాన్ని విస్తరించడానికి ప్రయత్నిస్తోంది. హిందుత్వ రాజకీయాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, అలాగే టీఎంసీల పై అవినీతి ఆరోపణలు బీజేపీకి కొంత మద్దతు తెచ్చాయి. అయినప్పటికీ, స్థానిక నాయకత్వ లోపం, అంతర్గత విభేదాలు బీజేపీకీ ఒక పెద్ద అడ్డంకిగా కనిపిస్తున్నాయి.

గ్రౌండ్ రియాలిటీ ప్రకారం చూస్తే, టిఎంసీ కి ఇంకా ఒక స్పష్టమైన ఆధిక్యం ఉంది. మమతా బెనర్జీ వ్యక్తిగత ఇమేజ్, ఆమె పోరాట స్వభావం, స్థానిక స్థాయిలో పార్టీ యంత్రాంగం బలంగా ఉండటం వల్ల ఈసారి కూడా టిఎంసీ ముందంజలో ఉండే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాకపోతే బీజేపీ ఓటు శాతం పెంచుకున్నా, అది విజయం సాధించడానికి సరిపోదు అనే భావన బలంగా ఉంది.

ఇక తమిళనాడు విషయానికి వస్తే, అక్కడ రాజకీయ సమీకరణాలు భిన్నంగా ఉంటాయి. ప్రధానంగా డిఎంకె మరియు ఏఐడిఎంకే మధ్య పోటీ కొనసాగుతుంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ నాయకత్వంలోని డిఎంకే ప్రభుత్వం సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల అమలు, భాషా గౌరవం వంటి అంశాలపై దృష్టి పెట్టింది. ఈ విధానాలు ప్రజల్లో ఒక స్థిరమైన మద్దతును కల్పించాయి.

ఏఐడిఎంకే మాత్రం జయలలిత మరణం తర్వాత నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పార్టీ లోపల విభేదాలు, స్పష్టమైన నాయకత్వం లేకపోవడం వల్ల గ్రౌండ్ లెవెల్‌లో దాని బలం కొంత తగ్గింది. బీజేపీతో పొత్తు విషయంలో కూడా స్పష్టత లేకపోవడం, దాని ఓటు బ్యాంక్‌పై ప్రభావం చూపుతోంది.

తమిళనాడులో మరో ముఖ్య అంశం ఏమిటంటే, ఇక్కడి ఓటర్లు సాధారణంగా ప్రాంతీయ భావజాలాన్ని ప్రాధాన్యంగా చూస్తారు. భాష, సంస్కృతి, స్వాభిమానం వంటి అంశాలు ఎన్నికలలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ కోణంలో చూస్తే డిఎంకె కి స్పష్టమైన ఆధిక్యం ఉంది.

గ్రౌండ్ రియాలిటీ ప్రకారం తమిళనాడులో డిఎంకె మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఏఐడిఎంకే పునరుద్ధరణ కోసం ఇంకా సమయం అవసరం. బీజేపీ ఇక్కడ తన స్థానం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అది ఇంకా ప్రధాన పోటీదారుగా మారలేదు.

మొత్తం మీద చూస్తే, పశ్చిమ బెంగాల్‌లో టిఎంసీ, తమిళనాడులో డీఎంకే ముందంజలో ఉన్నట్లు గ్రౌండ్ రియాలిటీ సూచిస్తోంది. సర్వేలు ఒక దిశ చూపించవచ్చు కానీ చివరకు నిర్ణయం తీసుకునేది ఓటరే. స్థానిక సమస్యలు, అభ్యర్థుల ప్రవర్తన, చివరి నిమిషం సమీకరణాలు కూడా ఫలితాలను ప్రభావితం చేయగలవు.

అందువల్ల ఇప్పటి పరిస్థితుల ప్రకారం స్పష్టమైన ధోరణి ఉన్నప్పటికీ, ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు ఏదీ ఖచ్చితంగా చెప్పలేము. అయినప్పటికీ, ప్రస్తుత రాజకీయ గాలులు చూస్తే - బెంగాల్‌లో మమతా, తమిళనాడులో స్టాలిన్ చేతిలోనే గెలుపు తాళాలు ఉన్నాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.





## విద్యా కమిషన్ సిఫార్సులు

# ఏ మేరకు అమలవుతాయి?

భవిష్యత్తు మానవ వనరుల నిర్మాణంలో విద్యా కీలకమైనది. రాష్ట్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే విధంగా విద్యపై ప్రభుత్వం విధాన నిర్ణయాలు ఉండాల్సిన అవసరం ఉంది. సంస్థాగతంగా తీవ్ర అంతరాలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతుంది. ఇవీ ఆధునికంగా ముందుకు పోనీ అనాథ కేంద్రంలాగా మిగిలిపోతున్నాయి. నేడు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివించే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు గౌరవప్రదమైన విద్యను కోరుకుంటున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేమి, ఉపాధ్యాయుల కొరత, కొరవడుతున్న ప్రభుత్వ నిబద్ధత వలన ప్రభుత్వ విద్యాసంస్థల తీరు అగమ్య గోచరంగా మారాయి. ఈ క్రమంలో విద్య వ్యవస్థను గాడిలో పెట్టే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం విద్య కమిషన్ నియమించింది. ఇటీవల విద్యా కమిషన్ సమర్పించిన విద్యా విధాన పత్రం 2026 విడుదల చేసింది. ఆధునిక విద్యావ్యవస్థకు అవసరమైన సిఫారసులు చేసింది. ఈ విధాన పత్రం విద్యా వ్యవస్థ మెరుగుపరచడానికి 18 శాతం నిధులు కావాలని స్పష్టం చేసింది. కానీ ప్రభుత్వం 26,674 కోట్లు మాత్రమే కేటాయించింది. గత ఏడాదితో(7.6 శాతం) పోలిస్తే స్వల్పంగానే 8.2 శాతమే నిధులు కేటాయించింది. దేశ సగటు (14-15%)తో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఈ నిధులతో విద్యా కమిషన్ సిఫార్సులు ఏ మారకు అమలవుతాయో ప్రశ్నార్థకమే. మరోవైపు పాఠశాలలో ప్రైమరీ తరగతుల నిర్వహణ, విద్యార్థుల కిట్, బ్రేక్ ఫాస్ట్ పథకాలను ఈ విద్యా సంవత్సరం నుండి ప్రవేశపెట్టడం జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. ఇంత తక్కువ బడ్జెట్ లో ఈ పథకాలు అమలు ప్రకటనలకే పరిమితం అయ్యే ప్రమాదం లేకపోలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేర్కొనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీ లాంటివి నిర్వహణ ఏ విధంగా అమలు చేస్తారో కూడా సందేహాస్పదమే. ఉద్యోగుల ఆరోగ్య పథకం క్రింద ఉచిత వైద్యం స్వాగతించాల్సిన అంశం. కానీ రిటైరైన ఉద్యోగుల బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు, పిఆర్సీ ప్రస్తావన లేకపోవడం విచారకరం. ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజనం నాణ్యతకు అదనపు నిధులు కేటాయించకపోవడం శోచనీయం. ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే కార్పొరేట్ విద్యా వ్యవస్థ మరింత పుంజుకుంటుంది. ఇది బడుగు, బలహీన వర్గాల పాలిట శాపంగా మారుతుంది. విద్యను సంక్షేమ చర్యగా, ప్రాధాన్యత కొరవడిన రంగంగా చూడడం సరికాదు. ఆర్థిక కేటాయింపులతో చిత్తశుద్ధి కనబరచినప్పుడే విద్యా వ్యవస్థ బాగుపడుతుంది.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# గుట్టల విధ్వంసాన్ని ఆపాలి

## పత్తిపాక గ్రామ పోరాటానికి సంపూర్ణ మద్దతు



హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామ శివారులో గుట్టల విధ్వంసాన్ని నిరసిస్తూ ఇప్పటికే ఒక గుట్టను కనుమరుగు చేసిన శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్, డాంబర్ ప్లాంట్లను తక్షణమే మూసివేయాలని, కొత్తగా పెద్దగుట్టపై మరో క్రషర్ ఏర్పాటు చేసేందుకు కొందరు చేస్తున్న ఆలోచనను విరమించుకోవాలని పత్తిపాక పెద్దగుట్ట వద్ద గ్రామ ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు, రైతులు నిరసనకు సహజ వనరుల పరిరక్షణ వేదిక సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నది.

ఆ గ్రామంలోని సహజ వనరులను కాపాడుకోవడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఇదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని పిలుపునిస్తున్నాం. ఇప్పటికే రెవిన్యూ, కలెక్టర్ తో పాటు సంబంధితశాఖలకు వారు తమ ఆవేదనను స్టోన్ క్రషర్ వల్ల జరుగుతున్న ఇబ్బందులను వివరిస్తూ వినతిపత్రాలు అందించారు. పత్తిపాక గ్రామ సహజ వనరుల పరిరక్షణ కోసం పరితపిస్తున్న వారికి రాష్ట్రవ్యాప్త మద్దతు అవసరమని భావిస్తున్నాం. ఇందుకు ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీల లోని పరిశోధకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ వేత్తలు పత్తిపాక శివారులో జరుగుతున్న గుట్టల విధ్వంసాన్ని సందర్శించాల్సిన అవసరం ఉంది. పత్తిపాకతో పాటు ఆ మండలంలోని వివిధ గ్రామాల్లోనూ ఇదే తరహా స్టోన్ క్రషర్ల నిర్వాహణ, గుట్టల విధ్వంసం జరుగుతున్నది. గుట్టల విధ్వంసం వల్ల పంటపొలాలు దెబ్బతింటున్నా యని, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఇప్పటికే ఒక గుట్ట కనుమరుగు కాగా, కొత్తగా మరోగుట్టకు స్టోన్ క్రషర్ ఏర్పాటు చేస్తే మరింత నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. గీత కార్మికుల జీవనోపాధి కూడా దెబ్బతింటోందని, క్రషర్ల నుండి వచ్చే ధూళి వల్ల తాటి చెట్లు పాడైపోతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సమీపంలోని కుంటలు దెబ్బతినడం వల్ల చేపల పెంపకంపై ఆధారపడిన ముదిరాజ్‌లు తీవ్రంగా నష్టపోతారని, అక్రమ క్వారీయింగ్ వల్ల పెద్దగుట్ట ఉనికి కోల్పోతోందని, దీనివల్ల చుట్టుపక్కల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని స్థానికుల ఆవేదనలో న్యాయం ఉంది. తమ జీవనాధారమైన భూములను ఇవ్వడానికి రైతులు సిద్ధంగా లేనప్పటికీ స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేయడం సరైనది కాదని సహజ వనరుల పరిరక్షణ వేదిక భావిస్తున్నది. దీనిపై ఉన్నతాధికారులు సంబంధితశాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని. ప్రస్తుతం కొనసాగుతున్న స్టోన్ క్రషర్, డాంబర్ ప్లాంట్లను వెంటనే నిలిపివేయాలని, పెద్దగుట్టపై కొత్త క్రషర్ ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని, జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు, గ్రామస్తులకు న్యాయం చేయాలని సహజ వనరుల పరిరక్షణ వేదిక కోరుతున్నది.

దామెర రాజేందర్
(దారా)
సీనియర్ జర్నలిస్ట్,
సహజ వనరుల పరిరక్షణ వేదిక
వ్యవస్థాపక అధ్యక్షులు



## వ్యక్తి శక్తిగా ఎదిగి

సమాజమార్పుకు
మార్గదర్శి కావాలి
గతాన్నివదలద్దు
గమ్యాన్ని మరువద్దు
గతాన్ని మరిచిన వారికి
భవిష్యత్తు ప్రశ్నార్థకం
మూలాలు మరిచిన వారికి
ముందుకు వెళ్లడానికి
దారులు మూసుకుపోతాయి
ఏఅంతస్తుపై నిలబడ్డామనేది
ముఖ్యం కాదు ఎందుకు
నిలబడ్డా మన్నదే ప్రధానం
ఎన్ని మెట్లు ఎక్కామో
గుర్తుంచుకోవాలి
ఏ సమాజానకి సేవా చేశాం
అన్నది ముఖ్యం కాదు ?
సమాజానికి ఏమి సేవ
చేసామో ముఖ్యం
నీ చేతలు సమాజ
చైతన్యానికి చేయూత నివ్వాలి
ఎంత మంది జీవితాలను
ప్రభావపరిచాయో
ముఖ్యం
జాతి ఐక్యత సమైక్యత
సంఘీభావానికి
సానుకూలతను
సమకూర్చాయా
అన్నది ప్రధానం
వ్యక్తి స్వార్థం కన్న
వ్యవస్థ స్వార్థం మిన్న
వ్యక్తి భక్తి కన్న
దేశ భక్తి గొప్ప.
గత నాయకుల
త్యాగాలను
మరువద్దు.
వారు వేసిన
పునాదుల మీద
సమాజాన్ని నిర్మించి
వారి కృషిని
సంఘ సేవతో
స్మరిస్తూ వారి
ఆశయాల సాధనకు
వారు చూపిన బాటన
నడవాలి వారి
మాటనునిలుపాలి
వారు నెలకొల్పిన
విలువలు గౌరవం,
ఆత్మాభిమానంతో
జాతి సమైక్యత శక్తిని
బలోపేతం చేసే
పలు సామాజిక
భాగ స్వామ్య
కార్యక్రమాలు,
గత నాయకుల
సేవలను స్మరిస్తూ
వారి మెమోరియల్
ఉపన్యాసాలు
వారి పేరున అవార్డ్స్
బహుకరించే సదస్సులు
చర్చలు నిర్వహించాలి
నేటి యువతరంలో
సంఘ సేవాతత్పరతను
కలిగించడం ద్వారా
సంఘ సేవ
అభివృద్ధికార్యక్రమాల
నిర్మాణానికి పూనుకోవడం
రాజకీయ నాయకత్వం
కార్యాచరణ కావాలి.
ద్వితీయ శ్రేణి
నాయకులను
తయారు చేయాలి
త్యాగ శీలుర మాటే
మన బాట కావాలి.
వారు చూపిన
మార్గంవదలద్దు
సమాజ సేవ
భూషణం కావాలి
కానీ ధూషణం కావద్దు
సంస్థలు సంఘాలు
వ్యక్తుల ఆత్మగౌరవాన్ని
పెంచాలి.
గతం లేకుండా
వర్తమానంలేదు,
వర్తమానం లేకుండా
భవిష్యత్తు లేదు.
చరిత్ర చదువాలి.
గతచరిత్ర లేకుండా
భవిష్యత్తు చరిత్రను
నిర్మించలేము.
గతనాయకులు
చేసిన సేవలు విస్మరించడం
ఇప్పుడు మేమే
చేసామనడం
అహంకారానికి నిదర్శనం.
అహంకారం వ్యక్తుల
పతనానికి దారితీస్తుంది.
పిల్లవచ్చి కోడి గుడ్డును
వెక్కిరించినట్లుంటుంది.
చాలామంది ఒకటో
రెండో పనులు చేసి
సర్వం చేసినట్లు
చంకలు గుద్దుకుంటారు.
గతం మరిచిపోయి
మేము అంతాచేసినట్లు
దంకా భజాయిస్తారు
అదివారిమూర్ఖత్వమే
అవుతుంది
ఆత్మీయత, అభిమానం,
ఆదరణ,ఐక్యత,
చైతన్యంతో హక్కుల
రక్షణ కోసం వ్యక్తులు
స్వచ్ఛంద సైనికులుగా
ఎదగాలి.
నవసమాజాన్ని
నిర్మాణానికి
ఉద్యమించాలి
వ్యక్తిలో సహనం ఓర్పు
సంకల్పం త్యాగ శీలత
ఉండాలి.
ఒక పనితో వంద పనులు
చేసినట్లు వక్రీకరించడం
సరికాదు.
అబద్ధాలు చెప్పడం
సరికాదు.
నమ్మకం ముఖ్యమైనది.
చైతన్యం శాశ్వతమైనది.
సంఘం మంటే బలం
భరోసా భద్రత అనే
మనోధైర్యం ఇవ్వాలి
ఆత్మ స్థైర్యం అనే భవన
నిర్మాణంలో అందరు
భాగస్వాములు కావాలి
కుట్రలు కుయుక్తులు
మానాలి
భారత జాతి సౌభాగ్యానికి
స్వయం స్వమృద్ధికి
సుస్తిరాభివృద్ధికి
సామాజిక ఉన్నతితో
సమాజంలో వ్యక్తి
ఆత్మ గౌరవాన్ని
ఇనుమడింప చేసే
గమ్యాన్ని మరువద్దు.
సంస్థలు రాజకీయాలకు
అతీతంగా బలమైన
సాంఘిక ఆర్థిక శక్తిగా
ఎదగడానికి దోహదపడే
దీర్ఘ కాలిక సామాజిక
ఆర్థిక రాజకీయ వ్యూహాలతో
జాతీయ నాయకత్వం
ముందుకుసాగాలి.
బడుగు బహుజన వర్గాలు
రాజ్యాధికారదిశగా కదలాలి.
పాలకులుగా నిలువాలి.
వ్యక్తి సమాజాన్ని
శాసించే శక్తిగాఎదగాలి
గతాన్ని వదలద్దు
గమ్యాన్ని మరువద్దు.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు. తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన
వేదిక, హైదరాబాద్
9440245771

# ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని కలెక్టరేట్‌ను ముట్టడించిన బీజేపీ

వనపర్తి బ్యూరో, మార్చి 20 (జనం సాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయాలని భాజపా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. శుక్రవారం నాడు బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు,వనపర్తి జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించి, సూపరింటెండెంట్ కి మెమోరాండం అందించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ మాట్లాడుతూ ,2023 ఎన్నికలకు ముందు పిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే నాటి బిఆరెస్, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ, అదనంగా రైతులకు పెట్టుబడి సాయం, రైతుబంధు స్థానంలో రైతులకు,కౌలు రైతులకు, రైతు భరోసా ద్వారా 15వేలు, వ్యవసాయ కూలీలకు 12వేలు, ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, చేతులెత్తేశాడని, మహాలక్ష్మి పథకంలో నెలకు 2500, గృహలక్ష్మి పథకంలో నెలకు 200, యూనిట్ల ఉచిత విద్యుత్ చేయూత పథకంలో వృద్ధాప్య, వితంతు, బీడీ, చేనేత, కల్లుగీత కార్మికుల పెన్షన్ 2016, నుంచి 4016, దివ్యాంగులకు 4016, నుంచి 6016, నిరుద్యోగులకు 4016, నిరుద్యోగ భృతి, డిగ్రీ విద్యార్థులకు,



ఉచిత స్కూటీ కళ్యాణ లక్ష్మి పథకంలో, లక్ష రూపాయలతో పాటు, తులం బంగారం, జాబు క్యాలెండర్ ,ద్వారా మొదటి ఏడాదిలోని, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ బీసీ డిక్లరేషన్ ,మహిళా డిక్లరేషన్, రైతు డిక్లరేషన్, యూత్ డిప్రెషన్, పేరిట ఢిల్లీ నుంచి నాయకులను పిలిపించి, హంగామా సృష్టించి అధికారంలోకి వచ్చాడని ,నేడు సబండవర్ణాలను మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఆరు గ్యారెంటీలు 420 హామీలు అమలు చేసేదాకా బిజెపి పార్టీ వెంటాడుతుందని, రేవంత్ రెడ్డి మేడలు వంచైన, ఆరు గ్యారెంటీలు 420 హామీలు అమలు చేయిస్తామని, అమలు చేయని పక్షంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లు పాలన కొనసాగించే హక్కు లేదని, రాష్ట్ర ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమాలు న నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్ ,వారణాసి కల్పన, సీనియర్ నాయకులు సుమిత్రమ్మ, ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి ,బచ్చు రాము, బోయల రాము, ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, కోశాధికారి బండారు కుమారస్వామి, కార్యదర్శులు జంగం సురేందర్, కాటమోని కృష్ణ గౌడ్ ,జిల్లా అధికార ప్రతినిధి కంచ ఆంజనేయులు, 26 వార్డు కౌన్సిలర్ విజయసాగర్,యువ మోర్చా జిల్లా అధ్యక్షులు అరవింద్, ఓబీసీ మూర్తి, అధ్యక్షులు కొమ్ము శ్రీనివాసులు ,ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గంధం ప్రవీణ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు అరవింద్ రెడ్డి ,మండల అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ ,సొంత వెంకటేష్, నాగరాజు, కావలి క్రాంతి నాయుడు, రమేష్, వారాల రవి రాము నాయక్, చిన్న రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల గ్రామాలను అభివృద్ధి పరిచేది కాంగ్రెస్ ప్రభుత్వం



మోమిన్‌పేట, మార్చి 20 (జనం సాక్షి) : మారుమూల గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి గ్రామాలను సస్యశ్యామలంగా తీర్చిదిద్దేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని చక్రంపల్లి గ్రామ సర్పంచ్ బాల్ రాజ్ గౌడ్ పేర్కొన్నారు శుక్రవారం మోమిన్ పేట మండల పరిధిలోని చక్రం పల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాం లోనే మురుకు కాలువల నిర్మాణం గ్రామపంచాయతీ భవన నిర్మాణం సిసి రోడ్లు అదనపు తరగతి గదులు డ్వాక్రా భవనం అంగన్వాడి భవనం వర్క్ షెడ్ వంటి అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చేసుకున్నామని ఆయన తెలిపారు తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నే శంకర్ యాదవ్ సీనియర్ నాయకులు నరోత్తమ రెడ్డి స్థానిక నాయకులు బాల్ రెడ్డి వెంకట్ రెడ్డి ల వార్డు సభ్యుల మండల స్థాయి అధికారుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పత్తి ఆదర్శ గ్రామంగా తయారు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్ రెడ్డి వెంకట్ రెడ్డి ఎండి ఫరీద్ ఎంపీ ఓ యాదగిరి పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# లెర్నింగ్ డయాగ్నోస్టిక్స్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించిన ఎస్ఈడీ



ఖైరతాబాద్, మార్చి 20 (జనం సాక్షి) : అమెరికాకు చెందిన స్టూడెంట్ ఎడ్యుకేషన్ డయాగ్నోస్టిక్స్ (ఎ స్ఈడీ), భారత దేశంలో తన సహజ మేధస్సు, న్యూరోసైన్స్ ఆధారిత లెర్నింగ్ డయాగ్నోస్టిక్స్ ప్లా ట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు స్టూడెంట్ ఎడ్యుకేషన్ డయాగ్నోస్టిక్స్ వ్యవస్థాపకుడు శ్రీనేష్ వి శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టూడెంట్ ఎడ్యుకేషన్ డయాగ్నొస్టిక్స్ సీఈఓ ఆష్లీ సంబలుక్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలా నేర్చుకుంటారో విశ్లేషించడానికి, వారి విద్యాపరమైన బలాలు, అభ్యసన లోపాలను గుర్తించడానికి, వ్యక్తిగతీకరించిన అభివృద్ధి మార్గా లకు మద్దతు ఇవ్వడానికి ఇది రూపొందించ బడిం దని అన్నారు. ఒక అసెస్‌మెంట్, లెర్నింగ్ ఇంటెలి జెన్స్ ప్లాట్‌ఫామ్‌గా అభివృద్ధి చేయబడిన ఎస్ఈ డీ ప్రతి విద్యార్థి సమాచారాన్ని ఎలా గ్రహిస్తారో, భావనలను ఎలా అన్వయిస్తారో విశ్లేషిస్తుందని తెలిపారు. మెదడు ఆధారిత అసెస్‌మెంట్‌లను ఉపయోగించి, ఈ ప్లాట్‌ఫామ్ అభ్యసన శైలులు, బలాలు మరియు మద్దతు అవసరమైన రంగాల ను గుర్తిస్తుందని అన్నారు. ఇది వ్యక్తిగతీకరించిన అకడమిక్ రోడ్‌మ్యాప్‌లను రూపొందించడానికి అభిజ్ఞా నమూనాలను, అకడమిక్ పనితీరును మ్యాప్ చేస్తుందన్నారు. ఇది ఉపాధ్యాయులు, కు టుంబాలు ఇప్పటికే ఉన్న సామర్థ్యాలను బలోపే తం చేస్తూనే, అభ్యసన లోపాలను ముందుగానే పరిష్కరించడానికి వీలు కల్పిస్తుందని అన్నారు.

# మంత్రి వాకిటి శ్రీహరి ఇంటిని ముట్టడి ంచిన ఆశా కార్యకర్తలు

మఖ్తల్, మార్చి 20 (జనంసాక్షి) : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ వర్కర్లకు 18000 స్థిర జీతం వేతనం నిర్ణయించాలని డిమాండ్ శుక్రవారం మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు యువజనుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఇంటిని ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాలు నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు నెలకు రూ. 18,000 ఫిక్స్ వేతనం వెంటనే అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఎన్‌హెచ్‌ఎం కింద తగిన నిధులు కేటాయించి అన్ని సమస్యలను పరిష్కరించాలని పెరుగుతున్న పనిభారం తగ్గించి అదనపు భత్యాలు అందించాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలని గర్భిణీలు, శిశు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశాలకు ప్రత్యేక గౌరవ వేతనం ఇవ్వాలని, ప్రమాద భీమా, ఆరోగ్య భీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు మక్తల్ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి మంత్రి వాకిటి శ్రీహరి ఇంటి దగ్గరకు ర్యాలీగా చేరుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డగించగా ఆశాలు



పెద్ద పెట్టిన నినాదాలు చేస్తూ బార్కెట్లను తోసుకుంటూ మంత్రి ఇంటి దగ్గరకు చేరుకొని గేట్ ముందు కూర్చొని గంటపాటు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం మంత్రి శ్రీహరి పిఏకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి, సిఐటియు జిల్లా నాయకులు వెంకట్రామిరెడ్డి, గోవింద్ రాజ్, బలరాం, వనపర్తి జిల్లా సిఐటియు నాయకులు నిక్సన్ ఎస్ రాజు, మహబూబ్ నగర్ ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షులు సావిత్రి, గోవిందమ్మ, యశోద, ఇందిరమ్మ, సుజాత, లక్ష్మి, ఎస్ పార్వతమ్మ, వెంకటలక్ష్మి, ఫర్జన బేగం, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న డిఏపిఆర్‌సిలను వెంటనే చెల్లించాలి



పెద్దశంకరంపేట, మార్చి 20 (జనం సాక్షి) : పెద్ద శంకరంపేట్.. ఉపాధ్యాయ ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న డిఎ పిఆర్సి లను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మెదక్ జిల్లా తపస్ సంఘం ఉపాధ్యక్షుడు గుజరి రవి పేర్కొన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తపస్ ఉపాధ్యాయ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు సంబంధించిన డీఏలను పిఆర్సీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెద్ద శంకరంపేట మండల తపస్ సంఘం అధ్యక్షుడు సత్యకుమార్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. తపస్ మండల గౌరవ అధ్యక్షులుగా కాన్షీరామ్ జాదవ్. ఉపాధ్యక్షులుగా సచిన్ కుమార్. కోశాధికారిగా లక్ష్మణ్. కార్యదర్శులుగా సాయికుమార్ ఉదయ్ కుమార్ గంగాధర్ శ్రీనివాస్ శివకృష్ణ. మహిళ కార్యదర్శులుగా అనురాధ సంపూర్ణ ప్రతిభ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తపస్ సంఘం బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య

రాయికోడ్, మార్చి 20 (జనం సాక్షి) : ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగ్వర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు ఇందిమ్మ గృహాలను డిసిఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజ్ పాటిల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్ వీరభద్ర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణిలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ గత పది సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ఏ ఒక్కరికి కూడా ఇండ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన అప్పటినుండి అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రైకోడ్ మండల



అభివృద్ధికి ఏన లేని కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్క లబ్ధిదారులు ఇందిరమ్మ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. అనంతరం అతిథులందరికీ లబ్ధిదారులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురుదాస్, పంచాయతీ కార్యదర్శితోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్, జి విట్టల్, ఆర్ పాండు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల మహా ధర్నాను విజయవంతం చేయాలి



శామీర్‌పేట్, మార్చి 20 (జనం సాక్షి) : జేఏసి తలపెడుతున్న చలో ఢిల్లీ మహా ధర్నా ను రాష్ట్ర ల బీసీలు ఐక్యంగా కలిసి వచ్చి విజయ వంతం చెయ్యాలని జే ఏ సి రాష్ట్ర కన్వినర్ డాక్టర్ చింత రమేష్ గౌడ్ పేర్కొన్నారు .శుక్రవారం మహా ధర్నా వాల్ ఫోస్టర్ ను నాయకులు విడుదల చేశారు.కేంద్రం ప్రవేశ పెట్టిన కులగణలో బీసీల లిస్టు లేకపోవడం చాలా బాధాకరమని, దేశంలో 60 శాతం ఉన్న బీసీలు కులగణలో పేరు లేక పోవడం చాలా బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు.బిసి ఐన ప్రధానమంత్రి మోడీ బీసీ కులాలను లిస్టులో పెట్టకపోవడం చాలా దుర దృష్టకరంగా భావిస్తున్నామన్నారు. ఈ నెల 23 తారీకు చలో ఢిల్లీ ధర్నా కార్యక్రమం విజయ వంతం చేయ్యాలన్నారు. బీసీలందరూ 23 తారీకు జంతర్ మంతర్ దగ్గర ధర్నాకు రావాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు. ధర్నాకు బీసీ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వరంలో మొత్తం మన భారత దేశంలోనూ అన్ని రాష్ట్రాలు కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయని రమేష్ గౌడ్ పేర్కొన్నారు.


# పోలీసు జాగిలాలతో విస్తృత తనిఖీలు



పెద్దశంకరంపేట, మార్చి 20 (జనంసాక్షి) : పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని రంజాన్ పండగ పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునే ఈద్గా వద్ద శుక్రవారం పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్సై ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ భద్రతా చర్యలు తీసుకున్నారు. ప్రార్థనల సమయంలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేట ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

# సన్మార్గంలో నడిపే సాధనం భక్తి భజన సంకీర్తనం

పెబ్బేరు, మార్చి 20 (జనం సాక్షి) : మనిషిని సన్మార్గంలో నడిపే ఏకైక సాధనం భక్తి భజన సంకీర్తనం అని మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.ఉగాది పండుగను పురస్కరించుకొని శుక్రవారం వనపర్తి సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో పలువురు భక్తి భజన సంకీర్తనాపరులను ఆయన ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో భక్తి ఒక ప్రత్యేక స్థానముందని అనేక మంది సంకీర్తనాపరులు సమాజం సన్మార్గంలో పయనించడానికి భక్తితత్వంలో చక్కని మార్గం చూపారని వివరించారు.ఇప్పటికీ ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ భజన కీర్తనలకు ప్రాణం పోస్తున్న భజనపరులను ఆయన అభినందించారు. పెబ్బేరు,కంచిరావుపల్లి, తాటిపాముల, వెంకటాపూర్, జానంపేట, కంబాలాపురం, తదితర గ్రామాలకు చెందిన దాదాపు 50మంది కళాకారులను చంద్ర శేఖర్ రెడ్డి



శాలువ,జ్ఞాపిక కొత్త సంవత్సరం పంచాంగంతో సన్మానించారు. ఈనాటి కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్,బైరోజు చంద్ర శేఖర్,జిల్లా రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్ ఉమామహేశ్వర్,కరెస్వామి ,వనం రాములు,నందిమల్ల అశోక్,కరుణశ్రీ, దిలీప్ రెడ్డి,సితార వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో అట్టహాసంగా రైతు మేళ ఉత్సవాలు

- పలు రకాల స్టాళ్లను తిలకిస్తున్న రైతులు



నంగునూరు, మార్చి 20 (జనం సాక్షి) : నంగునూరు మండలం నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో రైతు మేళా కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రైతులు ఆసక్తిగా స్టాళ్లను తిలకించి, కావలసిన వివరాలు తెలుసుకుంటూ, అయితే నెల ఉత్సవాల్లో పాల్గొనడం జరుగుతుంది . మొదటి రైతు మేళ కార్యక్రమానికి సుమారు 5 వేల మంది రైతులు హాజరైనట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న రైతు మేళ కార్యక్రమాన్ని ఆదివారం రోజు వరకు కొనసాగనుంది. రైతు మేళ కార్యక్రమంలో మొత్తం 150 స్టాళ్లను ఏర్పాటు చేశారు. రైతు మేళా కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, హార్టికల్చర్, పశుసంవర్ధక, మార్క్ ఫెడ్, ఫిషరీస్, నాబార్డ్, విజయ డైరీ, బ్యాంకర్స్, సహకార, వివిధ వ్యవసాయ టెక్నాలజీ సంస్థలు తదితర సంస్థలు మరియు శాఖలకు సంబంధించి 150 స్టాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు చెప్పారు. ఈ స్టాళ్లలో ఆయా శాఖల ద్వారా రైతులకు ఉపయోగకరమైన పరికరాలను, నమూనాలను మరియు లైవ్ స్టాకులను ఏర్పాటు చేశారు. 19వ తేదీన ప్రారంభమై 22వ తారీకు వరకు కొనసాగనున్న ఈ రైతు మేళాలో ప్రతిరోజు 3000 నుండి 5000 మంది రైతులు సందర్శిస్తారని అందుకు అవసరమైన అన్ని ఏర్పట్టను చేశామని పేర్కొన్నారు.

# పర్యావరణ స్ఫూర్తి 'వనజీవి రామయ్య' షార్ట్ ఫిలింకు గద్దర్ అవార్డు

- ప్రథమ ఉత్తమ లఘు చిత్రంగా ఎంపిక
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా పురస్కార ప్రదానం

తాండూరు, మార్చి 20 (జనంసాక్షి) : పర్యావరణ పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ వనజీవి రామయ్య స్ఫూర్తితో తెరకెక్కిన 'వనజీవి రామయ్య' లఘు చిత్రం ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డును కైవసం చేసుకుంది. ప్రకృతి పరిరక్షణ ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం 'ఫస్ట్ బెస్ట్ షార్ట్ ఫిలిం'గా ఎంపికైంది.గురువారం రాత్రి హైదరాబాద్‌లోని హైటెక్ లో నిర్వహించిన గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ అవార్డును ప్రదానం చేశారు. చిత్ర దర్శకుడు, నంది అవార్డు గ్రహీత వేముగంటి, నిర్మాతలు రవీంద్రనాథ్, నరేష్ కుమార్



ప్రజాపతిలు ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఆకట్టుకున్న నటన

## వికారాబాద్ విద్యార్థుల భాగస్వామ్యం

ఈ చిత్రంలో వనజీవి రామయ్య పాత్రలో ప్రముఖ నటుడు బ్రహ్మాజీ జీవించగా, జానకమ్మ పాత్రలో నాగరాణి ఒదిగిపోయారు. తాండూరుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షులు కే.వి.యం వెంకట్ ఈ చిత్రంలో రామయ్య తండ్రి పాత్రలో నటించి తన ప్రతిభను చాటుకున్నారు. వికారాబాద్ అనంతగిరి అటవీ ప్రాంతంలో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రంలో వికారాబాద్ కే.జి.బి.వి, తాండూరు తెలంగాణ గురుకుల, మరియు లక్ష్మీబాయి గురుకుల విద్యార్థులు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు నటించడం విశేషం. బల్లేపల్లి మోహన్ అందించిన సంగీతం చిత్రానికి అదనపు బలాన్ని ఇచ్చింది. రైటర్ డాక్టర్ దాసరి రంగా ఫోటోగ్రఫీ తోట రమణ అందించారు.

## ప్రభుత్వ గుర్తింపుపై హర్షం

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న చిత్రాలను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి గద్దర్ అవార్డుతో సత్కరించడం పట్ల చిత్ర యూనిట్ సంతోషం వ్యక్తం చేసింది. పర్యావరణంపై సమాజంలో అవగాహన పెంచేందుకు ఈ సినిమా దోహదపడుతుందని, సహకరించిన అందరికీ దర్శకుడు వేముగంటి మరియు నిర్మాతలు కృతజ్ఞతలు తెలిపారు.

# దైవచింతనలో జీవితం పరిపూర్ణం..!

- గురువు,శ్రీ శ్రీ గురు గంగాధరస్వామి ఆశీస్సులతో ముందుకు
- ఆశ్రమంలో దేవత మూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన

**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 20 (జనం సాక్షి) :** ప్రతి మనిషి జీవితంలో వివిధ దశలుంటాయి.. వాటన్నిం టిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారయనా.. జీవిత గమనంలో అనేక మైలు రాళ్లు అధిగమిస్తూ పేరుకు తగినట్లుగానే జీవితంలో 'పరిపూర్ణంగా' శ్రీ శ్రీ శ్రీ 108 శివయోగి శివచార్య మహాస్వామి భక్తులకు దగ్గరయ్యారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని తంగడపల్లి కోటి బిల్వ లింగేశ్వర మఠం శ్రీశ్రీ గురుగంగాధర మహాస్వామి ఆశ్రమ మఠాధిపతిగా ష" బ్ర"108 శ్రీశ్రీ శ్రీ శివయోగి శివచార్య మహాస్వామి భక్తులకు ప్రవచనాలు బోధిస్తున్నారు.



### చిన్న వయసులోని దీక్ష...

108 శ్రీశ్రీశ్రీ శివయోగి శివచార్య మహాస్వామి స్వగ్రామం హెడ్గిమాద్రి, జిల్లా, తాలూకా, యదగిర్, కర్ణాటక రాష్ట్రం ఏప్రిల్ 3, 1995 జన్మించిన స్వామి చిన్న వయసులోని 2005లో దీక్ష స్వీకరించారు. అప్పగారి గురువు,శ్రీ శ్రీ గురు గంగాధరస్వామి ఆశీస్సులతో సదాశివపేట మండలంలోని తంగేడుపల్లి ఆశ్రమంలో 2010 నుండి భక్తుల కోరిక మేరకు ఆశ్రమంలో ఉండిపోయారు. అప్పటి నుండి ఆశ్రమాన్ని అభివృద్ధి చేసి ప్రతి సంవత్సరం వార్షికోత్సవం తో పాటు అన్ని పండగలకి భక్తిశ్రద్ధలతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బాల్యంలో వివిధ ప్రదేశాల్లో ఎంతోమంది మహాసాములను కలిశారు.

### ఆధ్యాత్మిక చింతన..

ఆధ్యాత్మిక చింతనతోని మనసుకు ప్రశాంతత చేకూరుతుందని నిత్యం ఆశ్రమానికి వచ్చిన భక్తులకు ప్రవచనాలు బోధిస్తూ తన గురువు ,శ్రీ శ్రీ గురు గంగాధర మహాస్వామి ఆశీస్సులతో బోధనలు చేస్తున్నడంతో జిల్లాలోని భక్తులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో కోటి బిల్వ లింగేశ్వర మఠం శ్రీశ్రీ గురు గంగాధర శ్రమానికి హాజరై శివయోగి శివాచార్య మహాస్వామి బోధనలు వింటారు.

### అంచెలంచెలుగా అభివృద్ధి...

ఆశ్రమంలో నిత్యం భక్తులకు అన్నదానం జరుగుతుండటం ప్రత్యేకత. ఉదయం, రాత్రి వేళ అల్పాహారాన్ని సైతం అందజేస్తారు. ఎందరొచ్చినా లేదనకుండా అన్నదానం చేయడం ఈ ఆశ్రమంలో కనిపిస్తుంది. ఈ ఆశ్రమంలో గోశాల, కల్యాణ మండపం,యాత్ర నివాస్, అతిథి గృహం, 65వ జాతీయ రహదారి పక్కన ఆలయ ముఖద్వారం ఏర్పాటు చేశారు. అలాగే ఆశ్రమ ప్రాంగణంలో గురు గంగాధర మహా స్వామి భవ్య మందిర నిర్మాణం అమ్మవారి దివ్య మందిరం నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఆశ్రమంలో ఈనెలకొన్న కోటి బిల్వ లింగేశ్వర ఆలయం భక్తులను ఆకట్టు కుంటుంది.

### భక్తులే సేవకులు...

ఆశ్రమంలో ఆహార పదార్థాలను తయారుచేసి భక్తులకు వడ్డించడం, కూరగాయలు తరగడం, తాగునీటి సరఫరా, తదితర కార్యక్రమాలను ఆశ్రమానికి వచ్చే భక్తులే సేవకులుగా మారి నిర్వహించడం ప్రత్యేకత. ఏ ఒక్కరూ జీతభత్యాలు తీసుకోరు. ఎవరికి సమయం ఉంటే వారు ఆశ్రమంలో జరగాల్సిన పనుల్లో నిమగ్నమవుతారు. ఆశ్రమానికి ఎంత మంది భక్తులు వచ్చిన అన్నప్రసాదం అందించడం ఇక్కడి ప్రత్యేకత.

### శివాచర్య మహాస్వామి జన్మదిన వేడుకలకు ఏర్పాటు...

శ్రీశ్రీశ్రీ 108 శివయోగి శివచార్య మహాస్వామి జన్మదినోత్సవం ఈ నెల 22 ఆదివారం నిర్వహించడానికి భక్తులు భారీ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా సదశివపేట మండలంలోని తంగేడుపల్లి గ్రామ శివారులో ఎంతో ఆహ్లాద వాతావరణంలో కొలువైన శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మఠం శ్రీశ్రీ గురుగంగాధర మహాస్వామి ఆశ్రమంలో మహాస్వామి 31 వ జన్మదినోత్సవ వేడుకలు సాయంత్రం 4 గం. లకు నిర్వహించెందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాలు, జిల్లాలోని ఆశ్రమాలు, మఠల పీఠాధిపతులకు, మహా స్వాములకు జన్మదినోత్సవ ఆహ్వానం పంపించారు. అలాగే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే లకు కూడా ఆహ్వాన పత్రిక అందించాలి. జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడానికి భక్తులు ఏర్పాట్లు పూర్తి చేశాను.

## ఘనంగా అక్కల్కోట మహారాజ్ జయంతి వేడుకలు



**శివ్వంపేట, మార్చి 20 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలోని శ్రీ గురుపీఠంలో సమర్థ స్వామినాథ అక్కల్కోట మహారాజ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వేద పండితులు కలియుగ నాలుగవ దత్తావతారుడైన శ్రీ అక్కల్కోట సమర్థ స్వామినాథ మహారాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉగాది పండుగ రోజున శ్రీ గురు పీఠంలోని దత్త శ్రవణం, పంచాయతన సహిత మహా రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామార్చన వేద పండితుల మంత్రోచ్చారణ మధ్యన ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ అక్కల్కోట స్వామి సమర్థ కలియుగ అవతారులకు ప్రత్యేక నివేదన చేసి, శ్రీ దత్త మంగళాష్టకం పఠనం చేశారు. ఈ సందర్భంగా గురుపిఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్ద గౌని శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈ సృష్టికి కర్తలైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల అవతారమైన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి అలాగే కలియుగ దత్తావతారుల దర్శనం ఎంతో శుభదాయకమని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయంలో ఉదయం 6: 30 గంటలకు కాకడ హారతి తదనంతరం అభిషేకం, అష్టోత్తర అర్చనతో భక్తులు దేవత మూర్తుల ఆశీస్సులు పొందారు. మధ్యాహ్న హారతి లో భక్తులు అశేషంగా పాల్గొని బాబ ఆశీస్సులు పొందారు. శ్రీ గురుఫీఠం చారిటబల్ ట్రస్ట్ తరుపున భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుఫీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులు స్వామి వారి సేవలో పాలొన్ని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఇందులో శ్రీ గురుఫీఠం ట్రస్ట్ సభ్యులు జిన్నారం పెద్దగౌని శ్రీనివాస్ గౌడ్, రాజం భిక్షపతి యాదవ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, సిబ్బంది కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్ లతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన వాకిటి లలితమ్మ



**కృష్ణ, మార్చి 20 (జనం సాక్షి) :** మండల ఖాన్ దొడ్డి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు గోకులపోళ్ళ ఆంజనేయులు శాంతమ్మ, మనపోళ్ళ తాయప్ప లీలావతి, వై శ్రీనివాస్ అశమ్మ కు, మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని శుక్రవారం గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ హాజరై లబ్ధిదారులకు వస్త్రాలు, అందజేసి ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్ , గ్రామ సర్పంచ్ ఎస్. వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు పల్లె సురేష్, సుదర్శన్, మల్లికార్జున్, వెంకటేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ తారేష్, అధికారులు ఎంపీడీఓ విజయ్ లక్ష్మీ, సెక్రటరీ, హౌసింగ్ డిఈ, ఎఈ, గ్రామస్తులు, జి శ్రీనివాసులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 20 (జనం సాక్షి) :** రంజాన్ పండుగ సందర్భంగా నారాయణపేట జిల్లా ఎస్పీ వినీత్ జిల్లాలోని ము స్లింలకు శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బువ్వమ్మ గుట్ట ఈద్గా వద్ద పోలీసు బందోబ స్తు ఏర్పాట్లను శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని జిల్లా పరిధిలోని అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగ కుండా ముందస్తుగా ట్రాఫిక్ డైవర్షన్‌లు అమలు చేస్తు న్నామని, ప్రధాన రహదా రులు, చౌరస్తాల్లో ప్రత్యేక పోలీసు పికెట్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా నిరంతర పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా మని తెలిపారు. ప్రజలంద రూ సోదరభావంతో, పరస్పర గౌరవంతో తమ పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుత వాతావర ణంలో జరుపుకోవాలని కోరారు. సామాజిక మాధ్య మాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలలో ఇతరుల మనోభా వాలను దెబ్బతీయగల, కించపరిచే పోస్టులు చేయ కుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. సోషల్ మీడి యాపై పోలీసు శాఖ నిరంత రం నిఘా ఉంచుతుందని, ఎవరైనా అనుచిత పోస్టులు పెడితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీస్ శాఖకు ప్రజలు పూర్తి సహ కారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ తో పాటు డీఎస్పీ నల్లపు లింగ య్య, ఎస్సై వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, అధికారులు, ఎంఐఎం కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు తది తరులు పాల్గొన్నారు.

## చిత్తశుద్ధి ఉంటే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత చేయాలి

- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్



**నారాయణపేట, మార్చి 20 (జనంసాక్షి) :** ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వా నికి చిత్త శుద్ధి ఉంటే చట్ట బద్ధత తీసుకురావాలనీ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి వీరేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలను తక్షణమే అమలు చేయాల ని డిమాండ్ చేస్తూ జిల్లా బీజేపీ అధ్యక్షులు కొండా సత్య యాదవ్ ఆధ్వ ర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. అంతకు ముందు మున్సిపల్ వివేకానంద పార్క్ నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ కు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగింద న్నారు. కానీ వాటిలో ఏ ఒక్క హామీ కూడా ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు.. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి తొలం బంగారం, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. ప్రభు త్వం మీద నమ్మకం పెట్టు కొని ఓటు వేసిన ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా సమయానికి అందకపోవడం తో రైతులు పెట్టుబడుల కోసం అప్పులపై ఆధారప డాల్సిన పరిస్థితి ఏర్పడుతోం దన్నారు. అలాగే వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్లు అర్హులైన లబ్ధిదా రులకుఅందడంలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు లు చేసుకున్న అనేక మంది వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఇప్పటికీ ఒక్క పెన్షన్ మంజూరు కాలేదనీ విమర్శించారు. అర్హులైన అభ్యర్థులందరి దరఖాస్తు లను వెంటనే ఆమోదించి వారికి పెన్షన్లు అందించాలని డిమాండ్ చేశారు. పేదలకు ప్రభుత్వం ప్రకటించిన గృహ నిర్మాణ పథకం కింద అర్హులై న లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు మంజూరు చేసే ప్రక్రి యను వేగవంతంచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిం చిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు దరఖా స్తులు సమర్పించి నప్పటికీ వారి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదన్నారు. ఆ దరఖాస్తుల ను తక్షణమే పరి ష్కరించి ప్రజలకు న్యాయం చేయాల ని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు డాక్టర్ తిరుపతి రెడ్డి, లక్ష్మి శ్యామ్ సుందర్, బలరాంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్మన్ మంజుల జి ఆర్ రెడ్డి, కౌన్సిలర్లు సత్య రఘుపాల్ రెడ్డి, ప్రభాకర్ ,రాఘవేంద్ర, సర్పంచ్ లు కే.నాగిరెడ్డి, చంద్ర శేఖర్ గౌడ్ ,పార్టీ సీనియర్ నాయకులు కర్నీ స్వామి, మిర్చి వెంకటయ్య, టౌన్ బిల్డర్ వెంకటరాములు, శ్యాంసుందర్ గౌడ్ ,ఆశప్ప, రఘురామయ్య గౌడ్, గోపాల్ యాదవ్, డీలర్ అశోక్, సైదప్ప నక్క సత్యనారాయణ, దత్తు జాజాపూర్ మణి శంకర్ ,మండల బిజెపి అధ్యక్షులు జ్యోతి సాయి బన్న, పట్టణ కమిటీ, మండల వివిధ మోర్చాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసిన ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 20 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాకు ఇటీవల నూతనంగా నియమితులైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం రోజు కలెక్టర్ కార్యాలయంలో పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా పరిపాలన, శాంతి భద్ర తల పరిరక్షణ, ప్రజా సమస్య ల పరిష్కారం వంటి అంశాల పై పరస్పరం చర్చించుకు న్నారు. జిల్లాలో చట్టవ్యవ స్థను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం దిశగా పరిపాల న,పోలీస్ శాఖలు సమిష్టిగా కృషి చేస్తామని నూతన కలెక్టర్ నాయకత్వంలో జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు.

## జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది సంబురాలు

- గత కొన్ని దశబ్దాలుగా రామ్‌నగర్ రామ్‌మందిర్‌లో పేలాల లడ్డూ ప్రసాదం విసిరే ఆచారం



**సంగారెడ్డి టౌన్, మార్చి 20 (జనం సాక్షి) :** ప్రతీ ఏడూ మాదిరిగా ఈ ఏడాది రామ్ మందిర్ లో ఉగాది వేడుకలు అంబరాన్ని అంటాయి. టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం లో రామ్ నగర్ రామ్ మందిర్ లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. జగ్గారెడ్డి స్వయంగా పాటలు పాడుతూ, భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలో పాల్గొన్నారు. పేలాల లడ్డు ప్రసాదంతో భజన కీర్తనలు పాడుతూ రామ్‌నగర్‌లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రామ్ మందిర్‌లో శ్రీకృష్ణ భగవానుడి ఉట్టి కొట్టడం నిర్వహించారు. అనంతరం తరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం రామ్ మందిర్ పై నుండి పేలాల లడ్డూ ప్రసాదాన్ని భక్తుల పైకి విసిరేశారు. ఉగాది రోజు ఈ లడ్డూ ప్రసాదాన్ని అందుకుంటే అదృష్టం వరిస్తుందని భక్తులకు నమ్మకం. ఈ ప్రసాదాన్ని అందుకోవడానికి వేలాది మంది భక్తులు రామ్ మందిర్ కు చేరుకుని ప్రసాదాన్ని అందుకోవడానికి పోటీలు పడ్డారు. ఈ కార్యక్రమం లో టీజిఐఐసి నిర్మలా జగ్గారెడ్డి తో పాటు జగ్గారెడ్డి కూతురు జయా చైతన్య రెడ్డి, కొడుకు భరత్ సాయి రెడ్డి లతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష

**అయిజ, మార్చి 20 (జనం సాక్షి) :** అధికారులు, ఇతర సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. శుక్రవారం అయిజ పిహెచ్ సి ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వైద్య సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లో సరైన సంతకాలు చేయకపోవడం, లీవ్ లెటర్ ఇవ్వకుండా గైర్హాజరు కావడం, సంతకం పెట్టి విధులు నిర్వహించకుండా వెళ్లిపోవడం వంటి పలు కారణాలతో 9 మందికి షోకాజు నోటీసులు ఇవ్వాలని డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయిను ఫోన్లో ఆదేశించారు. ఒకరిని సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఓపి రిజిస్టర్ ను పరిశీలించి ప్రతిరోజు సుమారు వందకు పైగా రోగులు చికిత్స నిమిత్తం వస్తున్నందున వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఎన్సిడి, ఎర్లీ డేట్ అఫ్ డెలివరీ, తదితర రిజిస్టర్లను పరిశీలించి రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలని అక్కడి వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు ఎక్కువగా జరిగేలా అవగాహన కల్పించాలని, సబ్ సెంటర్స్ లోను అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మందుల స్టోర్లో మెడికల్ కిట్లను పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి వార్డులు, ఇతర భవనాల్లో అనవసరమైన ఫర్నిచర్, పాత సామాన్లను వారంలోగా క్లీన్ చేయించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అయిజ పట్టణంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. స్టాక్ రిజిస్టర్ ను, ధరల పట్టికను పరిశీలించారు. రైతులు తమకు కావలసిన ఎరువులను నూతనంగా వచ్చిన యాప్ ద్వారా బుక్ చేసుకునే విధానంపై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. రైతు భరోసా దరఖాస్తుకు ఈనెల 25 చివరి తేదీ కాబట్టి అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు సహకరించాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడుతున్నందున రైతు వేదికల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే ఐజ లోని లక్ష్మీ శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. నిర్ణీత గడువులోగా గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్న వారికి ఓటీపీ నెంబర్ వస్తుందని, నిబంధనలు పాటించకుండా బుక్ చేసుకుంటే ఉపయోగం లేదని అందుకు గల కారణాలు చెబుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సంబంధిత ఏజెన్సీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రతిరోజు బుకింగ్స్, సిలిండర్ల డెలివరీ, తదితర అంశాల గురించి కలెక్టర్ మాట్లాడారు. వినియోగదారులు అనవసరంగా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల వద్ద బారులు



తీరకుండా వారికి అవసరమైన సమాచారాన్ని అందజేసేందుకు హెల్ప్ డెస్‌ను కూడా ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్ కు ఆదేశించారు. చివరగా ఐజ కేజీబీవీని సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ వంటగదిలో వండిన పదార్థాలను పరిశీలించి, మెనూ ప్రకారం వంటలు చేయకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డార్మెటరీ మరమ్మత్తులు ఉన్నందున విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, విద్యాలయం అభివృద్ధికి అవసరమైతే అదనపు నిధులను మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందజేస్తున్న ఆహారం, ఇతర సౌకర్యాలపై వాకబు చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు తన దృష్టికి తీసుకురావాలని, తప్పకుండా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

## సాయుధ ముఖ్య కార్యాలయ ఆకస్మిక తనిఖీ

- ప్రతీ పోలీసుకు నీతి నిజాయితీ అవసరం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) : సాయుధ పోలీసు సిబ్బందికి క్రమశిక్షణతో పాటు, నిజాయితీ తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు సాయుధ ముఖ్య కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ విధులలో నిర్లక్ష్యాన్ని వహించకూడదని సిబ్బంది కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలి అని విధులలో సమయపాలన పాటిస్తూ ఉండాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, విధులకు అనవసరంగా గైర్హాజరైన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సాయుధ కార్యాలయంలో ఉన్నటువంటి ప్రతి ఒక్క ఆయుధాన్ని పూర్తిగా శుభ్రపరుస్తూ ఉండాలని తెలిపారు. యువ పోలీసులకు సాంకేతికపరమైన విధులను కేటాయించడం జరుగుతుందని, ఉత్సాహం ఉన్నవారికి సంబంధిత విభాగాలలో విధులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు సాయుధ పోలీసులు సంసిద్ధంగా ఉంటూ ఎల్లవేళలా అప్రమత్తమై ఉండాలని సూచించారు. సిబ్బంది వారికి ఉన్నటువంటి సెలవు దినాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బంది విధులను రొటేషన్ పద్ధతిలో నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలీసు సిబ్బందికి ప్రతి ఒక్కరికి విడతలవారీగా సమానమైన విధులు కేటాయించి, ఎలాంటి భేద భావాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టీ మురళి, ఎన్ చంద్రశేఖర్, రిజర్వ్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముస్మి పంచాయతీలో నిధుల 'గోల్‌మాల్'

- ఓటీపీలే ఆసరాగా లక్షల దోపిడీ!
- గ్రామసభ లేదు.. తీర్మానం లేదు.. నిధుల డ్రా!
- ఉపసర్పంచ్ అమాయకత్వాన్ని క్యాష్ చేసుకున్న వైనం
- పాత పనుల బిల్లులు పక్కదారి.. గ్రామస్తుల ఆగ్రహం







కొత్తగూడ, మార్చి 20 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ముస్మి గ్రామ పంచాయతీలో భారీ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. ప్రజా ధనాన్ని కాపాడాల్సిన బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారే నిధులను అడ్డదారిలో కాజేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కై, ఉపసర్పంచ్ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని లక్షలాది రూపాయల నిధులను గోల్‌మాల్ చేశారని గ్రామస్తులు, మాజీ సర్పంచ్ బహిరంగంగా ఆరోపిస్తున్నారు. నకిలీ తీర్మానాలతో నిధుల వేట గ్రామ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను డ్రా చేయాలంటే గ్రామసభ నిర్వహించి, అధికారిక తీర్మానాలు చేయాల్సి ఉంటుంది. కానీ, ముస్మి పంచాయతీలో అవేమీ లేకుండానే, రాత్రికి రాత్రే నకిలీ తీర్మానాలు సృష్టించి నిధులు డ్రా చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, నిధుల ఉపసంహరణకు అవసరమైన (ఓటీపీ)లను ఉపసర్పంచ్ తొలెం శ్రీకాంత్ నుంచి చాకచక్యంగా సేకరించి, ఆయన ప్రమేయం లేకుండానే భారీ మొత్తంలో నగదును దారి మళ్లించినట్లు సమాచారం. పాత బిల్లుల పేరుతో కొత్త దందాలు 2019–20 ఆర్థిక సంవత్సరంలో ముస్మి తండా, బోతవానిగూడెం ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాల 'స్పెషల్ రిపేర్స్' (ఎంబీ నెంబర్: 901/47, పేజీ నెంబర్: 79) కింద ఏం బి రికార్డు అట్టి పనుల పైసాలు అందలేదు. అయితే, ఇటీవల పంచాయతీకి వచ్చిన 15వ ఆర్థిక సంఘం (ఎఫ్ ఎఫ్ సి) గ్రాంట్స్ నుండి రూ. 1,05,576 లను డ్రా చేసిన అధికారులు, వాటిని అసలైన లబ్ధిదారులకు ఇవ్వకుండా వేరే వ్యక్తుల ఖాతాలకు మళ్లించడం గమనార్హం. ఇలా లక్షల రూపాయలు డ్రా చేసినట్లు తెలుస్తోంది.



### ఉన్నతాధికారులు స్పందించాలి

ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, ప్రజా ధనాన్ని స్వాహా చేస్తున్న వారిపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపించాలని, అక్రమంగా డ్రా చేసిన నిధులను రికవరీ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఉప సర్పంచ్ తొలెం శ్రీకాంత్...

## చెత్త ఏరుకునే మహిళల వేషంలో...
# మోటార్ల దొంగతనం

- పట్టుకున్న స్థానికులు.. పోలీసుల కేసు నమోదు

రేగొండ,మార్చ్ 20 ( జనం సాక్షి): పట్టపగలు గ్రామాల్లో ఎవరు లేని సమయంలో వచ్చి చెత్త ఏరుకునే నెపంతో నీళ్ల మోటార్లు దొంగలించే మహిళలను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం తిరుమలగిరి గ్రామంలో ప్రజలు పనులకు వెళ్ళిన తర్వాత గ్రామంలో చొరబడిన వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన మహిళలు తూర్పాటి ప్రేమ,నూనె మల్లమ్మ,సొగల సమ్మక్క,రుద్రాక్ష స్వాతి,తూర్పాటి మైసమ్మ పనికిరాని ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు ఏరుకుంటున్నట్లు నటించి,ఊర్లో ఉన్న విద్యుత్ మోటార్లను సంచిలో వేస్తుండగా గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.గ్రామస్తుడు రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చెత్త ఏరుకులో నెపంతో వచ్చి నీళ్ళ మోటర్లను దొంగతనం చేయుటకు రాయత్నించినందుకు పై వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద అపరిచిత వ్యక్తులు తిరుగుతున్నట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా



మంచిర్యాల ప్రతినిధి , మార్చి 20 (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో మంచిర్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు పిలుపుమేరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం వద్ద భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయిన కూడా ఇప్పటివరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. 6 గ్యారంటీలు 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నయవంచనకు గురిచేసిందని మండిపడ్డారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. అక్కడక్కడ కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇల్లు కేటాయించి నిజమైన అర్హులకు అన్యాయం చేశారన్నారు. కమీషన్ల కోసం ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ నాయకులు అమ్ముకుంటున్నారని, బెల్లంపల్లి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల విషయంలో జరిగినటువంటి అవకతవకల మీద కోర్టు స్టే తెచ్చుకోవాల్సినటువంటి పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని సుస్థిరమైన పాలన అందించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకునే విధంగా పరిపాలన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ గాజుల ముఖేష్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి, మరియు జిల్లా ప్రధాన కార్యదర్శులు దుర్గం అశోక్ , వంగపల్లి వెంకటేశ్వరరావు, ఎనగందుల కృష్ణమూర్తి జిల్లా ఉపాధ్యక్షులు అక్కల రమేష్, పట్టి వెంకటకృష్ణ, కోడి రమేష్, కమలాకర్ రావు, జోగుల శ్రీదేవి, ముత్తె సత్తయ్య గార్లు మరియు జిల్లా కార్యదర్శులు రాచర్ల సంతోష్, వైద్య శ్రీధర్, మహేందర్ గౌడ్, మంత్రి సురేఖ రామయ్య, ఠాకూర్ శైలేందర్ ఉదయశ్రీ, మండల అధ్యక్షులు, అమీరిశెట్టి రాజు కుమార్, కుర్రె చక్రవర్తి, రంగా శ్రీశైలం, సత్రం రమేష్ మరియు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ కార్పొరేటర్లు కస్తూరి నాగరాజు, బోట్ల అనిత సత్యం పాల్గొన్నారు.



## ఎనుమాముల మార్కెట్లో మక్కల కొనుగోలు ప్రారంభించాలి

- మాజీ మంత్రి దయాకర్ రావు

పాలకుర్తి, మార్చి 20(జనంసాక్షి) : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్లో వెంటనే మక్కల కొనుగోలును ప్రారంభించాలని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మీడియాతో ఫోన్లో దయాకర్ రావు మాట్లాడుతూ రైతులు పంటను మార్కెట్ కు తీసుకువచ్చి పదిహేను రోజుల వుతున్న ప్రభుత్వం ఇంత వరకు కొనుగోలు కేం ద్రాలు తేరవలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఈ సారి ఎనమిది లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ ముందు చూపుతో రైతుల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే, ఈ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి లేచి గ్రామాల్లో మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు. మక్కలకు క్వింటా రూ.2400 మద్దతు ధర ఉన్నప్పటికి రైతులు ప్రైవేటు వ్యాపారులకు రూ.1600. రూ.1700 లకే విక్రయిస్తున్న దయనీయ పరిస్థితి ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని, లేకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామనే హెచ్చరించారు.

## పశువులకు టీకాలు షురూ!

'నిర్లక్ష్యపు నీడలో...పశు వైద్య శాఖ' కథనానికి స్పందించిన అధికారులు....






మంగపేట, మార్చి 20(జనంసాక్షి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పశుసంపద పై ఆధారపడి జీవించేవారే అధికం అలాంటి రైతులకు వెన్నెముకగా నిలవాల్సిన పశు వైద్యశాఖ వైద్యాధికారులు 'నిర్లక్ష్యపు నీడ' లో ఉన్నారంటూ పశువుల రైతులు ఆరోపిస్తున్నారు. అనే విషయాన్ని జనంసాక్షి దినపత్రిక గురువారం ప్రచురితమైంది. ఈ వార్త పై స్పందించిన జిల్లా పశు వైద్యాధికారులు శుక్రవారం మండలంలోని మారుమూల గ్రామమైన రేగులగూడెం గ్రామంలో పశువులకు టీకాలు వేయడం మొదలుపెట్టారు. శుక్రవారం ఉదయం మంగపేట పశు వైద్యులు పి. పూజిత తన సిబ్బందితో కలిసి రేగులగూడెం గ్రామాన్ని సందర్శించారు. అనంతరం ఆ గ్రామంలో 366 పశువులకు టీకాలు వేయడం జరిగిందని అలాగే మిగతా పశువులు అందుబాటులో లేకపోవడంతో సోమవారం లోపు టీకాల పంపిణీ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రేగులగూడెం గ్రామస్తులు పశు వులకు వైద్యం అందడం లేదనే సమస్యను అధికారులకు తెలియజేసి టీకాలు వేసే విధంగా కృషి చేసిన జనంసాక్షి దినపత్రికకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే జనంసాక్షి దినపత్రికలో సమస్య ప్రచురితం కాగా వెంటనే స్పందించి పశువులకు టీకాలు వేసిన మంగపేట వైద్యులు పూజిత కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- మహిళా శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి, వివిధ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష



హనుమకొండ ప్రతినిధి మార్చి 20 (జనంసాక్షి) : హనుమకొండజిల్లాలో మహిళా శిశు దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ పథకాలు, కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మహిళా శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి, వివిధ కార్యక్రమాల అమలు తీరుపై ఆ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, అక్షయ పాత్ర భోజనం, పోషణ్ అభియాన్, పౌష్టిక ఆహారం,భేటీ బచావో.. భేటీ పడావో, అభివృద్ధి పనులు, తదితర అంశాలను ఇంచార్జి జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, ఆయా విభాగాల అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ లోప పోషణ ఉన్న సామ్, మామ్ చిన్నారుల పట్ల ఆరోగ్యవంతంగా, బరువు పెరిగేవిధంగా మహిళా శిశు సంక్షేమ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాల న్నారు. అంగన్వాడీ కేంద్రాల భవనాలు ఎక్కడైనా బాగాలేకపోతే స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోకి మార్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బాలలకు సంబంధించి ఫిర్యాదుల కోసం ఉన్న చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098గురించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిలుపుదల, నిర్మూలనపై ఈ నెల 26 న పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీడీపీవోలు స్వరూప, ఉమా, ఎక్స్టెన్షన్ ఆఫీసర్ సింధురాణి, ఇంచార్జి డీసీపీవో ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్ వో రవికృష్ణ, సఖీ కేంద్రం అడ్మిన్ హైమావతి, శిశు గృహ మేనేజర్ మాధవి, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, డీహెచ్ డబ్ల్యూ కో ఆర్డినేటర్ కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## గోదావరి జలాలతో చెరువులు నింపాలి

- రైతు సంఘం ఆధ్వర్యంలో కరవ్రతం ఆవిష్కరణ



పాలకుర్తి, మార్చి 20(జనంసాక్షి) : గోదావరి జలాలను రప్పించి చెరువులు, కుంటలను నింపి ఈ ప్రాంత రైతాంగాన్ని కాపాడాలని కోరుతూ శుక్రవారం మండలంలో గూడూరు గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య మాట్లాడుతూ పాలకుర్తి, ఉప్పుగల్లు, చెన్నూరు రిజర్వాయర్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి వ్యవసాయానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను తుంగలో తొక్కి రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. రైతు భరోసా విడుదల చేసి అర్హులైన రైతులందిరి ఖాతాలో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాచెర్ల సారయ్య, యాదనాల చిరంజీవి. సాంబకుమార్, పర్వతాలు, నర్సయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, ఓపెన్ డ్రింకింగ్‌పై ఉక్కుపాదం

- జిల్లా ఎస్పీ డా శబరీష్..




మహబూబాబాద్ ప్రతినిధి, మార్చి 20 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ గంజాయి వినియోగం, పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం సేవించడం (ఓపెన్ డ్రింకింగ్)పై కఠిన చర్యలు ప్రారంభించింది. జిల్లా ఎస్పీ డా. శబరిష్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో నిరంతర దాడులు కొనసాగుతున్నాయి. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఒంటరి, నిర్జన ప్రాంతాలు మరియు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్న ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతి స్టేషన్ నుండి ప్రత్యేక బృందాలు ఏర్పడి అనుమానాస్పద ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. గత 10 రోజులలో 130 నిర్జన/ఒంటరి ప్రదేశాల్లో తనిఖీలు ఓపెన్ డ్రింకింగ్‌లో పట్టుబడిన 37 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. గంజాయి అలవాటుకు గురైన వ్యక్తులను గుర్తించి వారికి పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. కౌన్సెలింగ్ ద్వారా మార్గనిర్దేశం చేసి సమాజంలో తిరిగి మంచి జీవితం గడపడానికి సహకరిస్తామని ఎస్పీ తెలిపారు. గంజాయి అలవాటు మానుకోవాలనుకునే వారు ఎలాంటి భయం లేకుండా తమ సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరిష్ మాట్లాడుతూ 'గంజాయి, ఓపెన్ డ్రింకింగ్ యువత భవిష్యత్తును నాశనం చేస్తాయి. మారాలని భావించే వారికి పోలీస్ శాఖ పూర్తిగా అండగా ఉంటుంది' అని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ పరిసరాల్లో గంజాయి వినియోగం లేదా ఓపెన్ డ్రింకింగ్ గమనిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు గంజాయి రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా చర్యలు కొనసాగిస్తుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



ఏటూరునాగారం, మార్చి 20(జనంసాక్షి) : సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కొరకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఏటూరునాగారం లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సామాజిక ఆరోగ్య కేంద్రం లోని గదులను, వార్డులను, అటెండెన్స్ రిజిస్టర్ ను, లాబ్, మెడికల్ స్టోర్ గది, లేబర్ రూమ్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అదేవిధంగా వార్డులలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను, వారికి అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలు హెచ్పీవీ వ్యాక్సిన్ వేసుకోవాలని గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఇది ఒక మంచి అవకాశం అని తెలిపారు. ఇప్పటివరకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమందికి ఇవ్వడం జరిగిందని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని, నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని, నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, సామాజిక ఆరోగ్య కేంద్రంలో రిపేర్లు గాని ఇతర పనులు ఏమైనా ఉన్నట్లయితే అంచనా వేసి ములుగు జిల్లా కార్యాలయానికి పంపించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని వివిధ దశలలో నిర్మాణం లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల ను పరిశీలించి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చూడాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఫర్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ జగదీశ్వర్, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ సురేష్, ఏటూరు నాగారం సర్పంచ్ శ్రీలత, ప్రజా ప్రతినిధులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 మార్చి 2026

# ధాన్యం సేకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 20 (జనం సాక్షి) :** యాసంగి సీజన్ (2025-26) ధాన్యం సేకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో పౌర సరఫరాల శాఖ ఆద్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ధాన్యం సేకరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గన్ని సంచుల లభ్యతపై చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 4,00,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచవేశారని, దాదాపు 2,70,000 నుంచి 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఐకేపీ 159, పీఏసీ ఎస్ 73, డీసీఎంఎస్ 1, మెప్మా ఆద్వర్యంలో 7 మొత్తం 240 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. టార్పాలిన్లు 5,839, తేమ యంత్రాలు 507, ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్స్ 700, ప్యాడీ క్లీనర్లు 606, డిజిటల్ గ్రైన్ క్యాలివర్స్ 270, హస్క్ రిమూవర్ 270, డ్రైయర్లు 2 అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు త్వరలో పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. వరి కోతలకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు, నీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర, రైతులకు సూచనలు చేసే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల పంట కోతలకు అనుగుణంగా టోకెన్లు ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం తరలించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అకాల వర్షాల వివరాలు ఈ సారి వాతావరణ శాఖ నుంచి ఎప్పటికప్పుడు ఇస్తామని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు వివరాలు ఆన్లైన్ చేసి రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దించుకొని సహకరించాలని, లారీల కాంట్రాక్టర్లు తాము అగ్రిమెంట్ ప్రకారం వాహనాలు అందుబాటులో పెట్టాలని, రైతులకు ఇబ్బంది కాకుండా చూడాలని, రవాణా శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అనంతరం రైస్ మిల్లర్లు సీఎంఆర్ గడువులోగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు.యాసంగి సీజన్ ధాన్యానికి బ్యాంక్ గ్యారంటీలు అందించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం దించుకునేందుకు హమాలీలను నియమించాలని, ఎక్కడా ఇబ్బంది లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు.ఇట్టి సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, డీఆర్డీఓ గీత, వ్యవసాయ, సహకార శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు, వ్యవసాయ, మెప్మా అధికారులు, పీఏసీఎస్ బాధ్యులు, లారీ కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నలకు అరుదైన గౌరవం..

- కలెక్టరేట్ చౌరస్తాలో 'జోట'ప్రతిమ ప్రతిష్టాపన



**సిరిసిల్ల టౌన్, మార్చి 20 (జనం సాక్షి) :** సిరిసిల్ల నేతన్నలకు అరుదైన గౌరవం దక్కింది. నేత వృత్తికి ఆధారమైన "జోట "ప్రతిమను చేనేతకు పుట్టినిల్లు రెండో సోలాపూర్ గా కలెక్టరేట్ చౌరస్తాలో ప్రతిష్టించింది. సిరిసిల్ల పద్మశాలీల కులకస్పి అయిన చేనేతకు సంబంధించి అరుదైన గౌరవాన్ని అందించింది. చేనేత వృత్తిపై ఆధారపడిన పద్మశాలీల ఆత్మగౌరవ ప్రతీకగా నిలబెట్టింది. కలెక్టరేట్ చౌరస్తాలో ఏ విగ్రహాన్ని ప్రతిష్టిస్తారో... అనే విషయాన్ని ప్రభుత్వ యంత్రాంగం గోప్యంగా ఉంచుతూ వచ్చింది.ఉగాది పండుగను పురస్కరించుకుని సిరిసిల్లకు పేరు తెచ్చే విధంగా ఉగాది కానుకగా పద్మశాలీల ఆత్మగౌరవ ప్రతీకైనా (జోట) నాడెను చౌరస్తాలో ప్రతిష్టించడంపై పద్మశాలీలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఎప్పటికీ నేత కార్మికులకు ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు చేనేత సమస్యల్ని దృష్టిలో పెట్టుకుని వారి అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 20 (జనం సాక్షి) :** పదవతరగతి పరీక్ష కేంద్రాలకు ఎవరికి మొబైల్ ఫోన్లకు అనుమతిలేదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.విద్యార్థులు,విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు ,సిబ్బంది. మొబైల్ ఫోన్లు పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని.ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని,జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ చీఫ్ సూపరింటెండెంట్లు,డిపార్ట్‌మెంటల్ ఇన్విజిలేటర్లు డిఇఒ లతో జూమ్ లింక్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూమ్ మీటింగ్ ద్వారా దిశా నిర్దేశం చేస్తూ పరీక్షా కేంద్రాలకు ఎవరూ మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని, ఎవరికి అనుమతి లేదని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ స్పష్టం చేశారు.మొబైల్ ఫోన్లు పరీక్షా కేంద్రాలకు తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేలా చూసుకోవాలని ఆయన ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు అలాగే, నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని, ఎటువంటి అక్రమాలకు అవకాశం లేకుండా పర్యవేక్షణను బలోపేతం చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిఇలు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జమా మసీదు ఆవరణలో పార్కింగ్‌కు శంకుస్థాపన చేసిన షబ్బీర్ అలీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 20 (జనం సాక్షి) :** రంజాన్ నెల సందర్భంగా, పవిత్ర ఉపవాసాల ముగింపు దశలో కామారెడ్డి పట్టణంలోని జామా మసీదులో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొని ప్రార్థనలు చేశారు.అనంతరం జామా మసీదు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పార్కింగ్ సౌకర్యం మరియు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి తన వంతు సహకారం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి వంటి రంగాల్లో మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.తాను పోరాడి సాధించిన 4 శాతం మైనారిటీ రిజర్వేషన్ గురించి ప్రస్తావిస్తూ, అది మైనార్టీ యువతకు విద్యా మరియు ఉద్యోగ అవకాశాల్లో కీలక మార్పు తీసుకువచ్చిందని పేర్కొన్నారు.మైనార్టీల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ముందుంటుందని అన్నారు.మైనార్టీ సమాజం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అందుకే ప్రభుత్వం అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు స్థానిక నాయకులు, మసీదు కమిటీ సభ్యులు, మైనార్టీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**మంథని, మార్చి 20 (జనంసాక్షి) :** నిర్ణీత గడువులోగా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలం, మంథని పట్టణ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. రామగిరి మండలంలోని కేజీబీవీ విద్యాలయం, నూతనంగా నిర్మించడానికి సిద్ధంగా ఉన్న తహసిల్దార్ భవన స్థలం కలెక్టర్ పరిశీలించారు. మంథని పట్టణంలోని సంగీత పాఠశాల, మున్సిపల్ కార్యాలయ, జూనియర్ బాయ్స్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంథని పట్టణం లోని షెడ్యూలు కులాల బాలికల వసతి గృహం, ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి కేజీబీవీ లో నూతనంగా ఏర్పాటు చేసిన మాడ్యులర్ కిచెన్ ను ప్రారంభించారు. స్టీమ్ రైస్ బాయిలర్, ఆటోమేటిక్ రోటి మేకర్, ఇడ్లీ బాయిలర్, ఎల్.పీ.జి గ్యాస్ లైన్, 18 డైనింగ్ టేబుల్స్ లను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందని



తెలిపారు. కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. రామగిరి తహసిల్దార్ కార్యాలయం నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. మంథని సంగీత స్కూల్ ప్రిన్సిపాల్ సూచనల మేరకు అభివృద్ధి పనులను 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పట్టణంలో నూతనంగా చేపడుతున్న పురపాలక కార్యాలయ నిర్మాణ పనులు నిర్దిష్ట గడువు లోగా పూర్తయ్యే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని లోని జూనియర్ బాయ్స్ స్కూల్ లో పెండింగ్ ఉన్న చిన్న చిన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురుకుల పాఠశాలలో స్టేజి, డార్మటరీ, డైనింగ్ హాల్ వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసామని, పాత స్కూలు భవనం, హాస్టల్ కు అవసరమైన మరమ్మతులు చేయించి పెయింటింగ్ వేయాలని కలెక్టర్ సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రినోవేషన్ భాగంగా పెయింటింగ్, అంతర్గత సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి పనులు స్లాబ్ దశలో ఉన్నాయని వీటిని గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంటరామగిరి తహసిల్దార్ సుమన్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్,టిజిఎంఎస్ఐడిసి ఈఈ విక్రమ్, ఈఈ పంచాయతీ రాజ్ శంకరయ్య, ఏఈ లు అనుదీప్,వరలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచల గోదావరిలో విషాదం

- ఐదుగురు యువకులు నీటిలో మునిగి మృతి
- మూడు మృతదేహాలు లభ్యం

**భద్రాచలం, మార్చి 20 (జనంసాక్షి) :** భద్రాచల రామయ్య దర్శనానికి వచ్చిన భక్తుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. భద్రాచలం సరిహద్దు ప్రాంతమైన (పోలవరం జిల్లా), ఎటపాక మండల పరిధిలోని గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన ఏడుగురు యువకుల్లో ఐదుగురు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. దైవదర్శనం కోసం వచ్చిన ఏడుగురు యువకులు స్నానాలు ఆచరించేందుకు గోదావరి నది తీరానికి వెళ్లారు. నది లోతును అంచనా వేయలేక పోవడంతో ప్రమాదవశాత్తు ఐదుగురు యువకులు నీటి ప్రవాహంలో చిక్కుకుపోయారు. మిగిలిన ఇద్దరు యువకులు సురక్షితంగా బయటపడటంతో వెంటనే స్థానికులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఆంధ్ర మరియు తెలంగాణ పోలీసులు రెస్క్యూ టీం ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు



ముగ్గురు యువకుల మృతదేహాలను రెస్క్యూ టీం వెలికితీసింది. శ్రీకర్ నవదీప్ అభిరామ్ గా గుర్తించారు. గాలింపు చర్యల్లో గుర్తించిన వారిలో ఇద్దరు యువకులు భద్రాచలానికి చెందిన వారుగా ప్రాథమికంగా గుర్తించారు. గల్లంతైన మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నది తీరం వెంబడి బోటుతో గాలింపు చర్యలు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. నీటి మట్టం ఎక్కువగా ఉన్న చోట అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## ఆలూరులో భారీ చోరీ

- 10 తులాల బంగారం, రెండులక్షల నగదు అపహరణ



**నిజామాబాద్ బ్యూరో, మార్చి 20 (జనంసాక్షి) :** జిల్లాలోని ఆలూరు మండల కేంద్రంలో భారీ దొంగతనం తీవ్ర కలకలం రేపింది. తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు చొరబడి, సుమారు 10 తులాల బంగారంతో పాటు రూ: 2 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన తలారి జమున అనే వృద్ధురాలు ఈ నెల 15వ తేదీ సాయంత్రం తన ఇంటికి తాళం వేసి జుక్కల్ మండలంలో నివసిస్తున్న తన చిన్న కుమారుడి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో వారం రోజులుగా ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు, అర్ధరాత్రి సమయంలో ఇంటి తలుపును పగులగొట్టి ఇంటి లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. పొరుగువారు ఇచ్చిన సమాచారంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన స్థానికులు, ఎదో అనర్థం జరిగిందని అనుమానించి వెంటనే జమున కుటుంభ సభ్యులకు సమాచారం అందించారు. భాదితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థులతో కలసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 20 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం జుక్కల్ మండలంలో పర్యటించి



ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం కింద జుక్కల్ మండలంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల పనుల పురోగతిని సబ్ కలెక్టర్ కిరణ్మయి తో కలిసి పరిశీలించారు. నిర్మాణ నాణ్యత, పనుల వేగం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.తదనంతరం ఆక్సిజన్ పార్క్‌ను సందర్శించి అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు.

# బాలల సదనంలో సంరక్షణ, ఆరోగ్య సేవలు సమగ్రంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, మార్చి 20 (జనంసాక్షి) :** ప్రభుత్వ సంరక్షణలో ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగడం ప్రభుత్వ లక్ష్యమని, మంచి ఆరోగ్యం ఉన్నప్పుడే పిల్లలు చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఎన్.ఎస్.పి. రోడ్‌లోని బాలల సదనాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలలో తిరుగుతూ పరిశుభ్రత, మౌళిక వసతులు, పడక గదులు, బాత్‌రూములు, త్రాగునీటి సదుపాయం, వంటగది నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. వంటగదిలో తయారవుతున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా చూసి, పిల్లలకు అందిస్తున్న అల్పాహారం, భోజనం కామన్ మెనూ ప్రకారం సరైన ప్రమాణాలతో అందుతున్నాయా అని తెలుసుకున్నారు. అన్నం, కూరలు, పప్పు, సాంబారు, గుడ్లు, చికెన్ వంటి పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. పిల్లలతో నేరుగా ముచ్చటించిన కలెక్టర్, భోజనం రుచిగా ఉందా, సమయానికి అందిస్తున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల అభిప్రాయాలను వినడం ద్వారా సేవల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శిశు సంరక్షణ కేంద్రంలో



ఉన్న చంటి పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్, చంటి పిల్లలపై నిరంతర వైద్య పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి చిన్నారి ఆరోగ్యం, పోషణ, భద్రతపై సిబ్బంది పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. దత్తత ప్రక్రియలో పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారి వివరాలను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి, చట్ట పరమైన విధానాలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ బాలల సదనాల్లో ఉన్న పిల్లలు మన కుటుంబ సభ్యుల్లాంటి వారని, వారికి అందించే ఆహారం పోషక విలువలతో కూడినదిగా, రుచికరంగా ఉండాలని అన్నారు. పరిశుభ్రత, ఆరోగ్య సేవలు, భద్రత అంశాల్లో ఎల్లప్పుడూ అత్యున్నత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాలల సదనాల్లో ఉన్న ప్రతి చిన్నారి భవిష్యత్తు అమూల్యమైన సంపద అని వారి ఆరోగ్యం, పోషణ, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం సిబ్బంది ముఖ్య బాధ్యతగా వ్యవరించాలని తెలిపారు. పిల్లలకు అందించే ఆహారం పోషక విలువలు సమృద్ధిగా ఉండేలా ప్రణాళికా బద్ధంగా ఉండాలని, సమయానికి వైద్య పరీక్షలు అందేలాగా చర్యలు చేపట్టాలని అన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌళిక సదుపాయాలు, పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ, అవసరమైన సేవలు తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు. దత్తత ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమని, అర్హత కలిగిన కుటుంబాలకు మాత్రమే చట్టపరమైన విధానాల ప్రకారం పిల్లలను దత్తత ఇవ్వాలని, ప్రతి దశలో బాలల హితం ప్రాధాన్యంగా ఉండే విధంగ బాలల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, జిల్లా శిశు సంరక్షణ అధికారిణి విష్ణు వందన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రంగాలకు మొండిచేయి

- బడ్జెట్ పై సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ఖమ్మం టౌన్, మార్చి 20 (జనంసాక్షి) :** రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రధాన రంగాలకు మొండి చేయి చూపారని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అంతగా దృష్టి సారించలేదని ఆయన తెలిపారు. విద్య, వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రతి యేటా కనీస పెరుగుదల -నమోదు కావాలని పెరిగిన ఖర్చుల నేపథ్యంలో ఇలా జరగాల్సి ఉన్నా అది జరగ లేదని ఆయన అన్నారు. వ్యవసాయ రంగానికి -సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు జరిగే పరిస్థితి కనిపించడం లేదని సురేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లుగా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఈ బడ్జెట్ తర్వాత ఖచ్చితంగా పింఛన్లు పెరుగుతాయని ప్రజలు ఆశించారని కానీ కేటాయింపులు చూస్తే పింఛన్ పెంపుదల లేదన్నారు. ఆర్టీసి, కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల తదితర విషయాల్లో ఈ బడ్జెట్లో సరైన రీతిలో కేటాయింపులు లేవన్నారు. అంకెలు గొప్పగా చెప్పినా, పది శాతం పెరిగిందని చెప్పినా నమ్మశక్యంగా లేదన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం నాలుగు లక్షలు పైబడి చూపించారని కానీ అది వాస్తవానికి విరుద్దంగా ఉందని సురేష్ తెలిపారు.




## జెఫ్ బెజోస్ కొత్త ప్రాజెక్ట్..
### వేర్‌హౌస్‌లు, ఫ్యాక్టరీల్లోనూ ఏఐ




**న్యూఢిల్లీ:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగ ప్రవేశం, ఖర్చుల తగ్గింపులో భాగంగా ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ కొన్నేళ్లుగా కృత్రిమ మేధ ఆటోమేషన్ వంటి వాటిపై దృష్టిపెడుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ సంస్థ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఉన్న కొన్ని సంస్థలను కొలుగోలు చేసి, వాటి వేర్‌హౌస్‌లు, ఫ్యాక్టరీల్లో ఉద్యోగులకు బదులు.. పూర్తిగా ఏఐని వినియోగించడానికి ప్లాన్ చేస్తున్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. ఇందుకోసం ఆయన 100 బిలియన్ డాలర్లు (రూ.9లక్షల కోట్లు) సమీకరించేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది. డిఫెన్స్ వస్తువుల తయారీ, ఏరోస్పేస్, చిప్‌మేకింగ్ కంపెనీలను కొనుగోలు చేసి, వాటిలో ఏఐ సాంకేతికతను విస్తరించడమే జెఫ్ బెజోస్ ప్రాజెక్ట్ లక్ష్యం. ఏఐని ఉపయోగించడం వల్ల సదరు కంపెనీల పనితీరును మెరుగుపరచడమే కాకుండా, గిడ్డంగులు, ఉత్పత్తి శ్రేణులలో కార్మికుల అవసరాన్ని తగ్గించేందుకు ఆయన ఈ చర్యలు తీసుకుంటున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే తక్కువ ఖర్చు, సిబ్బందితో పనులను నిర్వహించగల ఏఐ వ్యవస్థలను ఆయా కంపెనీల అన్ని గోదాములు, ఫ్యాక్టరీల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ సాంకేతికత వల్ల వస్తువుల రూపకల్పన, ఉత్పత్తిలో మానవ వనరుల ఖర్చును భారీగా తగ్గించుకునే వెసులుబాటు ఉంటుంది. గతంలో ఇంజినీర్లు, ఫ్యాక్టరీ సిబ్బంది చేసే పనులను ఇప్పుడు సాఫ్ట్‌వేర్ యంత్రాలు మరింత వేగంగా పూర్తి చేస్తాయి. ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడానికి బెజోస్ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రధాన పెట్టుబడిదారులను సంప్రదించినట్లు తెలుస్తోంది. అమెజాన్ తమ వేర్‌హౌస్‌లలో భారీగా రోబోలను వినియోగిస్తున్న విషయం తెలిసిందే. ఏఐ వల్ల కోడింగ్, మెయిల్స్ రాసే ఉద్యోగులు, పరిశోధనలో సహకరించే స్కాలర్లు ఉద్యోగాలు కోల్పోతున్నారనే భయం ఉండేది. ప్రస్తుతం ఆ ప్రభావం వేర్‌హౌస్‌లు, ఫ్యాక్టరీలపైనా పడనుంది.

### రూ.1290కే నాట్కో ఫార్మా నుంచి సెమాగ్లుటైడ్

హైదరాబాద్: టైప్-2 మధుమేహం నియంత్రణ కోసం జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను నాట్కో ఫార్మా ఆవిష్కరించింది. పేటెంట్ ముగిసిన రోజే దీన్ని తీసుకొచ్చింది. ధర నెలకు రూ.1290 నుంచి ప్రారంభమవుతుంది. ఇప్పటికే దీని తయారీకి సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి ఫిబ్రవరిలో అనుమతి పొందింది. ఇతర బ్రాండ్లతో పోలిస్తే దాదాపు 70 శాతం తక్కువ ధరకే దీన్ని తీసుకొచ్చినట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి, చక్కెర స్థాయులను నియంత్రించే జీఎల్‌పీ-1 రిసెప్టార్ అగోనిస్ట్ అయిన సెమాగ్లుటైడ్.. టైప్-2 మధుమేహంతో పాటు, బరువు తగ్గించడంలోనూ వైద్యపరంగా మెరుగైన ఫలితాలను ఇస్తోంది.

# మార్కెట్‌పై చమురు బాంబు




**ముంబై:**రోజుకో కొత్త రికార్డుతో దూసుకెళ్లిన మార్కెట్లు, అంతర్జాతీయ పరిణామాలతో చతికిలపడ్డాయి. ఒక పక్క ఇరాన్ యుద్ధం, మరోపక్క ముడిచమురు ధరలు ఏం చేయాలో పాలుపోని ట్రేడర్లు సతమతమయ్యారు. చూస్తుండగానే లాభాలు పంచిన మార్కెట్ కాస్తా.. నష్టాల్లో ముంచేయడంతో కన్నీరే మిగిలింది. ఉగాది రోజున షడ్రుచుల్లో మదుపర్లకు చేదు మాత్రమే మిగిలింది. ముడిచమురు ధరలు పరుగులు తీయడంతో హెచ్‌పీసీఎల్ 7.01%, బీపీసీఎల్ 5.83%, ఐఓసీ 3.91% చొప్పున నష్టపోయాయి. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా మాత్రం రాణించాయి. మూడు రోజుల పాటు లాభాలతో ఉపశమనాన్ని ఇచ్చిన మార్కెట్లో ఒక్కసారిగా చమురు మంట ఎగసిపడింది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ముడిచమురు ధరలు దూసుకెళ్లడం, బలహీన అంతర్జాతీయ సంకేతాలతో అమ్మకాలు ఏరులై పారాయి. సెన్సెక్స్, నిఫ్టీ 3 శాతానికి పైగా నష్టపోయి, ఏడాది కనిష్ఠానికి పడిపోయాయి. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ గురువారం ఒక్కరోజే రూ.12.87 లక్షల కోట్లు తగ్గి రూ.426.13 లక్షల కోట్ల (4.61 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన తర్వాత మదుపర్లు రూ.37 లక్షల కోట్లకు పైగా కోల్పోయారు. రోజంతా అమ్మకాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 954 పాయింట్ల (క్రితం ముగింపు 76,704.13 పాయింట్లు) నష్టంతో 74,750.92 వద్ద ప్రారంభమైంది. అమ్మకాలు స్థిరంగా కొనసాగడంతో రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ, ఒకదశలో 2,753.18 పాయింట్లు పతనమై 73,950.95 పాయింట్లకు పడిపోయింది. చివరకు 2,496.89 పాయింట్ల నష్టంతో 74,207.24 వద్ద ముగిసింది. 2024 జూన్ తర్వాత సూచీకిదే ఒకరోజు అతిపెద్ద నష్టం. 2025 ఏప్రిల్ 7 తర్వాత సెన్సెక్స్‌కు ఇదే అత్యల్ప ముగింపు. నిఫ్టీ 775.65 పాయింట్లు కోల్పోయి 23,002.15 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 22,930.35 వద్ద కనిష్ఠాన్ని నమోదుచేసింది. అన్ని షేర్లూ నష్టాల్లోనే: సెన్సెక్స్ సూచీలో 30 షేర్లూ కుదేలయ్యాయి. ఎటర్నల్ 5.65%, బజాజ్ ఫైనాన్స్ 5.42%, ఎం అండ్ ఎం 5.25%, ఎల్ అండ్ టీ 4.72%, ఇండిగో 4.66%, బజాజ్ ఫిన్‌సర్వ్ 4.47%, ట్రెంట్ 4.32%, అల్ట్రాటెక్ 3.87%, యాక్సిస్ బ్యాంక్ 3.69%, ఇన్ఫోసిస్ 3.69%, మారుతీ 3.55%, టీసీఎస్ 3.47% చొప్పున క్షీణించాయి. రంగాల వారీ సూచీల్లో.. వాహన 4.07%, స్థిరాస్తి 3.79%, ఆర్థిక సేవలు 3.66%, వినియోగ 3.62%, పరిశ్రమలు 3.49%, సేవలు 3.44%, ఫోకస్ట్ ఐటీ 3.41%, మన్నికైన వినిమయ వస్తువులు 3.38% చొప్పున పడ్డాయి. బీఎస్‌ఈలో 3359 షేర్లు నష్టపోగా, 913 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 142 షేర్లలో ఎటువంటి మార్పులేదు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు: ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చడం మార్కెట్లను వణికించింది. ఇరాన్‌లోని అతిపెద్ద ఎల్‌ఎన్‌జీ రిఫైనరీపై ఇజ్రాయెల్ దాడి చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇందుకు ప్రతీకారంగా ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ ఇండస్ట్రియల్ సిటీపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ముడిచమురు ధరల పెరుగుదల: హర్మూజ్ జలసంధి మార్గంలో అంతరాయాల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరా నిలిచిపోతుందనే భయాలు పెరిగాయి. బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్ ఒక దశలో 118 డాలర్లకు చేరింది. ఇంధన అవసరాల కోసం 85% దిగుమతులపైనే ఆధారపడిన భారత్‌కు ఇది ప్రతికూలం కానుంది. రవాణా ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. 2026-27లో భారత జీడీపీ వృద్ధి, కంపెనీల లాభాలను దెబ్బతీయొచ్చు. అమెరికా ఫెడ్ వైఖరి: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను (3.50-3.75%) యథాతథంగా ఉంచింది. అయితే 2026లో ఒక్కసారి మాత్రమే వడ్డీ రేట్ల కోతలు ఉంటాయని ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలివ్వడం మదుపర్లను నిరాశపరిచింది.

## ఎగుమతిదార్లకు రూ.497 కోట్లతో 'రిలీఫ్' పథకం
### పరిస్థితి సమీక్షకు అంతర్ మంత్రిత్వ బృందం ఏర్పాటు

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావాన్ని ఎదుర్కొంటున్న భారత ఎగుమతి దార్లకు ఊరటనిచ్చేందుకు రూ.497 కోట్ల కేటాయింపుతో 'రిలీఫ్' పథకాన్ని (రిజైలెన్స్ అండ్ లాజిస్టిక్స్ ఇంటర్‌వెన్షన్ ఫర్ ఎక్స్‌పోర్ట్ ఫెసిలిటేషన్) ప్రభుత్వం ప్రారంభించింది. 'ఎగుమతుల ప్రోత్సాహక కార్యక్రమం కింద మేం కొత్త పథకాన్ని తీసుకొచ్చాం. ముఖ్యంగా పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల అక్కడి 17- 18 భౌగోళిక ప్రాంతాలపై ఆధారపడిన భారత ఎగుమతిదార్లకు ఎదురవుతున్న అవరోధాలను కొంతైనా తగ్గించడంపై దృష్టి సారించామ'ని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. అలాగే వాణిజ్య, పెట్రోలియం- సహజవాయువు, ఓడలు- షిప్పింగ్, ఆర్థిక సేవలు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు, ఆర్‌బీఐ, సీబీఐసీ సహా పలు ప్రభుత్వ విభాగాలతో ఒక అంతర్‌మంత్రిత్వ బృందాన్ని (ఐజీఎం) కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ ఐజీఎం రోజూ సమావేశమై సరకు ఓడల కదలికల ఆధారంగా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తుందని తెలిపారు. మూడు భాగాలుగా: ఈ 'రిలీఫ్' పథకం కింద ప్యాకేజీని అమలు చేసే బాధ్యతను ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీజీసీ) నిర్వహిస్తుంది. ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీజీసీ) నిర్వహిస్తుంది ఈ పథకం ప్రధానంగా మూడు భాగాలుగా ఉంటుంది. తొలి భాగంలో ఎక్స్‌పోర్ట్ ఆబ్లిగేషన్ గడువును ఎటువంటి జరిమానా లేకుండా ఆగస్టు 31, 2026 వరకు ఆటోమేటిక్‌గా పొడిగిస్తారు. రెండో భాగంలో మార్చి 16 నుంచి జూన్ 15 మధ్య కాలంలో చేసే ఎగుమతులకు ఈసీజీసీ కవరేజీ సదుపాయాన్ని వర్తింపజేస్తారు. మూడో భాగంలో సర్‌ఛార్జి కుదుపు నుంచి ఎంఎస్‌ఎంఈలను కాపాడేలా చర్యలు ఉంటాయి.

## ప్లాట్‌ఫామ్ ఫీజు పెంచిన జొమాటో

ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచింది. కంపెనీ యాప్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. వినియోగదారులు ఒక్కో ఆర్డర్‌కు ఇక నుంచి రూ.2.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఇప్పటికే వసూలు చేస్తోన్న ఫీజు రూ.12.50 నుంచి రూ.14.90కి పెరిగింది. జొమాటో, దాని పోటీ సంస్థ స్విగ్గీ ఒకే తరహా ధరల ట్రెండ్‌ను అనుసరిస్తుంటాయి. అన్ని పన్నులు కలుపుకొని ప్రస్తుతం స్విగ్గీ వసూలు చేస్తోన్న ప్లాట్‌ఫామ్ ఫీజు రూ.14.99గా ఉంది. కాగా.. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చమురు ధరలు భగ్గుమంటున్నాయి. పెరుగుతోన్న ఇంధన ధరలు డెలివరీ కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఫీజు పెంపునకు అది ఓ కారణంగా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే.. వేగంగా విస్తరిస్తోన్న ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ అదే స్థాయిలో ఉంది. ప్రముఖ క్యాబ్ బుకింగ్ సేవల సంస్థ ర్యాపిడో.. ఓన్లీ పేరిట బెంగళూరులో ఇటీవల ఫుడ్ డెలివరీ సేవలను లాంచ్ చేసింది. డెలివరీ ఫీజు తప్ప మిగతా రెస్టారెంట్లు, వినియోగదారుల నుంచి ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయబోమని చెప్తోంది. ఈ ప్రకటన ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న సంస్థలపై ఒత్తిడి పెంచేదే.




### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,44,600 | ₹ 1,57,750 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,75,000

# దీర్ఘకాలిక యుద్ధం ఉచ్చులో అమెరికా!

- ట్రంప్ సైనిక విజయం సాధించినా... రాజకీయ, వ్యూహాత్మక గెలుపులు కష్టమే
- ఇరాన్‌పై దాడులు, పరిణామాలపై నిపుణుల విశ్లేషణ



**వాషింగ్టన్:**అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు, దానికి ఇరాన్ ప్రతిదాడులు ప్రస్తుత యుద్ధాన్ని రోజురోజుకీ మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. ఇరు పక్షాలతో పాటు ప్రపంచ దేశాలూ దీనికి భారీ మూల్యాన్నే చెల్లిస్తున్నాయి. తొలిరోజు దాడిలో ఇరాన్ సుప్రీంలీడర్ అలీ ఖమేనీ, ఆ దేశ ముఖ్య సైనికాధికారులు చనిపోవడంతో భారీ విజయం సాధించామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. సైనికపరమైన ఈ విజయం...రాజకీయ, వ్యూహాత్మక గెలుపునకు దారితీయకపోగా దీర్ఘకాల యుద్ధంలో ఆ దేశాలు కూరుకుపోయేలా చేస్తోందని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ట్రంప్ తక్షణ లక్ష్యం ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు. తొలిరోజు విజయంతో ఈ లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో సమయం పట్టదని అంచనా వేశారు. కానీ, యుద్ధం ప్రారంభమై రెండు వారాలైనా ట్రంప్, నెతన్యాహు ఆశించినట్లు టెహ్రాన్‌లో మత గురువుల పాలన ఇప్పటికిప్పుడు ముగిసిపోయే సూచనలు కనిపించటంలేదు. పైగా ఇరాన్ పన్నిన దీర్ఘకాలిక యుద్ధం ఉచ్చులో చిక్కుకున్నట్లు అనిపిస్తోంది. యుద్ధ పరిధిని భౌగోళికంగా విస్తరింపజేయాలన్నదీ టెహ్రాన్ వ్యూహం. గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలున్న దేశాలపై దాడులు దీనిలో భాగమే. అమెరికా యుద్ధం ఖర్చులను భారీగా పెంచడం, చమురు సరఫరాలను అడ్డుకోవడమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచడం ఇరాన్ నేతల ఉద్దేశం. తన లక్ష్యం నెరవేరకపోవడంతో ట్రంప్...ఇరాన్‌పై దాడులను మరింత పెంచే అవకాశం ఉంది. అయితే, అవి రాజకీయ, వ్యూహాత్మక, జాతీయ భద్రత విజయాలను అందిస్తాయా లేదా అన్నదే ప్రధాన ప్రశ్న. 'యుద్ధ విస్తరణ ఉచ్చు పలు దశల్లో ఉంటుంద'ని అమెరికా చరిత్రకారుడు రాబర్ట్ పపే తెలిపారు. గగనతల ఆధిపత్యంతో సాధించే విజయాలు స్వల్పంగానే ఉంటాయని గతంలో పలువురు అమెరికా అధ్యక్షులకు ఆయన సూచించారు. 'అమెరికా సైన్యం తొలి రోజు వందశాతం విజయం సాధించింది. వ్యూహాత్మక గెలుపునకు అది దోహదపడకపోవడంతో రెండో దశ ఉచ్చులోకి ప్రవేశించింది' అని రాబర్ట్ పపే పేర్కొన్నారు. 'దాడుల తీవ్రతను ఇంకా పెంచే సామర్థ్యం అమెరికాకు ఉంది. అయినా వ్యూహాత్మక విజయాన్ని సాధించలేదు. అప్పుడు మూడో దశ ఉచ్చుకు చేరువవుతుంది. అదే అసలైన సంక్షోభం. చాలా ప్రమాదకరమైన ఐచ్ఛికాల గురించి ఆలోచించాల్సి వస్తుంది. ప్రస్తుతం అమెరికా మూడోదశ ఉచ్చు అంచుల్లో ఉంది' అని రాబర్ట్ పపే అభిప్రాయపడ్డారు.

**గల్ఫ్ దేశాల్లో వ్యతిరేకత**

యుద్ధం మొదటి రోజు తగిలిన గట్టి దెబ్బతో ఇరాన్ నాయకత్వం తనదైన సొంత పంథాలో ప్రపంచ దేశాలను సంక్షోభంలోకి లాగే యత్నం చేసింది. ట్రంప్‌పై ఒత్తిడి పెంచే వ్యూహాన్ని అనుసరించడం ప్రారంభించింది. అమెరికా, గల్ఫ్ దేశాల మధ్య దూరాన్ని పెంచడం, ఆయా దేశాల్లోని ప్రజలు అక్కడి ప్రభుత్వాలను నిలదీసేలా చేయడం కూడా ఇరాన్ లక్ష్యమే. ఇజ్రాయెల్ విస్తరణవాద ఆకాంక్షలకు మనమెందుకు మూల్యం చెల్లించాలని గల్ఫ్ దేశాల ప్రజలు తమ ప్రభుత్వాధినేతలను ప్రశ్నించే పరిస్థితిని తీసుకురావడం కూడా టెహ్రాన్ వ్యూహకర్తల ఉద్దేశమని రాబర్ట్ పపే వివరించారు. ప్రస్తుతం యుద్ధం కొనసాగుతున్న తీరు నెల రోజుల క్రితం ఊహించిన దానికన్నా భిన్నంగా ఉందని అమెరికా మాజీ రాయబారి రాబర్ట్ ముల్లే తెలిపారు. ఇరాన్‌లో భూతల దాడులకు సైన్యాన్ని రంగంలోకి దించి, కీలకమైన మౌలిక వసతులను, కొంత భూభాగాన్ని స్వాధీనం చేసుకుని, కుర్దులు, లేదా ఇతర స్థానిక గ్రూపులతో అమెరికా సంప్రదింపులు జరపటం ఒక మార్గం. అయితే, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడంలేదని పేర్కొన్నారు.

**విజయం వడ్డించిన విస్తరి కాదు**

'ఇరాన్‌పై దాడులను తీవ్రతరం చేయడం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఉన్న సులభమైన మార్గం. అయితే, ఇరానీయులు అంత తేలిగ్గా లొంగిపోరు. విజయాన్ని వడ్డించిన విస్తరిలా అందించబోరు' అని మాజీ రాయబారి రాబర్ట్ ముల్లే అభిప్రాయపడ్డారు. వియత్నాం తరహాలో ఇరాన్ యుద్ధం కూడా ఏళ్ల తరబడి కొనసాగితే పరిస్థితి ఏమిటని పలువురు అమెరికన్లు ప్రశ్నిస్తున్నారు.

## మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారం సుప్రీం కోర్టుకు

తీసుకొచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ, గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని కోర్టుకు వివరించారు. గడువు పెంచాలని ఫిబ్రవరి 28కి ముందే.. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేయగా.. ఎలాంటి సమాధానం రాలేదని కోర్టుకు న్యాయవాదులు వివరించారు. ఇదే పరిస్థితి తలెత్తితే.. కర్ణాటక, మహారాష్ట్రల్లో గడువు పెంచారని చెబుతూ.. సంబంధిత ఉత్తర్వులను కోర్టు ముందుంచారు. వైద్య విద్య కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఎన్‌ఎంసీకి ఆదేశిస్తూ.. తదుపరి విచారణను సర్వోన్నత న్యాయస్థానం మార్చి 23(సోమవారం)కి వాయిదా వేసింది.

## మూడు దశల్లో భద్రాచలం ఆలయ అభివృద్ధి

ఉందని వెల్లడించారు. భద్రాచలం ఆలయ రూపురేఖలను మార్చేలా రూపొందించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం నాడు సచివాలయంలోని మంత్రి కొండా సురేఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రెండు వందల సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా మూడు దశల్లో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపైముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపునివ్వాలని సమావేశంలో నిర్ణయించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేనాటికి భద్రాచలంలో పుష్కర ఘాట్‌తో పాటు మొదటి దశ ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలాన్ని తెలంగాణలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక హబ్‌గా మారుస్తామన్నారు. భద్రాచలం సమీపంలోని రామవరంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గోదావరి పుష్కరాలలో భాగంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన కొరివి వీరభద్రస్వామి దేవాలయం, మల్లూరు లోని నరసింహాస్వామి దేవాలయాలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు.

## హైదరాబాద్‌లోని ఉద్యోగులకు గుడ్‌న్యూస్
### హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు పరిమితి పెంపు

**హైదరాబాద్:**హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న వారికి కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇంటి అద్దెభత్యం మినహాయింపు పరిమితిని 50 శాతానికి పెంచింది. ఈ మేరకు ఆదాయపు పన్ను నిబంధనలు, 2026ను కేంద్రం శుక్రవారం నోటిఫై చేసింది. ఆరు దశాబ్దాల పాత ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో.. కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏప్రిల్ 1 నుంచి రాబోయే కొత్త నిబంధనలను నోటిఫై చేస్తూ గెజిట్ జారీ చేసింది. గతంలో ముంబయి, కోల్‌కతా, దిల్లీ, చెన్నైలను మాత్రమే మెట్రో నగరాలుగా పరిగణించేవారు. ఆయా నగరాల్లో హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు పరిమితి 50 శాతంగా ఉండేది. తాజాగా ఈ జాబితాలోకి హైదరాబాద్, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్‌ను కూడా చేర్చారు. అంటే 8 నగరాల్లో నివసిస్తున్న ఉద్యోగులు తమ జీతంలో 50 శాతం వరకు హెచ్‌ఆర్‌ఏ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. మిగిలిన వారికి యథాతథంగా 40 శాతం కొనసాగుతుంది. కొత్త ఆర్థిక సంవత్సరంలో అంటే 2027 జులైలో ఫైల్ చేయబోయే రిటర్నుల సమయంలో ఇది వర్తిస్తుంది. పాత పన్ను విధానంలో పన్నును తగ్గించుకోవడానికి ఈ మార్పు ఉపయోగపడుతుంది. కొత్త పన్ను విధానం ఎంచుకున్న వారు ఈ మినహాయింపు పొందలేరు. అలాగే, హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు పొందాలంటే ఇకపై పన్ను చెల్లింపుదారులు తాము నివసిస్తున్న ఇంటి యజమానితో (ల్యాండ్‌లార్డ్) తమకు ఉన్న సంబంధాన్ని తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది. ఫారం 124లో ఆ వివరాలు నమోదు చేయాలి. పార్లమెంట్ ఆగస్టు 12న కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. సంక్లిష్టంగా ఉన్న ఆదాయపు చట్టాన్ని సులభతరం చేయడం దీని ఉద్దేశం. పాత ఆదాయపు పన్ను చట్టంలో 819 సెక్షన్లు ఉండగా.. కొత్త దాంట్లో 536కు కుదించారు. అలాగే చాప్టర్లను సైతం 47 నుంచి 23కు తగ్గించారు. పాత ఆదాయపు పన్ను చట్టంలో 5.12 లక్షల పదాలు ఉండగా దాన్ని.. దాదాపు సగానికి అంటే 2.6 లక్షలకే పరిమితం చేశారు. అదనంగా 39 కొత్త టేబుళ్లు 40 ఫార్ములాలను జోడించారు.

## బ్యాంకులూ.. రుణాల విషయంలో జాగ్రత్త
### తుది వినియోగం నిర్ధారించకపోతే ఆర్థిక అవకతవకలకు దారి తీస్తుంది: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:**బ్యాంకులు ప్రజా ధనంతో వ్యాపారం చేస్తుంటాయని, రుణాలు మంజూరు చేసే సమయంలో అధికార పరిధికి మించి జారీ చేయరాదని, వాటి తుది వినియోగం నిర్ధారించుకోకపోతే ఆర్థిక అవకతవకలకు దారి తీస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. మంజూరు చేసిన లేదా పంపిణీ చేసిన రుణాలను తీసుకున్న అవసరం కోసం కాకుండా ఇతర వాటి కోసం వినియోగిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపింది. బ్యాంకు ఉద్యోగులు.. డిపాజిటర్లు లేదా ఖాతాదార్ల డబ్బును నిర్వహిస్తుంటారని, తమ ఉద్యోగ విధులను జాగ్రత్తగా వ్యవహరించాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం సూచించింది. ప్రతి సంస్థా తన ఉద్యోగి నుంచి మంచి ప్రవర్తన, క్రమశిక్షణ ఆశిస్తాయని, ఖాతాదార్లు/డిపాజిటర్ల డబ్బుతో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు ఉద్యోగుల నుంచి మరింత ఆశిస్తాయని పేర్కొంది. కేసు పూర్వాపరాలు ఇవీ..: రుణాల పంపిణీలో అవకతవకలకు పాల్పడ్డాడనే ఆరోపణలతో 2011 సెప్టెంబరు 30న ఒక బ్యాంక్ ఉద్యోగిపై ఛార్జ్‌షీటు దాఖలైంది. దీనిపై పంజాబ్-హరియాణా హైకోర్టు 2023 ఫిబ్రవరిలో తీర్పు వెలువరించగా దాన్ని సవాలు చేస్తూ సదరు ఉద్యోగి సుప్రీంకోర్టుకు వెళ్లారు. దీన్ని విచారించిన ధర్మాసనం సదరు ఉద్యోగి రుణాల తుది వినియోగం నిర్ధారించడంలో పాక్షికంగా విఫలమయ్యారని గుర్తించింది. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ అతని పింఛను చెల్లింపును శాశ్వతంగా మూడు దశల్లో తగ్గించాలని తీర్పు వెలువరించింది. సదరు ఉద్యోగి 2011 సెప్టెంబరు 30న పదవీ విరమణ పొందారు.

## మహిళలు, నిరుద్యోగులకు ఆర్థిక సాయం..
### 7 కొత్త జిల్లాల ఏర్పాటు - 'తృణమూల్' మ్యానిఫెస్టో విడుదల..

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల విమర్శలు, ప్రతి విమర్శలతో అక్కడి రాజకీయాలు మరింత హీటు పుట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ శుక్రవారం ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేశారు. బెంగాల్ ఓటర్లను ఆకర్షించి మరోసారి అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా సీఎం మమతా బెనర్జీ 10 కీలక హామీలు ప్రకటిం చారు. మరోసారి తమ పార్టీని గెలిపిస్తే రాబోయే ఐదేళ్లలో ప్రతి ఇంట్లో ఆనందం నింపాలనే ఆశయంతో పనిచేస్తామన్నారు. 'ఈసారి తిరిగి అధికారంలోకి వస్తే.. ప్రతి నెలా మహిళలకు ఇస్తున్న ఆర్థిక సాయం రూ.500 పెంచుతాం. అంటే జనరల్ కేటగిరీ మహిళలకు రూ.1500, ఎస్సీ/ఎస్టీ మహిళలకు రూ.1700 చొప్పున అందజేస్తాం. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.1500 సాయం అందిస్తాం. ఇంటి వద్దే నాణ్యమైన వైద్య సేవలు అందించేలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలోని వేలాది పాఠశాలలను ఆధునీకీకరిచడంతో పాటు ఈ-లెర్నింగ్ సదుపాయాలు కల్పిస్తాం. కొత్తగా ఏడు జిల్లాలు, మున్సిపాల్టీలను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తాం. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూ.30వేల కోట్లతో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశ పెడతాం. ప్రతి కుటుంబానికీ శాశ్వత ఇంటి నిర్మాణం చేపట్టడంతో పాటు ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన తాగునీటి సరఫరా అందేలా చూస్తాం. ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, ఓడరేవు సౌకర్యాలు, వాణిజ్య మౌలిక సదుపాయాలు, అత్యాధునిక గ్లోబల్ ట్రేడ్ సెటర్‌ను అభివృద్ధి చేయడం ద్వారా బెంగాల్‌ను పెట్టుబడులు, వ్యాపారాలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం. వయో వృద్ధులందరికీ నిరంతరాయంగా వృద్ధాప్య పింఛను అందించడంతో పాటు అర్హులైన వారిని ఈ పథకం కిందకు తీసుకొచ్చి క్రమంగా విస్తరిస్తాం" అని మమతా బెనర్జీ హామీ ఇచ్చారు.

**అన్ని మతాలూ నాకు సమానమే: దీదీ**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం ఎన్‌ఆర్‌సీ, జనగణన పేరుతో ప్రజల పౌరసత్వాన్ని తొలగించేందుకు కేంద్రం ప్రణాళికలు రచిస్తోందని మమతా బెనర్జీ అన్నారు. మ్యానిఫెస్టో విడుదల చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా గెలుపునకు సహకరించేలా కేంద్రం, ఈసీ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు ప్లాన్ చేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామని భాజపాకు తెలుసు గనకే రాష్ట్రంలో 'అనధికార రాష్ట్రపతి పాలన' విధించారని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాపాడేందుకు భాజపాకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భయపెట్టినా, డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టినా అప్రమత్తంగా ఉండాలన్నారు. తాను విభజన రాజకీయాలు చేయడంలేదని, అన్ని మతాల ప్రజలూ తనకు సమానమేనని తెలిపారు. బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

### జనగణనలో సీనియారిటీ ప్రాతిపదికన
# ఉపాధ్యాయులను తీసుకోవాలి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 20 (జనంసాక్షి) :** 2026 వేసవి సెలవులలో నిర్వహించనున్న ఇండ్లగణన, జనగణనలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లుగా ఉపాధ్యాయులను సీనియార్టీ ప్రాతిపదికను తీసుకొనవలని శుక్రవారం పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయాల్లో తాసిల్దారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు చిప్ప యాదగిరి, మహేష్‌లు మాట్లాడుతూ వివిధ గ్రామాలలో నిర్వహించనున్న సర్వేలో అదే పట్టణం, గ్రామానికి చెందిన ఉపాధ్యాయులను కేటాయించలన్నారు. ఇంకను అవసరమైతేనే వేరే గ్రామంలోని ఉపాధ్యాయులను తీసుకోవలన్నారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు నాయకులు లావు కిరణ్ కుమార్, శ్రీపతి రాంప్రభుతో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా ఘూజి నియామకం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 20 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా నియామకం పొందిన మహమ్మద్ ఘూజి, ఈసందర్భంగా ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ని ప్రత్యేకంగా కలిసి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపినట్లు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమన్వయానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉంటానని అన్నారు. షబ్బీర్ అలీ, రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీకి నిబద్ధతతో సేవ చేస్తానని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మార్గదర్శకత్వంలో జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊపునిస్తామని, ప్రజలకు చేరువగా ఉండే విధంగా పార్టీ కార్యకలాపాలను విస్తరిస్తామని తెలిపారు. నాకు అప్పగించిన బాధ్యతను గౌరవంగా భావిస్తూ, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి మరియు కామారెడ్డి జిల్లా పురోగతికి అహర్నిశలు కృషి చేస్తాను అని మొహమ్మద్ ఘూజీ తెలిపారు.

# నిరాశ కలిగించేలా బడ్జెట్

### టిఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణ రావు



**కరీంనగర్ టౌన్, మార్చి 20 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ రాష్ట్ర సంక్షేమానికి పూర్తిగా విరుద్ధంగా ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మహిళలకు వాగ్దానం చేసిన తులం బంగారం, స్కూటీ పథకాలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అలాగే యువత ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ఉద్యోగాల క్యాలెండర్‌పై కూడా ప్రభుత్వం ఒక్క మాట ప్రస్తావించలేదు. రైతుల సంక్షేమంపై కూడా ఈ బడ్జెట్‌లో సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త ప్రాజెక్టుల సృష్టి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూడా ఎలాంటి ప్రోత్సాహక చర్యలు కనిపించడం లేదు. విద్యా వ్యవస్థ బలోపేతంపై కూడా స్పష్టమైన దృష్టి లోపించిందని విమర్శకులు అంటున్నారు. ఈ బడ్జెట్ ప్రజల ఆశలను నెరవేర్చేలా కాకుండా, నిరాశ కలిగించేలా ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇక ఉండవు

- హైకోర్టు ఆదేశంతో నిలిచిపోయిన వారసత్వ హక్కులు
- గుర్తింపు యూనియన్ గొప్పదనానికి చెంపదెబ్బ
- ఎన్నో ఏండ్లు కొట్లాడి సాధించిన హక్కు కథ సమాప్తం

**యైటింక్లయిన్ కాలనీ, మార్చి 20 (జనం సాక్షి):** సింగరేణి సంస్థలో వారసత్వ ఉద్యోగాలు ఇక ఉండవని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తరహాలో ఉద్యోగాలు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ ప్రకటనలను రద్దు చేస్తున్నట్లు తేల్చి చెప్పింది. కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి రిక్రూట్‌మెంట్ జరపాలని ప్రభుత్వం సింగరేణి సంస్థకు ఆదేశించిందని తెలుస్తోంది. కాగా, ఉద్యోగాలు వారసత్వంగా కుటుంబ సభ్యులకు ఇవ్వడాన్ని తప్పుపట్టుతూ కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ రద్దు తప్పదని స్పష్టమైంది.
హెచ్ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గోశిక అశోక్ మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు పొందిన యూనియన్ ఈ సంవత్సరం కొనసాగుతున్నప్పటికీ ఒక్కసారి కూడా యాజమాన్యంతో స్పష్టంగా మాట్లాడి ఈ హక్కును కాపాడలేకపోయిందని ఆరోపించారు. ఎన్నో ఏండ్లు కొట్లాడి సాధించిన డిపెండెంట్ ఉద్యోగ హక్కును గుర్తింపు పొందిన యూనియన్ ఏఐటీయూసీ, ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఐఎన్టీయూసీలు కలిసి ఈ రద్దు ప్రక్రియ వరకు తీసుకొచ్చారని విమర్శించారు.
ఐఎన్టీయూసీ యూనియన్ గొంతెత్తి అరుస్తున్నప్పటికీ అది తెగిన గాలిపటంలా గిల్లి కావడమే జరిగిందని అశోక్ వ్యాఖ్యానించారు. గుర్తింపు సంఘం మరో వారం రోజుల్లో సమ్మె చేస్తామని, ధర్నాలు, బయటయింపులు చేస్తూ వారసత్వ ఉద్యోగ హక్కును ఎట్టి పరిస్థితుల్లో కూడా కాపాడతామని, వెంటనే అమలు చేస్తామని ప్రకటిస్తోందని, గతంలో మీ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత మాదని సేవ్ సింగరేణి జాత పేరిట కార్మిక లోకాన్ని తప్పు పట్టిస్తున్న తరుణంలో హైకోర్టు తీర్పుతో వాస్తవం బయటపడిందని ఆయన ఎద్దేవా చేశారు. వారసత్వ ఉద్యోగాలను రద్దు చేస్తున్నట్లు ఒకవైపు హైకోర్టు తప్పుపడితే, మరొకవైపు గుర్తింపు యూనియన్ తప్పకుండా సమ్మె చేసి సాధిస్తామంటూ సింగరేణి వ్యాప్తంగా ధర్నాలు చేస్తోందని, ఇది కేవలం కార్మికులను తప్పు పట్టించుకోవడం కోసమా లేక వీరికి తెలిసి కూడా మద్దతు పొందడం కోసం చేస్తున్న నాటకమా అని కార్మిక లోకం గమనించాలని గోశిక అశోక్ పిలుపునిచ్చారు. హెచ్ఎంఎస్ యూనియన్ కార్మికులకు కనువిప్పు చేస్తున్నట్లు, వారసత్వ ఉద్యోగాల హక్కును కాపాడేందుకు నిజాయితీగా పోరాడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# జనాకర్షణే తప్ప వాస్తవికత లేని బడ్జెట్

## విద్యకు సరిపోని కేటాయింపులు

- పెండింగ్ బిల్లులు, పిఆర్సీ ప్రస్తావన లేకపోవడం విచారకరం
- ఉద్యోగుల ఆరోగ్య పథకం క్రింద ఉచిత వైద్యం స్వాగతిస్తున్నాం : టిఎస్ యుటిఎఫ్

**ముషీరాబాద్, మార్చ్ 20 (జనం సాక్షి):** జనాకర్షక పథకాలకే తప్ప ప్రస్తుత వ్యవస్థను బాగుచేసే విధంగా విద్యారంగానికి కేటాయింపులు లేవని టిఎస్ యుటిఎఫ్ అభిప్రాయపడింది. ఈ మేరకు శుక్రవారం టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి ప్రధాన కార్యదర్శి ఏ. వెంకట్ లు ప్రకటనలో తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ 3,24,234 కోట్ల బడ్జెట్ లో విద్య, మానవ వనరులకు కేటాయించింది 26,674 కోట్లు మాత్రమే. ఇది మొత్తం బడ్జెట్లో 8.2%. ఉదయం అల్పాహారం, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఆహ్వానించిందగిందేనని, గత సంవత్సరం కంటే రూ 3,566 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ పెంచిన మొత్తం బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు కోసమే సరిపోవచ్చున్నారు. అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, మధ్యాహ్న భోజనం నాణ్యత పెంపు గురించి అదనపు నిధుల కేటాయింపు ప్రస్తావన లేదనీ, గత సంవత్సరం 7.58 శాతం కేటాయించగా, ఈ సంవత్సరం 8.22 శాతం కేటాయించారు. విద్యకు 15% కేటాయిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ వరుసగా 3వ బడ్జెట్లో కూడా నెరవేరలేదనీ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సమీక్షించి కనీసం 15% కేటాయించాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి రూ 1056 కోట్లు కేటాయింపును స్వాగతిస్తున్నాం కానీ, పిఆర్సీ సంగతేంటనీ ప్రశ్నించారు.
ఉద్యోగుల ఆరోగ్య పథకానికి అయ్యే ఖర్చు మొత్తం రూ 1056 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే భరించి ఉద్యోగులకు, పెన్షనర్లకు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు డిజిటల్ హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని టిఎస్ యుటిఎఫ్ స్వాగతించింది. అదే సందర్భంలో తెలంగాణ రెండో పీఆర్సీ అమలు గురించి గానీ, అదనపు నిధుల కేటాయింపు గురించి గానీ బడ్జెట్ లో మాట మాత్రంగానైనా ప్రస్తావించకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశకు గురిచేసిందన్నారు. ఇప్పటికే పిఆర్సీ అమలు 33 నెలలు ఆలస్యమైందనీ, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మంచి పిఆర్సీ అమలు చేస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని 27 నెలలు గడుస్తున్నా నిలబెట్టుకోకపోవడం విచారకరమన్నారు. పెండింగ్ డిఎలు, పెండింగ్ బిల్లులు, 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు గురించి ప్రస్తావనే లేదు. రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సీ, పెండింగ్ బిల్లులు, బకాయిల గురించి స్పష్టత ఇవ్వాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది.

# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులే

- మూడవ సారి మొండి చెయ్యి
- బడ్జెట్‌ను సమీక్షించి విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి



**హయత్ నగర్, మార్చి 20 (జనం సాక్షి) :** అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి ఈ సారి కూడా తక్కువ కేటాయించారని, మొత్తం రాష్ట్ర బడ్జెట్ రూ.3,24,234 కోట్లలో కేవలం విద్యారంగానికి 26,674 కోట్లు అనగా మొత్తం బడ్జెట్లో విద్యకు 8.22 శాతం మాత్రమే కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్ లో గత సంవత్సర కేటాయింపుల కంటే ఇది కేవలం 0.63% మాత్రమే పెంచి కేటాయింపులను 8.22 శాతంకు కుదించారనీ బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తాము అధికారం లోకి వచ్చిన మొదటి సంవత్సరంలో 2024-25 లో 7.3 శాతం, రెండవ సంవత్సరం 2025-26 లో 7.57 శాతం, ప్రస్తుత బడ్జెట్ లో 8.22 శాతం మాత్రమే కేటాయించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తానిచ్చిన హామీనీ సైతం నిలబెట్టుకోక పోవడం శోచనీయం అనీ వారు ఎద్దేవా చేశారు. వరుసగా మూడవ బడ్జెట్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీనీ నెరవేర్చుకోలేక పోయిందని అన్నారు. ముచ్చటగా మూడోసారి కూడా బడ్జెట్ లో విద్యారంగానికి మొండి చెయ్యి ఇచ్చిందని వారు దుయ్యబట్టారు. విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అట్టహాసంగా ప్రకటిస్తూ, ఉన్న స్కూళ్లను బలోపేతం చేయడం విస్మరించి ఇంటిగ్రేటెడ్ స్కూళ్లంటూ, పబ్లిక్ స్కూళ్లంటూ విద్యా కమీషన్ రికమెండ్ చేసిన మేరకైనా 18 శాతం నిధులు కేటాయించకపోవడం అన్యాయమని వారుతెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అరకొర వసతులతో ఉన్న విద్యారంగం మరింత దుర్భర స్థితిలోకి పోతుందని వారు వివరించారు. రాష్ట్రం లోని విద్యావంతులు, సామాజికవేత్తలు, బాలల హక్కుల సంక్షేమ సంఘాలు, పౌర సమాజం గత కొన్ని నెలలుగా సభలు సమావేశాల ద్వారా, వివిధ ప్రాతినిధ్యాల ద్వారా విద్యారంగానికి కనీసం 20 శాతంకు తగ్గకుండా నిధులు కేటాయించాలని కోరుతూ వస్తున్నవి, కానీ అవేమీ పట్టించుకోకపోవడం విచారకరం. నాణ్యమైన విద్య, తరగతి గదుల నిర్మాణం, ఉపాధ్యాయుల నియామకం, బడులకు మౌళిక వసతులు, సానిటేషన్, కంప్యూటర్, గ్రంథాలయాలు, స్పోర్ట్స్ సౌకర్యాల కల్పన తదితర విషయాలన్నీ బడ్జెట్ కేటాయింపుల పైననే ఆధారపడి ఉంటుందనే విషయం గుర్తించాలని, ప్రభుత్వం బడ్జెట్ ను సమీక్షించి విద్యారంగానికి మరింత బడ్జెట్ కేటాయింపులు పెంచాలని వారు కోరారు. స్కూళ్ళలో ఉదయం అల్పాహారం, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలనే, ప్రభుత్వ ప్రతిపాదన ఆహ్వానిస్తున్నామని వారు అన్నారు.



# గోల్మాల్ బడ్జెట్

- అంకెల గారడీ బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేది శూన్యం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**బాల్కొండ, మార్చి 20 (జనంసాక్షి):** ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీతో పేద ప్రజలను, మహిళలను, నిరుద్యోగులను పూర్తిగా వంచించిన బడ్జెట్‌గా ఉందని అని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. గత సంవత్సరం బడ్జెట్ అంచనాలను ఈ ప్రభుత్వం అందుకోలేక పూర్తిగా విఫలమైందని ఇప్పటికే స్పష్టమైందని అన్నారు. అయినా కూడా మళ్ళీ అదే విధంగా అంకెల మాయాజాలంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది అని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలతో ఆశలు కల్పించి బడ్జెట్‌లో కేటాయింపులు చేయక పేద ప్రజలను నట్టేట ముంచారని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.

## ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు
### పోలీస్ స్టేషన్‌కు తరలింపు

**బొంరాస్ పేట, మార్చి 20 (జనం సాక్షి):** తమ సమస్యలు పరిష్కరించి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ. 18000 వేతనం నిర్ణయించాలని కోరుతూ శుక్రవారం కొడంగల్‌లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి వెళుతున్నారనే సమాచారంతో మండల పరిధిలోని ఆశా వర్కర్లను ముందస్తుగా స్థానిక పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు.తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

## వేసవిని దృష్టిలో ఉంచుకుని రెస్ట్‌హాల్లో కూలర్లు ఏర్పాటు చేయాలి
### హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

**యైటింక్లయిన్ కాలనీ మార్చి 20 (జనంసాక్షి):** సింగరేణి ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 ప్రాజెక్టులో వేసవిని దృష్టిలో ఉంచుకుని రెస్ట్‌హాల్స్‌లో కూలర్లు, క్వారీనందు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని హచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ పీట ఉదయ్ హరిజన్‌ను కోరారు. శుక్రవారం ఓసీపీ-3, ఎస్అండ్‌డీ సెక్షన్‌లో ఆయన పర్యటించి కార్మికులను పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఓ, మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ప్రధానంగా ఎస్ అండ్ డి సెక్షన్‌లో ఎస్కార్ట్ వాహనం ఎల్జీ వాహనాలు పాతవి కావడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని, వీటి స్థానంలో కొత్తవి తీసుకురావాలని రియాజ్ కార్మికుల వివరించారు, అలాగే సరైన పనిముట్లు సామాన్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికుల వివరించడం జరిగింది. కార్మికులకు ముఖ్యమైన రక్షణ పరికరాలు బూట్లు టోపీ రేడియం జాకెట్లు లేక ఇబ్బంది గురవుతున్నామని తెలుపగా వాటిని ఇప్పించామని తెలిపారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని రెస్ట్ హాల్లో కూలర్లు, క్వారీ నందు చలువ పందిర్లు ఏర్పాటు చేయవలసిందిగా యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యాక్షుడు రత్నాకర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యాక్షుడు దావు రమేష్, ఆరె మల్లేష్ పాల్గొన్నారు.

# షీ టీమ్స్.. మహిళలకు కొండంత అండ





- ఆకతాయిల వికృత చేష్టలపై ఉక్కుపాదం
- ఏడు రోజుల్లో 113 డెకాయ్ ఆపరేషన్లు.. 41 మంది రెడ్ హ్యాండెడ్ పట్టు
- అసాంఘిక కార్యకలాపాలపై షీ టీమ్స్ దాడులు.. 28 కుటుంబాల్లో వెలుగులు

**శేరిలింగంపల్లి, మార్చి 20 (జనం సాక్షి):** నగరంలో మహిళలు స్వేచ్ఛగా తిరగగలుగుతున్నారంటే దాని వెనకాల షీ టీమ్స్ ప్రస్థానం ఎంతో ఉంది. మహిళలు, చిన్నారుల భద్రత కోసం సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన షీ టీమ్స్ విభాగం నగరంలోని విద్యార్థినిలు, మహిళలు, యువతులతో పాటు అన్ని వర్గాల ప్రజల నుంచి మన్ననలు అందుకుంటోంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న సమయంలో ఐపీఎస్ అధికారిణి స్వాతి లక్రా ప్రోత్సాహంతో రూపుదిద్దుకున్న షీ టీమ్స్ సంస్థ పలు మార్పులు, సంస్కరణలతో అంతకంతకూ ఎదుగుతూ ప్రస్తుతం నగరంలో వికృత చేష్టలకు పాల్పడుతున్న చీడపురుగులు, ఆకతాయిల ఆగడాలను ఎక్కడికక్కడ తొక్కిపడేస్తూ సమన్విత స్థానానికి చేరుకుంది.
ఈ క్రమంలో ఈ నెల 14 నుంచి 20 వరకు షీ టీమ్స్ నేతృత్వంలో విస్తృత కార్యక్రమాలు, ఆకస్మిక దాడులు నిర్వహించడం జరిగిందని మహిళా శిశు సంక్షేమ విభాగం డీసీపీ సృజన శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. షీ టీమ్స్ నిఘాలో 113 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 41 మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 59 మందిపై పెట్టి కేసులు నమోదు చేయగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అదే విధంగా వివిధ మాధ్యమాల ద్వారా మహిళల నుంచి అందిన 26 ఫిర్యాదులను షీ టీమ్ బృందాలు స్వీకరించి పరిష్కరించాయి.
యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక రాత్రి సమయ దాడుల్లో ఒక ట్రాన్స్‌జెండర్, 2 పిఐటీఏ కేసుల్లో ఐదుగురు బాధితులను రక్షించి, ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. 2 జె జె యాక్ట్ కేసుల్లో 9 బాధితులైన బాలురను రక్షించి ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ సృజన వెల్లడించారు.
భార్యాభర్తల మధ్య తలెత్తిన కుటుంబ సమస్యలను పరిష్కరించే దిశగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు/సిడీఈడబ్ల్యూ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా నిర్వహించిన కౌన్సెలింగ్‌తో 20 కుటుంబాలు తిరిగి కలిసిపోయి తమ సమస్యలను పరిష్కరించుకున్నాయి.
సైబరాబాద్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల ద్వారా మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, సైబర్ వేధింపులు, ఈవ్ టీజింగ్, స్టాకింగ్, సైబర్ మోసాలపై మొత్తం 2992 మందికి అవగాహన కల్పించారు. మహిళల హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100, సైబర్ మోసాల ఫిర్యాదులకు 1930 సేవల ప్రాముఖ్యతను వివరించారు. షీ టీమ్స్ కృషి వల్ల నగరంలో మహిళలు భయం లేకుండా తిరగగలుగుతున్నారని, ఆకతాయిల వికృత చేష్టలపై ఉక్కుపాదం వేస్తున్నట్లు డీసీపీ సృజన తెలిపారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల పట్టివేత

- డ్రైవర్లతోపాటు యజమానులపై కేసు నమోదు
- అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్న ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్



**చిగురుమామిడి మార్చి 20 (జనంసాక్షి):** ప్రభుత్వం నుండి అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని చిగురుమామిడి ఎస్సై పృథ్వీధర్ గౌడ్ హెచ్చరించారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ గ్రామంలోని మోయ తుమ్మెద వాగు నుండి ప్రభుత్వ నుండి ఎలాంటి అనుమతి లేకుండా దొంగతనంగా వాగు నుండి ముల్కనూర్‌కు ఇసుక రవాణా చేస్తున్న 3ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.ఏపీ 15ఏయూ 3359నెంబర్ గల ట్రాక్టర్ డ్రైవర్ చెరుకు కుమారస్వామి,యజమాని అయిన మూలపాల శ్రీనివాస్,చెరుకు కుమారస్వామి రామంచ ట్రాక్టర్ నెంబర్ టీఎస్ 19 టి 7076 డ్రైవర్ కందుగుల ప్రశాంత్ దాని యజమాని అయిన తుంగ పరశురాములు, ట్రాక్టర్ నెంబర్ టి ఎస్ 22 టీ 1705 డ్రైవర్ నందకిశోర్,యజమాని అయిన వంటకాల రంజిత్ రెడ్డి అనువారిని పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. నుండి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేయడం నేరమని ఎస్సై హెచ్చరించారు.



## భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
### శ్రీ రామనవమి ఏర్పాట్లపై అధికారులతో ఈవో సమావేశం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 20 (జనంసాక్షి) :** హరిహర క్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయంలో ఈనెల 27న జరగనున్న శ్రీరామనవమి కళ్యాణోత్సవం ఏర్పాట్లపై శుక్రవారం ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఆలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామనవమి ఉత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు.భక్తులకు దర్శనం,తాగునీరు,ప్రసాదం, పార్కింగ్,భద్రత వంటి అంశాలపై ఆలయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.భక్తులకు స్వామివారి దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు పలెత్తకుండా ఆలయ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.ఈ సమావేశంలో ఆలయ ఏఈఓలు, ఇంజనీరింగ్ అధికారులు, సూపర్డెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిబ్బంది కోసం నూతన విశ్రాంతి గది
### ప్రారంభించిన సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్ బ్యూరో, మార్చి 20 (జనంసాక్షి) :** పోలీస్ సిబ్బంది సంక్షేమం పనితీరును మెరుగుపరిచే లక్ష్యంతో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం రోజు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో రాజీ పడబోమని, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను ఆధునీకరించి, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించడానికి విభాగం కట్టుబడి ఉందని సీపీ తెలిపారు. తగిన విశ్రాంతి పొందిన అధికారులు అత్యవసర సమయాల్లో, ప్రజలకు సేవ చేయడంలో మరింత చురుగ్గా, సమర్థవంతంగా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, రూరల్ ఏసీపీ విజయకుమార్, ట్రాఫిక్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తో పాటు ఎస్సైలు నరేష్, లక్ష్మా రెడ్డి లతో పాటు ఇతర పోలీసు అధికారులు, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అపర భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం
- భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు..
- సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్



**ఇల్లంతకుంట, మార్చి 21 (జనం సాక్షి) :** అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు సమన్వయంతో పనిచేసే విజయవంతం చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ అన్నారు. అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుండి ఏప్రిల్ ఆరో తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో తాసిల్దార్ కార్యాలయం లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి వివిధ గ్రామాల నుండే కాకుండా వివిధ జిల్లాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆర్ అండ్ బి అధికారులు రోడ్డులో మరమ్మత్తు చేయడంతో పాటు ఎండాకాల నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ముందస్తుగా వైద్య సిబ్బందితోపాటు అంబులెన్సును ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లో ఏర్పాటు, విఐపి గ్యాలరీల ఏర్పాట్లు, పార్కింగ్, అన్నదానం, సానిటేషన్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు అప్రమత్తంగా ఉండి తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం కంటే కూడా ఈ సంవత్సరం కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలు ఉన్నాయని భక్తుల సౌకర్యార్థం ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేయడంతో పాటు, త్రాగునీటి విషయంలో ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అనంతరం పోలీస్ శాఖ ఉన్నత అధికారులు కళ్యాణమండపం ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దార సురేష్ ,ఆర్డీవో రమేష్ బాబు, డిసిపి వెంకటరమణ, ఆర్ అండ్ బిడి రాజశేఖర్ రెడ్డి, ఈఈ ఇరిగేషన్ రాంకుమార్, ఏసిపి మాధవి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఇల్లంతకుంట దేవస్థానం చైర్మన్ రామారావు, ఇల్లందకుంట కార్యనిర్వాహణాధికారి సుధాకర్, డి ఎం రవీందర్ రెడ్డి, ఆర్టీవో వేణు, డిపిఓ జగదీశ్వర్, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ జావేద్, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ క్రాంతి కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణ కుమార్ ఠాకూర్ ఎన్ఎమ్‌డిసిలో డైరెక్టర్ (పర్సనల్)గా బాధ్యతలు

- ఇండియన్ రైల్వేల 1998 బ్యాచ్ ఐఆర్‌పిఎస్ అధికారి
- హెచ్‌ఆర్, పరిపాలనలో రెండున్నర దశాబ్దాల అనుభవం
- భారీ నియామకాలు, ప్రగతిశీల హెచ్‌ఆర్ కార్యక్రమాలకు నాయకత్వం



**హైదరాబాద్, మార్చి 20 (జనం సాక్షి):** ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీస్ (ఐఆర్‌పిఎస్) 1998 బ్యాచ్ అధికారి కృష్ణ కుమార్ ఠాకూర్ గురువారం భారతదేశంలోనే అతిపెద్ద ఇనుప ఖనిజం ఉత్పత్తిదారు ఎన్ఎమ్‌డిసి లిమిటెడ్‌లో డైరెక్టర్ (పర్సనల్)గా బాధ్యతలు స్వీకరించారు. భారతీయ రైల్వేలు, సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ యూనిట్లలో రెండున్నర దశాబ్దాల సేవలో మానవ వనరుల నిర్వహణ, పరిపాలనలో విస్తృత అనుభవం సంపాదించిన ఠాకూర్, ఎన్ఎమ్‌డిసిలో ఉద్యోగుల వృద్ధి, సంస్థాగత లక్ష్యాల సమలేఖనం, ప్రజల కేంద్రీకృత పర్యావరణ వ్యవస్థ బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తారని అంచనా వేస్తున్నారు. సోలాపూర్, భోపాల్, ముంబైతో సహా ప్రధాన రైల్వే డివిజన్లలో కీలక హెచ్‌ఆర్ విధులు నిర్వహించిన ఠాకూర్, వెస్టర్న్ రైల్వేలో రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ ఛైర్మన్‌గా భారీస్థాయి నియామకాలకు నాయకత్వం వహించారు. సుమారు 12,000 మంది ఉద్యోగుల నియామక ప్రక్రియను పర్యవేక్షించిన ఆయన, సంక్లిష్ట పారిశ్రామిక సంబంధాల నిర్వహణ, ఉత్పాదకత పెంపు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రగతిశీల హెచ్‌ఆర్ కార్యక్రమాలు అమలు చేశారు. రైట్స్ (ఆర్ఐటీఈఎస్)లో సౌదీ అరేబియాలోని అంతర్జాతీయ రైలు కార్యకలాపాల ప్రాజెక్ట్‌తో అనుబంధం కలిగి ఉన్న ఠాకూర్, కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్ (కేఆర్‌సీఎల్)లో హెచ్‌ఆర్ విభాగానికి నాయకత్వం వహించి విధానాలు, ప్రక్రియలను క్రమబద్ధీకరించారు. బీహెచ్ఈఎల్‌లో డైరెక్టర్ (హెచ్‌ఆర్)గా పనిచేసిన సమయంలో విధుల పునర్నిర్మాణం, విధాన సంస్కరణలు, ఏకరీతి ప్రోత్సాహక పథకం, బహుళ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, లేబర్ షెడ్‌ల ప్రామాణిక మార్గదర్శకాలు ప్రవేశపెట్టారు.

తిలకా మాంఝీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి అయిన ఠాకూర్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్) నుంచి సాహిత్యంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, హ్యూమన్ రిసోర్సెస్‌లో పీజీడీఎం పట్టా పొందారు. భారతీయ రైల్వేలు, పెద్ద సీపీఎస్‌యూలలో హెచ్‌ఆర్ రంగంలోని విస్తృత అనుభవం ఎన్ఎమ్‌డిసిలో ఉద్యోగుల వృద్ధి, సంస్థాగత లక్ష్యాల సమలేఖనం, ప్రజల కేంద్రీకృత పర్యావరణ వ్యవస్థ బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.



## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ రవిచంద్ర

**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** ముస్లిం సోదర సోదరీ మణులకు బి ఆర్ ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజులపాటు కఠినమైన ఉపవాస దీక్ష చేసిన ముస్లిం సోదర సోదరీమణులు ఈ పండగను ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు. త్యాగానికి, సహనానికి, భక్తి విశ్వాసాలకు ఈ పండగ ప్రత్యేకంగా నిలుస్తుందని, మనుషుల మధ్య సామరస్యం, ఐకమత్యం, సోదర భావం స్ఫూర్తితో ఘనంగా జరుపుకునే ఈ రంజాన్ పండగ ప్రత్యేకమైనదని అన్నారు.

## అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్ 2026 - 27

- ఆరు గ్యారంటీలకు అధిక నిధులు కేటాయించడం హర్షదాయకం
- అన్ని రంగాల, అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



**కరీంనగర్, మార్చి 20 ( జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉందని అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలకు, ఆరు గ్యారంటీలకు అధిక నిధులు కేటాయించడం ఇందిరమ్మ ఇండ్లకు పెద్దపీట వేయడం హర్షదాయకం అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా రవాణాకు ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం 2 లక్షల మందికి పెన్షన్లు ఇవ్వడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని నరేందర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలు మరింత అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లే విధంగా ఈ బడ్జెట్ రూపకల్పన చేశారని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కు, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు అభినందనలు తెలిపే సమయమిదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలం

- బడ్జెట్ లో విద్య, ఆరోగ్య రంగాలకు అన్యాయం
- ప్రజల ఆశలకు విరుద్ధంగా తెలంగాణ బడ్జెట్
- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి.



**కరీంనగర్ బ్యూరో, మార్చి 20 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ పై ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు కేటాయించిన నిధులు ప్రజల ఆశలకు, రాష్ట్ర అవసరాలకు సరిపోకుండా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఆయన గుర్తుచేశారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తామని, ఈ రంగాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన నిధులు కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని చెప్పారు. అయితే, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుత బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయించిన నిధులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల కొరత నివారణ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే కార్యక్రమాలకు సరిపోవని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యారంగానికి 26,674 కోట్లు అనగా మొత్తం బడ్జెట్లో విద్యకు 8.22 శాతం మాత్రమే కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్ లో గత సంవత్సర కేటాయింపుల కంటే ఇది కేవలం 0.63 శాతం మాత్రమే పెంచి కేటాయింపులను 8.22 శాతంకు కుదించారనీ కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో 2024-25 లో 7.3 శాతం, రెండవ సంవత్సరం 2025-26 లో 7.57 శాతం, ప్రస్తుత బడ్జెట్లో 8.22 శాతం మాత్రమే కేటాయించింది. కానీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తానిచ్చిన హామీనీ సైతం నిలబెట్టుకోక పోవడం శోచనీయం అనీ అన్నారు. ప్రభుత్వం వెంటనే తన వైఖరిని మార్చుకుని విద్యా, వైద్య రంగాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను పెంచాలని డిమాండ్ చేశారు.

## పన్నులు చెల్లించండి.. పట్టణ అభివృద్ధికి సహకరించండి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** పన్నులు చెల్లించండి..పట్టణ అభివృద్ధికి సహకరించండని వేములవాడ మున్సిపల్ చేర్మెన్ పుల్కం రాజు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో ఆయన మున్సిపల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో వంద శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యమని అధికారులను ఆదేశించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెలాఖరుతో ముగియనున్న క్రమంలో మున్సిపాలిటీకి రావాల్సిన ఆస్తిపన్ను బకాయిలను వంద శాతం వసూలు చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయమే ప్రత్యేక బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయికి వెళ్లి పన్నులు వసూలు చేయాలని, ఎక్కడైనా జాప్యం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు.పన్నుల వసూళ్ల సమయంలో అధికారులు, సిబ్బంది ప్రజలతో అత్యంత మర్యాదగా వ్యవహరించాలని, అదే సమయంలో పన్నులు చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.పట్టణ అభివృద్ధికి పన్నులే ప్రధాన వనరులని,ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు.ఆస్తిపన్ను వసూళ్ల ప్రక్రియలో పాలకవర్గ సభ్యులు కూడా అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఒకవేళ వసూళ్లలో ఎవరైనా అధికారులు లేదా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని చైర్మన్ హెచ్చరించారు. ముఖ్యంగా మొండి బకాయిదారుల విషయంలో కచ్చితంగా వ్యవహరించాలని, పన్నులు చెల్లించని పక్షంలో మున్సిపల్ చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మేనేజర్ సంపత్ రెడ్డి,ఎఈ అనన్య,శానిటేషన్ ఇన్స్పెక్టర్ సుకుమార్,వార్డ్ ఆఫీసర్స్,బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## బడ్జెట్ అంకెల గారడీ

**ఖమ్మం టౌన్(జనం సాక్షి) :** శుక్రవారం శాసన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉందని ఎంపి వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. ఈ బడ్జెట్‌తో రైతులకు, ఉద్యోగస్తులకి ప్రయోజనం లేదన్నారు. పేదల సంక్షేమానికి నిధులు ఇవ్వ లేదని ఇది దివాలాకోరు బడ్జెట్ అని దుయ్యబట్టారు. ముగ్గురు మంత్రులున్నా ఖమ్మం జిల్లా కు ఒరిగిందేమీ లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు

# మరోసారి చైర్మన్‌గా ఎన్నికైన "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, మార్చి 20 (జనంసాక్షి) :** సైక్లింగ్ క్రీడకు ప్రత్యేకత ఉన్నదని ఈ క్రీడకు విస్తృత ప్రచారం చాలా అవసరమని డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, చైర్మన్ కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, స్థానిక కరీంనగర్ లోని వావిలాల పల్లి లో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియలో పాల్గొని వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా కరీంనగర్ జిల్లా సైకిల్ అసోసియేషన్ కి ప్రత్యేకత ఉన్నదని, ఎన్నో టోర్నమెంట్లను నిర్వహించి క్రీడ స్ఫూర్తిని పెంపొందించిందని వారు చెప్పారు. అదే విధంగా రాష్ట్ర సంఘానికి సైతం చేయూతనిచ్చామని వారు నిర్వహించినటువంటి వివిధ రకాల టోర్నమెంట్లను, చాంపియన్షిప్ పోటీలను తరగని ఉత్సాహంతో చక్కటి సమన్వయంతో కార్యక్రమాలను సైతం జయప్రదం చేసి క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో చాలా కీలకంగా వ్యవహరించిందని చెప్పారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎన్నికైన మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, సైక్లింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అనేక చైతన్యవంతమైన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ప్రధానంగా నిర్వహించి క్రీడా స్ఫూర్తిని పరిరక్షించామని వారు చెప్పారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మాట్లాడుతూ... 2022 నుండి 26 వరకు కరీంనగర్ జిల్లా సంఘం వారి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను ముఖ్యంగా అవగాహన కల్పించే కార్యక్రమాలకు దీటుగా వివిధ స్థాయిలలో పాల్గొనే విధంగా అనేక కార్యక్రమాలను చాలా ఆదర్శంగా చేపడుతామని, నేటికీ అదే స్ఫూర్తితో పలు కార్యక్రమాలను వివిధ ప్రాంతాలను ఘనంగా నిర్వహిస్తామని వారు చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నేడు నిర్వహించినటువంటి ఎన్నికలలో నూతన కార్యవర్గం అంతయు ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం చాలా హర్షించదగ్గ విషయమని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఎన్నికలకు పరిశీలకులుగా రాష్ట్రం నుండి ఏ.కిషన్, జిల్లా యువజన క్రీడ విభాగం నుండి పవన్, ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధి జనార్ధన్ రెడ్డి, రిటర్నింగ్ ఆఫీసర్ గా, మాజీ కార్పొరేటర్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి టి. రమేష్ రెడ్డి వ్యవహరించారని వారు చెప్పారు. నూతనంగా అధ్యక్షునిగా డాక్టర్ కెప్టెన్ బి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురభి వేణుగోపాల్, కోశాధికారిగా విజగదీశ్వర చారి, ఉపాధ్యక్షులుగా ఎం.అరవింద్, ఎస్. రాజయ్య, ఎస్. అనుదీప్, సంయుక్త కార్యదర్శిగా ఎస్. ఇంద్రవేశ్, వి. రమేష్, జె. నరేష్, తదితరులు కాని వారికి సభ్యులుగా ఎన్నుకోబడ్డారని వారు చెప్పారు. ఈ సంఘానికి డాక్టర్ బంగారు స్వామి, ఎస్.కోదండరాములు ప్యాట్రన్స్ గా వ్యవహరిస్తారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తామని క్రీడల పట్ల చక్కటి వైఖరిని ప్రదర్శిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాకు మొండిచేయి

- అంకెల గారడీతో 2026-27 రాష్ట్ర బడ్జెట్.. ఒరిగేదేమీ లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత బడ్జెట్.. విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు
- ఆరు గ్యారంటీలు విస్మరణ.. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు లేవు



**కరీంనగర్ టౌన్, మార్చి 20 (జనం సాక్షి):** కరీంనగర్ జిల్లాలో రాష్ట్ర బడ్జెట్‌పై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీతో నిండి ఉందని, ప్రజలను మభ్యపెట్టేలా తయారైందని, అమలు చూస్తే శూన్యమని విపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ విద్యా కమిషన్ సిఫార్సుల మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, రూ.9500 కోట్లకు పైగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల ఊసే లేదని, కార్మికులు, రైతులు, కూలీలు, మధ్యతరగతి ప్రజలను మభ్యపెట్టే విధంగా బడ్జెట్ ఉందని విమర్శించారు. బడ్జెట్ ప్రజల చెవిలో పువ్వులు పెట్టేలా ఉందని, అంకెల గారడీ తప్ప ఒరిగేదేమీ లేదని, బడ్జెట్‌ను సవరించి ప్రాధాన్యత రంగాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ బడ్జెట్ ఆడంబరంగా అంకెల్లో ఉంది కానీ అమల్లో శూన్యమని, జిల్లా అభివృద్ధిపై బడ్జెట్‌లో ప్రస్తావనే లేకపోవడం బాధాకరమని అన్నారు. 5 లక్షల ప్రమాద బీమా, కామా విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఉద్యోగులకు ప్రమాద బీమా వంటివి మంచి శుభ పరిణామాలే అయినప్పటికీ, పేదలకు ఇండ్లు, పెన్షన్లు ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. వైద్య రంగానికి 4.2 శాతం నిధులు కేటాయించడం సరికాదని, కనీసం 10 శాతం కేటాయించాల్సి ఒదని అన్నారు. మొత్తంగా బడ్జెట్ బారెడు, అమలు మూరెడు ఉందని వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ పూర్తిగా మోసపూరితమని, బీసీ, ఎస్సీ, ఎస్టీ నిధుల కేటాయింపుల్లో వివక్ష జరిగిందని, ఆరు గ్యారంటీల ఊసే లేదని, ఇది పూర్తిగా అంకెల గారడీ అని ఆరోపించారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేశారని, రాజీవ్ యువ వికాసం పేరుతో రెండు లక్షల ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారని, నిరుద్యోగ భృతి విషయంలో నిరుద్యోగుల గొంతు కోసేశారని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసే బడ్జెట్ అని ఆయన అన్నారు. మొత్తంగా కరీంనగర్ జిల్లాలో రాష్ట్ర బడ్జెట్‌పై విపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. హామీల అమలు, జిల్లా అభివృద్ధి, విద్యా-ఆరోగ్య రంగాలకు నిధులు, ఉపాధి అవకాశాలు వంటి అంశాల్లో బడ్జెట్ వైఫల్యం చూపుతోందని విమర్శలు ఉన్నాయి.

# కాంగ్రెస్ 6 గ్యారంటీలు పెద్ద బోగస్

- 1000 రోజులు గడిచినా ఒక్క హామీ కూడా అమలు కాలేదు
- రేవంత్ ప్రభుత్వం మహిళలు, రైతులను తీవ్రంగా మోసం చేసింది
- బీజేపీ నిరసన: హామీల అమలుకు తక్షణ చర్యలు చేపట్టాలి



**కరీంనగర్ బ్యూరో, మార్చి 20 (జనం సాక్షి):** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజానీకాన్ని నమ్మించి మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు దాటినా ఏ ఒక్క గ్యారంటీని సక్రమంగా అమలు చేయలేక పోయిందని, 6 గ్యారంటీలు పూర్తి బోగస్ అని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ హామీల వైఫల్యాన్ని ఎండగడుతూ బీజేపీ రాష్ట్ర శాఖ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేసి చూపిస్తామని మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, నేడు 1000 రోజులు గడిచినా వాగ్దానాలను నిలుపుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో రేవంత్ ప్రభుత్వం ఉందని, సిగ్గుపడాలని విమర్శించారు.

మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఒక ఫ్రీ బస్సు, ప్రతి నెల రూ.2500, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చి ఎగ్గొట్టారని, రైతు భరోసాకు భరోసా లేకుండా పోయిందని ఆయన అన్నారు. రైతు కూలీలు, రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేశారని, ఎన్నికల మ్యానిఫెస్టోలో రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని ప్రకటించి రూ.12 వేలకు కుదించి రైతులను మోసం చేశారని విమర్శించారు. యువ వికాస పథకం గాలికి వదిలేశారని, 5 లక్షల విద్యా భరోసా కార్డు, ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు పత్తా లేకుండా పోయిందని అన్నారు. చేయూత పథకానికి చేయి చేసి, పెన్షన్లు పెంచుతామని పెన్షనర్లను మోసం చేశారని, రూ.4000 పెన్షన్ ఇవ్వడానికి హస్తం పార్టీకి చేతులు రావడం లేదని ఘాటుగా విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలం ఉన్నవారికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్న హామీలను అటకెక్కించారని, గృహజ్యోతి పథకం కింద అర్హులైన వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే స్కీమ్‌ను తూతూ మంత్రంగా అమలు చేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలను అమలు చేయలేని కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇప్పటికైనా హామీలను అమలు చేయడానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 6 గ్యారంటీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని, ప్రజానీకానికి అండగా ఉంటామని, మెడలు వంచినా సరే ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసేదాకా వదలమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధులు సంగప్ప, వై.సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, ఈ.నాగేశ్వర్ రెడ్డి, వసాల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, కల్లెం వాసుదేవరెడ్డి, రంగు భాస్కరాచారి, చొప్పరి జయశ్రీ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సోమిడి వేణు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బండా రమణ రెడ్డి, జిల్లా ఎలక్షన్ సెల్ కన్వీనర్, కార్పొరేటర్లు వొంటెల సత్యనారాయణ రెడ్డి, భూపతి రవీందర్, మ్యాకాల వెంకటేష్, మాసం గణేష్, ఏన్నం ప్రకాశ్, కరీంనగర్ జోన్, మండల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు వేశారు.. బ్రిడ్జి నిర్మాణం మరిచారు

- బ్రిడ్జి నిర్మించకపోవడంతో రైతులు, ప్రయాణికుల ఇబ్బందులు
- బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్న బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యాళ్ల జనార్దన్ రెడ్డి





**చిగురుమామిడి మార్చి 20 (జనం సాక్షి):** మండలంలోని పీచుపల్లి గ్రామం నుండి పర్లపల్లి వెళ్లే దారిలో రోడ్డు నిర్మాణం చేసిన అధికారులు బ్రిడ్జి నిర్మాణాన్ని మాత్రం మరిచిపోయారని,దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు,ప్రయాణికులు,రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేసిన సంబంధిత అధికారులు మాత్రం బ్రిడ్జి నిర్మాణం ఎందుకు చేయలేకపోయారో అర్థం కావడం లేదని ప్రయాణికులు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రం నుండి పర్లపెల్లి, మొగిలిపాలెం, కరీంపేట, కేశవపట్నం, పోలంపల్లి, మల్లాపూర్, నల్లగొండ, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ఈ దారి గుండా తమ తమ అవసరాల నిమిత్తం ప్రయాణికులు వస్తు వెళ్తుంటారు.రోడ్డు సౌకర్యం కల్పించినప్పటికీ ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడంతో పాటు కెనాల్ లో భారీ ఎత్తున సాగునీరు వెళ్తుండడం ప్రమాదకరంగా మారింది.పర్లపల్లి రైతులు పీచుపల్లి శివారులోకి రావాలన్నా,పిచుపల్లి రైతులు పార్లపల్లి శివారులోకి వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారని బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు,వార్డు సభ్యుడు యాళ్ల జనార్దన్ రెడ్డి తెలిపారు.ప్రజలకు అవసరం లేని చోట బ్రిడ్జిలను నిర్మించారని, అవసరం ఉన్న చోట ఇలా ఖాళీగా వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నారని జనార్దన్ రెడ్డి వివరించారు. వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే రైతులు,కూలీలు ఈ కెనాల్ వద్ద పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారన్నారు.రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి వెంటనే బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని యాళ్ల జనార్దన్ రెడ్డి కోరారు.

## ముస్లిం సోదర, సోదరీమణులకు

# రంజాన్ శుభాకాంక్షలు

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రేమ, కరుణకు ప్రతీక ఈ రంజాన్ అని అన్నారు. ఈ రంజాన్ మాసం ఉపవాస దీక్షలకు మాత్రమే పరిమితం కాదు.. మనుషుల మధ్య ప్రేమ, కరుణ, సహనాన్ని పెంపొందించే గొప్ప సందర్భమని అన్నారు. ఈ పండుగ మన లౌకికవాదానికి మరియు మత సామరస్యానికి నిదర్శనమని చెప్పారు. 'ఖురాన్ అవతరించిన ఈ పవిత్ర మాసంలో ముస్లింలు పాటించే నియమ నిష్ఠలు, క్రమశిక్షణతో కూడిన ప్రార్థనలు అభినందనీయం. ముఖ్యంగా జకాత్, ఫిత్రా రూపంలో పేదలకు చేసే దానధర్మాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. 'తెలంగాణ రాష్ట్రం గంగా-జమునా తెహజీబ్‌కు నెలవు. ఇక్కడ అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో, అన్నదమ్ములుగా జీవించడం మన గొప్ప సంప్రదాయం. ఈ ఐక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి, సంక్షేమానికి మా ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోంది. ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడటమే మా ప్రభుత్వ లక్ష్యం. అల్లా ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి. ప్రతి ముస్లిం కుటుంబం ఆనంద ఆరోగ్యాలతో, ఐశ్వర్యాలతో విరాజిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నాను. ఈ ఈద్ అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలి' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

# సాంకేతిక లోపంతో నిలిచిన మెట్రో సర్వీసులు

**కార్యాలయాలకు వెళ్లే సమయంలో ప్రయాణికులకు ఇబ్బంది**



**హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) :** నగరవాసులకు అత్యంత వేగవంతమైన ప్రయాణాన్ని అందించే హైదరాబాద్ మెట్రోలో మరోసారి సాంకేతిక సమస్య తలెత్తింది. అమీర్‌పేట్ -రాయదుర్గం (బ్లూలైన్) మార్గంలో శుక్రవారం ఉదయం సాంకేతిక కారణాల వల్ల రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాయదుర్గం వైపు వెళ్తున్న మెట్రో రైలు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ స్టేషన్‌లో అకస్మాత్తుగా ఆగిపోయింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో దాదాపు 12 నిమిషాల పాటు రైలు అక్కడే నిలిచిపోయింది. సాంకేతిక సమస్యతో మెట్రో సర్వీసులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దాదాపు 20 నిమిషాల పాటు సేవలు నిలిచిపోయాయి. మరమ్మతుల అనంతరం మెట్రో సర్వీసులు కొనసాగుతు న్నాయి. రాయదుర్గం- అమీర్‌పేటలో ఓ మెట్రో సాంకేతిక కారణంతో నిలచిపోయింది. దీంతో ఇరు మార్గాల్లో మెట్రో రైళ్లను ఆపేశారు. ఈ క్రమంలో ఎక్కడిక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. దీని ప్రభావంతో ఈ మార్గంలోని ఇరువైపులా నడిచే రైళ్లపై ప్రభావం పడింది. ఒక్కసారిగా రైళ్లు నిలిచిపోవడంతో కార్యాలయాలకు, ఇతర పనులకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెట్రో సిబ్బంది వెంటనే స్పందించి సాంకేతిక లోపాన్ని సరిచేశారు. సమస్య క్లియర్ కావడంతో రైళ్లు తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రైళ్ల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకుంటు న్నాయని మెట్రో అధికారులు తెలిపారు. అయితే, తరచూ ఇలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతుం డటం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మెట్రో యాజమాన్యం సరైన నిర్వహణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు మంగళం

- అంకెల గారడీతో బురిడీ కొట్టించారు
- మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**నిజామాబాద్, మార్చి 20 (జనంసాక్షి) :** తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ప్రజలను మోసం చేసేదిగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేది శూన్యమని పేర్కొన్నారు. మహిళలు,పేద ప్రజలను, నిరుద్యోగులను వంచించిన బ్జడెట్ అని ఆరోపించారు. ఆరు గ్యారంటీలకు మంగళం పాడిన బడ్జెట్ అని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే స్కీమ్‌లకు సరైన కేటాయింపులు లేవని, అవినీతి అవకాశాలు ఉన్న ప్రాజెక్టులకు భారీ నిధులు కేటాయిం చారని వెల్లడించారు.గత సంవత్సరం బడ్జెట్ అంచనాలను ఈ ప్రభుత్వం అందుకోలేక పూర్తిగా విఫలమైందని ఇప్పటికే స్పష్టమైందని అన్నారు. అయినా కూడా మళ్లీ అదే విధంగా అంకెల మాయాజాలంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. కోటి 58 లక్షల మహిళలకు ఇస్తానన్న రూ. 2,500 చేయూత పథకం ప్రస్తావనే లేదు. వృద్దులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంపు కేటాయింపులు లేవు.తులం బంగారం హామీ పూర్తిగా మర్చిపోయారు. జాబ్ క్యాలెండర్‌ను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. రైతు భరోసా పేరుతో హామీలు ఇచ్చినా, ఇప్పటివరకు మూడు పంటలకు ఎగ్గొట్టారని,ఆచరణ కు సాధ్యం కానీ రాజీవ్ యువవికాసానికి మాత్రం బ్జడెట్ లో ప్రతి సారి కేటాయింపులు చేస్తూ వస్తున్నారని ఆరోపించారు.ఈ ప్రభుత్వానికి భూములపై ఉన్న ప్రేమ, ప్రజలకు ఇచ్చిన హామీలపై లేదని తెలిపారు.

# అసెంబ్లీ ఆవరణలో పాము ప్రత్యక్షం



**హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) :** బడ్జెట్ సమావేశాల వేళ అసెంబ్లీ ప్రాంగణంలో పాము కలకలం రేపింది. పాత శాసనమండలి ఆవరణలో అనుకోకుండా జెర్రుగొడ్డు ప్రత్యక్షమైంది. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీస్ వెంటనే అప్రమత్తమై ధైర్యంగా పామును పట్టుకున్నారు. మలక్‌పేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన 2009 బ్యాచ్‌కు చెందిన వెంకటేష్ నాయక్ ఈ సాహసం చేశారు. పామును సురక్షితంగా పట్టుకుని, అటవీ శాఖ అధికారులకు అప్పగించేందుకు తరలిం చామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడటంలో ట్రాఫిక్ పోలీస్ వేగంగా స్పందించడం ప్రశంసనీయంగా నిలిచింది.

# ఇది ఫేక్, రివిజన్, ఫ్యాబ్రికేటెడ్ బడ్జెట్

- ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పుమోపారు
- బడ్జెట్ లో తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారు
- రాహుల్ గాంధీ మా హైదరాబాదీ సలీం ఫేక్ లాంటి వ్యక్తి..
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఫేక్, రివిజన్, ఫ్యాబ్రికేటెడ్ బడ్జెట్ ప్రవేశపెట్టిందని తెలంగాణ జాగృతి అధ్యక్షు రాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాం గులు, మైనార్టీల ఇలా అన్ని వర్గాలకు బడ్జెట్‌లో అన్యాయం చేశారని అన్నారు. బంజారా హిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. రైతుభరోసా, చేయూత పింఛన్లు సహా చాలా రంగాలకు గతేడాది కేటాయించిన నిధులనే అక్షరం మార్చకుండా అలాగే కొత్త బడ్జెట్ లోనూ పెట్టారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి కనీస విజన్ కూడా లేదని అందుకే ఇది రివిజన్ బడ్జెట్ అంటున్నామని మండిపడ్డారు. ఏటా బీసీలకు రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామంటూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఫేకారని.. కానీ బడ్జెట్ లో మాత్రం 4 శాతం నిధులే కేటాయించి బీసీలను మోసం చేశారన్నారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం మంది ఉన్న బీసీలకు 4 శాతం నిధులు ఇవ్వడం ఏమిటని నిలదీశారు. లక్షల కోట్లు అప్పులు తెస్తున్న రేవంత్ సర్కార్ ఆ డబ్బులను ఏం చేస్తుందని ప్రశ్నించారు. దాదాపు 8 లక్షల 64 వేల కోట్లు అప్పు చేసి ప్రతి ఒక్కరి తలపై రూ. 2 లక్షల 16 వేల భారం మోపారన్నారు. ఒక్కో కుటుంబంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.9 లక్షల అప్పుల భారం మోపిందన్నారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చినా ప్రజలకు మాత్రం పైసా మేలు జరగలేదన్నారు. మోడీ తన బడే భాయ్ అంటూ ఎన్నోసార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా ఎందుకు తేలేదో చెప్పాలని నిలదీశారు. ప్రజల కు మేలు చేయటం చేతకాని కాంగ్రెస్ నాయ కులు ఒకరిని మించి ఒకరు ఫేక్ తున్నారని మండిపడ్డారు. అందుకే ఇది ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వమని కవిత విమర్శించారు.

ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చి పెద్ద ఎత్తున హామీలిచ్చిన రాహుల్ గాంధీపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ఇచ్చిన హామీలన్నీ కూడా ఫేకే అన్నారు. హైదరాబాద్ లో సలీం ఫేక్ అనే నటుడి మాదిరిగానే రాహు ల్ గాంధీ కూడా ఫేక్ మాటలు చెబుతుం టాడని విమర్శించారు. అందుకే ఇక నుంచి రాహుల్ గాంధీకి రాహుల్ ఫేక్ గా నామ కరణం చేస్తున్నామన్నారు. సలీం ఫేక్ తన మాటలతో నవ్విస్తే...రాహుల్ గాంధీ మాత్రం తెలంగాణ ప్రజలను ఏడిపిస్తున్నారని మండిపడ్డారు.

బడ్జెట్ లో తెలంగాణ ఉద్యమకారులను ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న స్కీం ఈసారి కూడా పత్తా లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గతేడాదితో పోల్చితే రూ.7 వేల కోట్లు కోత పెట్టారని అన్నారు. సింగరేణి, ట్రాన్స్, జెన్ కో లకు ఇవ్వాల్సిన 1.50 లక్షల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త ఉద్యోగాల నియామకాలకు ఎలాంటి కేటాయింపులు లేవని, ఉద్యోగులు, పెన్షనర్లకు బడ్జెట్‌లో ఎలాంటి కొత్త కేటాయింపులు లేవన్నారు. కమీషన్లు వచ్చే యంగ్ ఇండియా స్కూళ్లకు మాత్రం రూ.5 వేల కోట్లు కేటాయించారని కానీ టీచర్ల రిక్రూట్ మెంట్ లేకుండా స్కూల్స్ నిర్మించి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. వరల్డ్ బ్యాంక్ ను మన భూములు ధారాదత్తం చేసే మూసీ ప్రాజెక్టుకు నిధులు కేటాయించారని అన్నారు. 3.24 లక్షల కోట్ల బడ్జెట్ లో క్యాపిటల్ ఎక్స్ పెండీచర్ కేవలం రూ.50 వేల కోట్లలోపేనని ఇలాగైనా సంపద సృష్టి ఎలా సాధ్యమవు తుందని ప్రశ్నించారు. రెవెన్యూ సర్ ప్లస్, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో అంచనాలను పెంచి ప్రజలను మోసం చేశారని కవిత అన్నా రు. కోటి మంది మహిళలను కోటీశ్వరు లను చేయడం అన్నింటికి మించిన ఫేక్ అన్నారు.

తెలంగాణ రైజింగ్ అంటూ ముఖ్యమంత్రి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంటారని కానీ నిరుద్యోగంలో మనం రైజింగ్ అవుతున్నామని కవిత చెప్పారు. స్టేట్ ఆఫ్ వర్కింగ్ అనే సర్వే సంస్థ చేసిన సర్వేలో తెలంగాణలో పెద్ద ఎత్తున నిరుద్యోగం ఉందని తేలిందని చెప్పారు. మహిళల విషయంలో 50 శాతం నిరుద్యోగిత రేటు ఉండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఇక ఆహారం కల్తీ విషయం లోనూ ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. స్త్రీ నిధి విభాగంలో 14 ఏళ్లుగా ఓ దయ్యం ఉందన కవిత అన్నారు. జి. విద్యాసాగర్ రెడ్డి అనే వ్యక్తి గత బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలను మేనేజ్ చేసి ఇప్పటికీ ఉద్యోగంలో కొనసాగుతున్నారన్నారు. అతను చేసే అక్రమాలపై విచారణ కమిషన్ వేసినప్పటికీ ఇప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే మంత్రి సీతక్క ఎంక్వైరీ చేయించి విద్యాసాగర్ ను తొలగించాలని డిమాండ్ చేశారు. యంగ్ స్కిల్స్ యూనివర్సిటీ గురించి బడ్జెట్ లో గొప్పలకు పోయారని.. ఆ సంస్థ వెబ్ సైట్ లో 64 వేల మంది ఎన్ రోల్ చేసుకున్నట్టుగా ఫేక్ ప్రచారం చేసుకుంటు న్నారని.. వాస్తవానికి స్కిల్ యూనివర్సిటీలో ఎన్‌రోల్ చేసుకున్నది 960 మంది మాత్ర మేనని అన్నారు. వెంటనే యూనివర్సిటీ వెబ్ సైట్ లోని తప్పుడు సమాచారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలపైనా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం

- డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) :** అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రాన్నిఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమా చార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందిం చాలని సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రవ్యా ప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వ హణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ నష్టాన్ని, ఆర్థిక నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొం దించడం, విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత పరిశోధన, పాలసీ సపోర్ట్ కేంద్రంగా పనిచేస్తుందని అన్నారు. శుక్రవారం సచివాలయంలోని తన కార్యాల యంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆ ర్ఎఫ్, హైడ్రా, ఐసిసిసి విభాగాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఏర్పాటు చేయాలని నిర్ణయిం చినట్లు వెల్లడిం చారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేం దుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వరదలు, అగ్నిప్రమా దాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందిం చడానికి కచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్, సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటివాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావే శంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ , అగ్నిమాపక శాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలి యన్ అడిషనల్ డిజీ సంజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి గుడిలో

# భట్టి పూజలు



**హైదరాబాద్, మార్చి20 (జనం సాక్షి) :** అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ముందు తెలంగాణ కేబినేట్ బడ్జెట్‌ను ఆమోదించింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రివర్గం సమావేశం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన భేటీలో.. రాష్ట్ర బ్జడెట్ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం మధ్యాహ్నం శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రవేశపెట్టారు. అంతకు ముందు బడ్జెట్ ప్రతులను తీసుకుని డిప్యూటి సిఎం భట్టి సచివాలయ ప్రాంగణంలోని అమ్మవారి గుడిలో పూజలు నిర్వహించారు.

# నేడు రంజాన్ సెలవు

- నేటి పదో తరగతి పరీక్ష ఏప్రిల్ 2కు వాయిదా

**అమరావతి, మార్చి20 (జనంసాక్షి) :** రంజాన్ సెలవును ఈ నెల 21వ తేదీ శనివారానికి మార్పు చేస్తూ ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మొదట మార్చి 20 న ప్రభుత్వం రంజాన్ సెలవుగా ప్రకటించింది. మతపెద్దల నిర్ణయం మేరకు 21వ తేదీ శనివారం రంజాన్ పర్వదినాన్ని నిర్వహిస్తుండటంతో ఆ రోజును సెలవుగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని తెలిపింది. కాగా శనివారం జరగాల్సిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షను వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షను ఏప్రిల్ 2 న నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- మంత్రి శ్రీహరి ఇంటిని ముట్టడించిన ఆశా కార్యకర్తలు




**నారాయణపేట, మార్చి20 (జనంసాక్షి) :** తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఇంటిని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ముట్టడిం చారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే కోరుతూ పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు అక్కడికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొన్ని రోజులుగా ఆశా కార్యకర్తల సమస్యలపై పోరాటాలు చేస్తున్నా గాని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఆశా వర్కర్లకు రూ. 18 వేలు వేతనం వెంటనే అమలు చేయాలని, ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆశా వర్కర్లపై పెరుగుతున్న పనిభారం తగ్గించి, అదనపు భత్యాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలన్నారు. గర్భిణిలు, శిశు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశాలకు ప్రత్యేక గౌరవ వేతనం ఇవ్వాలి. ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు.

# చెవిలో పూలు పెట్టిన భట్టి బడ్జెట్

- అన్ని వర్గాలను విస్మరించిన కేటాయింపులు
- బిఆర్ఎస్ ఎమ్మెల్యేల చెవిలో పూలతో విమర్శలు




**హైదరాబాద్, మార్చి20 (జనంసాక్షి) :** బడ్జెట్ మొత్తం మోసమని, అన్ని వర్గాల ప్రజల చెవిలో కాంగ్రెస్ ప్రభుత్వం పువ్వులు పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్ మొత్తంలో ఎక్కడ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే అంశమే లేదన్నారు. ఆరు గ్యారంటీల ఊసే తీయలేదని మండిపడ్డారు. కేవలం కుంభకోణాల కోసమే కాంగ్రెస్ సర్కారోళ్లు ఈ బడ్జెట్ పెట్టుకున్నరని ఆరోపించారు. ఈ మేరకు గంగుల కమలాకర్, వివేకానందలో కలసి చెవిలో పూలతో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై బ్జడెట్‌లో ఎలాంటి అంశం లేదని విమర్శించారు. రైతు భరోసాను ఇచ్చిన మాట ప్రకారం ఈ సారైనా ఎకరానికి రూ.15 వేలకు పెంచుతారని ఆశించామని, కానీ ఊసే తీయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆఖరికి ఆ రూ.12 వేల చొప్పున కూడా ఎప్పుడు ఇస్తారో చెప్పలేదని ధ్వజమెత్తారు. రైతులకు ఏడాదికి రూ.12 వేల అంశం కూడా ఉత్తమాటగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఇక మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డితోసహా కాంగ్రెస్ నేతలు జోరుగా ప్రచారం చేశారని, కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఆ హామీని నెరవేర్చలేదని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది ఆడబిడ్డలను దగా చేయడమేనని మండిపడ్డారు. వృద్ధాప్య పించన్‌లు, వికలాంగ పించన్‌ల విషయంలో కూడా ప్రభుత్వం మాటతప్పిందని విమర్శించారు. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులు రూ.6 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆగ్రహించారు.

## మద్యం కేసులో అవినాశ్ రెడ్డికి రెగ్యులర్ బెయిల్ మంజూరు

**న్యూఢిల్లీ, మార్చి 20 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడైన ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. అవినాశ్‌కు సుప్రీం కోర్టు రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. మద్యం కుంభకోణం కేసులో ఏ-7గా ఉన్న అవినాశ్ రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుంది. కోర్టు అనుమతితో జరిగిన ఈ విచారణలో అవినాశ్ కీలక విషయాలు వెల్లడించినట్లు సమాచారం. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాత్ర, అంతిమ లబ్దిదారుడికి సంబంధించిన విషయాలపై అవినాశ్ రెడ్డి వివరాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ స్కామ్ లో రాజ్ కసిరెడ్డి ప్రధాన నిందితుడిగా ఉండగా, అవినాశ్ రెడ్డి ఆర్థిక నియంత్రణ, లావాదేవీలలో ముఖ్యపాత్ర వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసుకు సంబం ధించి విచారణ ఇంకా కొనసాగుతోంది

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370